
అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 19-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 231 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



ప్రయివేటు ఐఏఎస్‌లు!

అధికారుల భర్తీకి మోడీ సర్కారు అడ్డదారులు

ప్రస్తుతం దేశంలో ఐఏఎస్ అధికారుల కొరత తీవ్రంగా ఉన్నది. ఇలాంటి నేపథ్యంలో కేంద్రంలో పాలనాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో మోడీ సర్కారు దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో నిపుణులతో ఈ ఖాళీలను భర్తీ చేయాలని చూస్తున్నది. కేంద్ర ప్రభుత్వంలోని ఖాళీలను పరిష్కరించేందుకు, పాలనలో డొమైన్ నైపుణ్యాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా 24 కేంద్ర మంత్రిత్వ శాఖలలోని జాయింట్ సెక్రెటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ వంటి 45 పోస్టులకు 'లేటరల్ ఎంట్రీ'కి దరఖాస్తులు కోరుతూ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. యూపీఎస్సీ పరీక్ష ద్వారా ఐఏఎస్‌లు అయినవారు కాకుండా.. సంబంధిత విభాగాల్లో ఉన్న నైపుణ్యం, అనుభవం ఆధారంగా బయటి వ్యక్తులను కేంద్రం ప్రకటించిన పోస్టుల్లో భర్తీ చేసే విధానమే లేటరల్ ఎంట్రీ. అంటే, కేంద్ర ప్రభుత్వంలోని విభాగాల్లో ఉన్నత స్థాయి పోస్టుల్లో కాంట్రాక్టు ప్రాతిపాదికన ప్రయివేటు వ్యక్తుల నియామకం అన్నమాట. అయితే, కీలకమైన కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఇలా ప్రయివేటు వ్యక్తులకు అవకాశం కల్పించటమేమిటనినిపుణులు, మేధావులు, విశ్లేషకులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. మోడీ సర్కారు తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు.

లేటరల్ ఎంట్రీ కోసం దరఖాస్తులు

- వివిధ విభాగాల నుంచి నిపుణుల కోసం అన్వేషణ
- రిక్రూట్‌మెంట్‌ను ప్రకటించిన కేంద్రం
- ప్రయివేటు వ్యక్తులతో భర్తీకానున్న పెద్ద పోస్టులు
- ఎన్డీఏ ప్రభుత్వం తీరుపై విమర్శల వెల్లువ

న్యూఢిల్లీ : 2018లో లాటరల్ ఎంట్రీ స్కీమ్ ప్రారంభించినప్పటి నుంచి ఇదే అతిపెద్ద సంఖ్య కావటం గమనార్హం. యూపీఎస్సీ జాయింట్ సెక్రెటరీల స్థాయిలో 10, డిప్యూటీ సెక్రెటరీ, డైరెక్టర్ల స్థాయిలో 35 పోస్టులను కేంద్రం ప్రకటించింది. జూన్‌లో ఒక వార్త సంస్థ నివేదించిన సమాచారం ప్రకారం.. కేంద్ర ప్రభుత్వంలో ఐఏఎస్ అధికారుల కొరతను ఎదుర్కోవటానికి పెద్ద సంఖ్యలో లేటరల్ ఎంట్రెంట్స్ అవసరమున్నదని సిబ్బంది, శిక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. "అధిక సంఖ్యలో అధికారులను నియమించుకోవటానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి, గవర్నెన్స్‌లో డొమైన్ నైపుణ్యాన్ని పరిచయం చేయటం. అయితే ఇది ఐఏఎస్ అధికారుల కొరత సమస్యను పరిష్కరించడం కూడా" అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీఓపీటీ) అధికారి ఒకరు తెలిపారు. "ఈ కారణంగా సివిల్ సర్వీస్ పరీక్ష ద్వారా ఐఏఎస్ అధికారులను చేర్చుకోవటాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నది. అయితే ఇది చాలా క్రమక్రమంగా జరగాలి. ఎందుకంటే ఇది చివరికి కెరీర్ పురోగతిలో సమస్యలను కలిగిస్తుంది" అని సదరు అధికారి వివరించారు. నీతి ఆయోగ్, సెక్టోరల్ గ్రూప్ ఆఫ్ సెక్రెటరీస్ ఆఫ్ గవర్నెన్స్ తమ నివేదికలో 2017లో సిఫారసు చేసిన తర్వాత.. మధ్య, సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలలోని అధికారులను చేర్చటం కోసం ప్రభుత్వం 2018లో లేటరల్ ఎంట్రీ పథకాన్ని మొదటిసారిగా అమలు చేసింది. ఆ తర్వాత కేంద్రం చేపట్టిన ఐదో రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ఇది. అయితే, ఇది ...13లో

> ప్రభుత్వంలో 1000 మందికి పైగా ఐఏఎస్ అధికారుల కొరత ఉన్నది. 'లేటరల్ ఎంట్రీ' ఈ సమస్యను ఎలా పరిష్కరించగలదు?. 2023 ప్రభుత్వ డేటా ప్రకారం.. 1,469 మంది అధికారుల సంఖ్యకు గానూ 442 మంది ఐఏఎస్ అధికారులు మాత్రమే కేంద్రంతో పని చేస్తున్నారు.

కీలకస్థానాల్లో ఆర్ఎస్సెస్ శక్తులను నింపే యత్నం

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేందుకు, రిజర్వేషన్లను తిరస్కరించేందుకే. మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 24 మంత్రిత్వ శాఖల పరిధిలోని జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లుగా 45 మందిని లాటరల్ ఎంట్రీ ద్వారా చేర్చుకోవాలని నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వంలోని కీలకస్థానాల్లో ...13లో



యువత హక్కులను దోచుకోవడమే

రిజర్వేషన్‌ను అంతం చేయడమే మోడీ హామీ : రాహుల్

"ఐఏఎస్ వ్యవస్థను ప్రయివేటీకరించడం, రిజర్వేషన్‌ను అంతం చేయడమే 'మోడీ హామీ'. ప్రభుత్వ ఉద్యోగులను లేటరల్ ఎంట్రీ ద్వారా రిక్రూట్ చేసుకునేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్య "దేశ వ్యతిరేకమైనది". ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బాహాటంగా లాక్కుంటున్నారు. యూపీఎస్సీకి బదులుగా రాష్ట్రీయ ...13లో

రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ

సీఎల్పీ ఆమోదం

నేటి ఉదయం 11 గంటలకు నామినేషన్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా అధిష్టానానికి ధన్యవాదాలు తెలుపుతూ సీఎల్పీ తీర్మానం చేసింది. ఆదివారం గచ్చిబౌలిలోని షెర్టాన్ హోటల్‌లో సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశమైంది. అభిషేక్ పరిచయ కార్యక్రమంతోపాటు, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించింది. రాష్ట్ర కాంగ్రెస్ ...6లో

నిజాం షుగర్స్ పునఃప్రారంభిస్తాం

దానికోసం పూర్తిసహకారం అందిస్తాం

క్షత్రియులు అన్ని రంగాల్లో రాణిస్తారు : క్షత్రియ సేవా సమితి సన్మానసభలో సీఎం రేవంత్‌రెడ్డి

3లో..



హత్యాచారం కేసులో కదలిక..

కోల్‌కతా ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీం..రేపు విచారణ



బీజేపీ మాజీ ఎంపీకి పోలీసుల సమన్లు

వర్షంలోనూ ఆందోళనలు..మూడోరోజూ సీబీఐ విచారణ

న్యూఢిల్లీ : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై సుప్రీంకోర్టు ఆదివారం స్పందించింది. ఈ ఉదంతాన్ని సుమోటోగా స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ...13లో

ఈ ప్రశ్నలకు బదులేది?

బ్లాక్‌స్టోన్‌తో సెబీ చీఫ్ సంబంధాలపై అనుమానాలు



న్యూఢిల్లీ : పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ తనపై చేసిన ఆరోపణలను సెబీ చీఫ్ మాధబి పురి బచ్ ఇటీవల తోసిపుచ్చారు. అదానీ గ్రూపునకు చెందిన ఆఫ్‌షోర్ ఫండ్స్‌లో మాధబికి వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ బయటపెట్టిన విషయం తెలిసిందే. ఇతర కంపెనీలతో ఆమె సంబంధాలపై కూడా పలు ప్రశ్నలు తలెత్తాయి. వీటికి ఇప్పటి వరకూ సమాధానాలు లభించలేదు. ముఖ్యంగా అమెరికాకు చెందిన ప్రైవేటు ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్‌తో మాధబికి ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో 'విరుద్ధ ప్రయోజనాల' (కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్) పై అనేక ప్రశ్నలను ఆర్థిక నిపుణులు లేవనెత్తారు.

'బ్లాక్‌స్టోన్ సంస్థ భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టింది. అది భారత్‌లో అనేక కంపెనీలకు ప్రమోటర్‌గా వ్యవహరించింది. భారత్‌లో బ్లాక్‌స్టోన్ పెట్టిన భారీ పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుంటే మాధబి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నంత మాత్రాన సరిపోదని అర్థమవుతోంది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని సీనియర్ ఫండ్ మేనేజర్ ఒకరు 'ది మార్నింగ్ కాంటెస్ట్' పోర్టల్‌కు తెలిపారు. బ్లాక్‌స్టోన్‌తో సెబీ చీఫ్ సంబంధాలను గమనిస్తే హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉంటాయని అర్థమవుతోంది.

మాధబి సెబీ అధిపతి కాకముందే బాగా పేరున్న ప్రైవేటు రంగ ఎగ్జిక్యూటివ్ అని, దీనివల్ల 'విరుద్ధ ప్రయోజనాలు' చేకూరే అవకాశం ఉన్నదని సెబీ గుర్తించాల్సి ఉంటుంది. బ్లాక్‌స్టోన్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలలోనూ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నానని మాధబి ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. అయితే బ్లాక్‌స్టోన్‌కు పలు అనుబంధ సంస్థలు ఉన్నాయి. వీటిలో కొన్ని సొంతవి కాగా మరికొన్ని ఎక్కువ ...13లో

పర్యాటక కేంద్రాలుగా సర్వాయి పాపన్న కోటలు

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు : మంత్రి పొన్నం



నవతెలంగాణ-కల్చరల్

సర్దార్ సర్వాయి పాపన్న ఏలిన సర్వాయిపేట, కిలాసాపేట, తాటికొండ, భువనగిరి వంటి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి రూ.4 కోట్లు 70 లక్షలు బడ్జెట్‌లో కేటాయించినట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఇందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయత్నం చేశారని తెలిపారు. నగరంలోని ప్రధాన ప్రాంతంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో పాపన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బీసీ సంక్షేమ శాఖ, పాపన్న ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాపన్న 374వ జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం హాజరై మాట్లాడారు. పాపన్న జీవిత కథ చిన్న సంపుటాలుగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పాపన్న ఆశయాలు మేరకే బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సే లక్ష్యంగా పాలన చేస్తున్నామని తెలిపారు. విద్య సామాన్యులకు చేరాలనే లక్ష్యంతో గ్రామాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేసి వాటిని నాలెడ్జ్ సెంటర్లుగా చేసేందుకు రూ. 5 వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఆత్మ గౌరవం ఉన్న వ్యక్తులు వ్యతిరేక పవనాలను అనుకూలంగా మలచుకుంటారని, ఇందుకు పాపన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పాపన్న జీవిత కథ నేటి యువతకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. పాపన్న 400 ఏండ్ల క్రితమే సామాజిక సమానత్వం కోసం ఉద్యమించారని కొనియాడారు. ఆయన విగ్రహం టాంక్ బండ్‌పై ప్రతిష్ఠిస్తామని చెప్పారు. కుల గణన చేసిన తర్వాత స్థానిక ఎన్నికలు జరుపుతామని చెప్పారు. రెండు లక్షల మంది గీత కార్మికులకు రక్షణ మోకీలు అందిస్తామని, తొలి విడతలో పది వేల మందికి అందించామని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కుల వృత్తులు మారేలా ...13లో

రైతు రుణమాఫీ 40 శాతమే

అర్హులకు కాంగ్రెస్ అన్యాయం చేసింది

రాహుల్, ఖర్గేకు కేటీఆర్ లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీ పేరుతో మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆ పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. "వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ హామీ ఇచ్చింది.. కానీ రాష్ట్ర ప్రభుత్వం అనేక షరతులు పెట్టి 40 శాతం మందికి మాత్రమే మాఫీ చేసింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణమాఫీ చేయాలి" అని లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రూ. లక్ష రుణమాఫీ చేస్తేనే రూ.17 వేల కోట్లు ఖర్చు కాగా, 36 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరిందని పేర్కొన్నారు. "రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్క ప్రకారం 47 లక్షల మంది రైతులకు, రూ.2 లక్షల రుణమాఫీకి రూ.49,500 కోట్లు అంచనా వేశారు. రాష్ట్ర కాబినెట్ సమావేశం వరకు రూ. 31 వేల కోట్లకు కుదించారు. రాష్ట్ర బడ్జెట్‌లో మరింత కోత పెట్టి రూ. 26 వేల కోట్లు మాత్రమే ...13లో

మీ డేటా నా దగ్గరుంది

బీఆర్ఎస్ పాలనలో దాడులపైనా ఫిర్యాదు చేయండి

కేటీఆర్‌కు మంత్రి డాక్టర్ సీతక్క కౌంటర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2023 వరకు మహిళలపై జరిగిన దాడులపైనా మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) సూచించారు. హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడ షేర్టాన్ హోటల్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. 2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో మహిళలపై జరిగిన దాడులు, లైంగిక దాడుల క్రైమ్ డాటా తన దగ్గర ఉందనీ, కావాలంటే కేటీఆర్‌కు కూడా ఆ డాటా ఇస్తానని చెప్పారు. ఎన్సీఆర్బీ డేటాను మీడియాకు విడుదల చేశారు. 2014 లో 14,417, 2015లో 15425, 2016లో 15,374, 2017లో 17,521, 2018లో 16, 027, 2019లో 18,394, 2020లో 17,791, 2021 లో 20,865, 2022 లో 22,066 కేసు లు నమోదయ్యాయని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామంలో ఇద్దరు స్కూల్ విద్యార్థినిలపై లైంగిక దాడి, హత్య ఘటనను, హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ సమీపంలో మహిళపై సామూహిక లైంగిక దాడి, దిశ కేసు, మీర్పేట్, పోచంపల్లి, ...13లో

చదువంటే సమాజాన్ని సంస్కరించే జ్ఞానం

పిల్లలూ..సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

- తల్లిదండ్రులూ..ఇతర యాక్టివిటీల్లోనూ ప్రోత్సహించండి
- రోజుకో కొత్త విషయం నేర్పుతూ ప్రపంచ జ్ఞానాన్ని అందించండి : జనగణమన జయకేతనం సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు
- 'తెలంగాణ బాలోత్సవం'కు రూ.25వేల విరాళం ఇచ్చిన డాక్టర్ కేవీ.రమణాచారి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చదువంటే కేజీలు.. పీజీలు.. బీటెక్‌లు.. ఎంటెక్‌లు..ర్యాంకులు కానేకాదనీ, చదువంటే సమాజాన్ని సంస్కరించే జ్ఞానమని రాష్ట్ర సాంస్కృతిక, టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నొక్కిచెప్పారు. దేశభక్తిని పిల్లల్లో పెంపొందించేందుకు ఇలాంటి బృహత్కర కార్యక్రమాన్ని తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించడం ఇదే తొలిసారి అంటూ బాలోత్సవ కమిటీ నిర్వాహకులను అభినందించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో 'జనగణమన జయకేతనం..దేశభక్తి గీతాలకు నృత్యనీరాజనం' పేరుతో విద్యార్థులు నృత్యప్రదర్శనలు చేశారు. దేశభక్తి గీతాలను పాడి వినిపించారు. 'మత్తు మహమ్మారిని రాష్ట్రం నుంచి తరిమికొడతాం..యువతను కాపాడుకుందాం' అంటూ కార్యక్రమానికి హాజరైన ప్రతిఒక్కరూ ప్రతినబూనారు. పిల్లల కళాప్రదర్శనల అనంతరం మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ..బాల్యంలో ప్రతి క్షణమూ విలువైనదేననీ, దాన్ని తిరిగి పొందలేమని చెప్పారు. పిల్లలు టీవీలు, ఫోన్లకు అలవాటు పడకుండా ...13లో

బీఆర్ఎస్ ఔట్‌డేటెడ్ పార్టీ

విలీనం, పొత్తులు గంగలో కలవనీయండి

వాటితో ప్రజలకేం సంబంధం : కేంద్ర మంత్రి బండి




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ఔట్‌డేటెడ్ పార్టీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. ఆ పార్టీ విలీనం, పొత్తులు గంగలో కలువనీయండి.. వాటితో ప్రజలకేం సంబంధం అంటూ ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కోఠిలో ఆయన ...13లో

ఏపీ నాన్ ప్రయారిటీ సెక్టార్లో ఎన్‌పీఏగా రూ.6,358 కోట్లు

- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే రూ.3,752 కోట్లు
- యూనియన్ బ్యాంకు రుణాలు రూ.1,687.99 కోట్లు



అమరావతి : ఏపీ బ్యాంకింగ్ రంగంలో నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పిఎ) పెరిగిపోతున్నాయి. నాన్ ప్రయారిటీ రంగంలో బకాయిల సంఖ్య వందల కోట్ల నుండి వేల కోట్లలోకి చేరింది. వీటిపై బ్యాంకర్లు పెద్దయెత్తున ఆందోళన చెందుతున్నారు. రుణాలు తీసుకున్న సంస్థలు తిరిగి చెల్లింపులు చేయకపోవడంతో సమస్య జఠిలమవుతోందని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఎన్‌పిఎల సంఖ్య ఎక్కువగా ఉంటోందని, రుణాలు తీసుకున్న సంస్థలు తిరిగి చెల్లింపులు చేయడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వాటిని వసూలు చేయడం తలకుమించి పనిగా మారుతోందని ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే రుణాల్లోనూ తమ సెక్టార్ నుండే ఎక్కువ రుణాలు ఇస్తున్నామని, కమర్షియల్ బ్యాంకుల నుండి ఇచ్చే రుణాలు తక్కువగా ఉంటున్నాయని, దీంతో ఎన్‌పిఎల సంఖ్య ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే ఎక్కువగా ఉంటోందని బ్యాంకు అధికారుల సంఘం నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 33 బ్యాంకులు, ఒక కో-ఆపరేటివ్ బ్యాంకు, నాలుగు ఆర్‌ఆర్‌బిలు, మూడు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో 71,66,390 ఖాతాలు ఉండగా, వాటికి గానూ 3,46,550.93 కోట్లు రుణాలిచ్చారు. అలాగే 2,47,648 ఖాతాలకు సంబంధించి రూ.6,358.96 కోట్లు ఈ ఏడాది మార్చి 31 నాటికి ఎన్‌పిలుగా మారాయి. వీటిల్లో ముఖ్యంగా యూనియన్ బ్యాంకుకు సంబంధించిన 29,490 ఎన్‌పిఎ ఖాతాలకు రూ.1,687.99 కోట్లు ఉన్నాయి. మొత్తంగా ఈ బ్యాంకు 2024 మార్చి 31 నాటికి 4,26,544 ఖాతాలకు రూ.41,500 కోట్ల రుణాలిచ్చింది. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.1,11,407 కోట్లు ఇవ్వగా, ఈ బ్యాంకుకు సంబంధించిన ఎన్‌పిఎగా మారిన రుణాలు రూ.475.79 కోట్లున్నాయి. అలాగే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు సంబంధించి రూ.662.68 కోట్లు ఎన్‌పిఎలుగా మారాయి. ఎపి కో-ఆపరేటివ్ బ్యాంకు రూ.8,102 కోట్ల రుణాలిస్తే.. రూ.424 కోట్ల బకాయి ఉంది. ఎపిజిబి, ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు, సిజిజిబి, సప్తగిరి గ్రామీణ బ్యాంకులకు సంబంధించి మొత్తం రూ.91.76 కోట్ల రుణ బకాయిలు ఉన్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఈక్విటీస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు లిమిటెడ్ రూ.12 కోట్లు, పిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు రూ.5 కోట్లు బకాయిలున్నాయి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే ఎక్కువ రుణాలు

రాష్ట్రంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు 13, ప్రైవేటు రంగ బ్యాంకులు 21 ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 28,09,024 ఖాతాలు ఉండగా, రూ.2,32,558.05 కోట్ల రుణాలిచ్చాయి. వాటిల్లో రూ.3,752.47 కోట్లు బకాయిలున్నాయి. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో 38,61,568 ఖాతాలుంటే రూ.99,820.87 కోట్ల రుణాలిచ్చాయి. ఈ బ్యాంకుల్లో రూ.2,072 కోట్లు బకాయిలున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలన్నా తక్కువ మొత్తం తీసుకుంటాయి.

ప్రైవేటురంగ బ్యాంకులో ఖాతాలు తెరవాలంటే రూ.1100 నుండి రూ.5000 వరకూ కనీస మొత్తాన్ని వసూలు చేస్తాయి. ఆ రూపంలోనే వాటి దగ్గర ఎక్కువ డిపాజిట్లు జమవుతున్నాయి. కానీ రుణాలు ఇచ్చే విషయంలో మాత్రం ఆసక్తి చూపించడం లేదని ఇటీవల ప్రభుత్వం వెల్లడించిన ఓ నివేదికలో బయటపడింది.

గుండెపోటుతో కోస్ట్ గార్డ్ డిజి రాకేశ్ పాల్ మృతి


(ఫైల్)

చెన్నై : ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేశ్ పాల్ ఆదివారం చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఆయన మరణం పట్ల రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 'ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) డైరెక్టర్ జనరల్ రాకేశ్ పాల్ అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నాను. ఆయన సమర్థవంతమైన, నిబద్ధత గల అధికారి. ఆయన సారథ్యంలో భారత్ మారిటైం సెక్యూరిటీ బలోపేతం అయింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా' అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. గతేడాది జులై 19న ఐసిజి 25వ డైరెక్టర్ జనరల్‌గా రాకేశ్ పాల్ బాధ్యతలు చేపట్టారు. ఐసిజి ఈవెంట్‌లో రక్షణ మంత్రిని ఆయన కలవాల్సి ఉండగా, అనారోగ్యంతో రాజీవ్ గాంధీ జనరల్ ఆసుపత్రిలో చేరారని ఐసిజి అధికారులు తెలిపారు. డిఎంకె నేత ఎం కరుణానిధి శత జయంతి సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన 'సంస్మరణ నాణెం' ఆవిష్కరణ కార్యక్రమం కోసం ఆదివారం చెన్నై చేరుకున్న రాజ్‌నాథ్‌సింగ్... రాజీవ్‌గాంధీ జనరల్ ఆసుపత్రికి వెళ్లి రాకేశ్‌పాల్‌కు నివాళులర్పించారు.

గాయని సుశీల త్వరగా కోలుకోవాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగుతో పాటు పలు భాషల్లో వేలాది గీతాలు పాడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన గాయని సుశీల త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. అనారోగ్యంతో చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుశీల సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

మోడీ విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- ప్రతిపక్ష ప్రభుత్వాలపై కక్ష సాధింపు
- నిత్యావసరాల ధరల పెరుగుదలపై ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు : సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ



కర్నూలు : భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అనుకూల రాష్ట్రాలను ఒకలా.. వ్యతిరేక రాష్ట్రాలను మరోలా చూస్తూ శీతకన్ను వేయడం తగదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. కర్నూలు జిల్లాలోని ఓ హోటల్లో అదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రజా స్వామ్యయుతంగా ప్రజలచే ఎన్నుకున్న ముఖ్యమంత్రి సిద్ద రామయ్యపై రాష్ట్ర గవర్నర్ విచారణకు ఆదేశించడం ప్రజలను అవమానపరచడమేనన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సతీమణికి సంబంధించిన భూమి మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అభివృద్ధి అవసరాలకు వినియోగించినందుకు ప్రతిఫలంగా మరో ప్రాంతంలో భూములు ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. సిఎంపై ఇచ్చిన ఆదేశాలు ఉపసంహరించుకొని.. ఆరాష్ట్ర గవర్నరును తక్షణమే రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, కేరళ, పంజాబ్ రాష్ట్రాల పట్ల కూడా కేంద్రం కక్ష సాధింపుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జార్కండ్, ఢిల్లీ సిఎంలు కేంద్ర విధానాలు విభేదిస్తున్న కారణంగానే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని అబాసుపాలు చేసిందన్నారు. సిఎం చంద్రబాబు ధోరణి రాష్ట్ర ప్రత్యేక హోదా అవసరం లేదన్నట్లు ఉందని నిత్యావసరాల ధరల పెరుగుదల పై సెప్టెంబరు 1 నుండి 7వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు నారాయణ తెలిపారు.

ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాధం, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, సిపిఐ నగర అధ్యక్షులు పి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఏపీ ఫైళ్ల దగ్ధం కేసులో నలుగురు సస్పెన్షన్


- ఇద్దరికి షోకాజ్ నోటీసులు



రాజమహేంద్రవరం: పోలవరం ఎడమ కాలువ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం కేసులో నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.కళాజ్యోతి, ఆఫీసు సబార్డినేట్ కె.రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్లు కె.నూకరాజు, కారం బేబిలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఉత్తర్వులిచ్చారు.

డిప్యూటీ తహశీల్దార్లు ఎ.కుమారి, ఎ.సత్యదేవిలకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఫైళ్ల దగ్ధం ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కాగా, ఫైల్స్ దగ్ధం కావడంపై ధవళేశ్వరం పోలీస్ స్టేషన్లో డిప్యూటీ కలెక్టర్ కె.వేదవల్లి ఫిర్యాదు చేశారు.

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి


(ఫైల్)

ముండ్లమూరు: ప్రకాశం జిల్లా ముండ్లమూరు గ్రామానికి చెందిన దొడ్డాల బుచ్చిబాబు (40) అమెరికాలోని కాలిఫోర్నియాలో భారత కాలమాన ప్రకారం శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆయన అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. వీకెండ్ కావడంతో ఫ్యామిలీతో సరదాగా బీచ్‌కు వెళ్లారు. అక్కడ తన కుమారుడితో కలసి కొలనులో ఈత కొట్టారు. కొద్దిసేపటి తర్వాత కుమారుడిని బయటకు పంపి బుచ్చిబాబు ఒక్కరే ఈత కొడుతూ అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతి చెందారు. అమెరికాలో తమ కుమారుడు చనిపోయినట్లు తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారు బోరున విలపించారు. తమ కుమారుడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోవాలి : వైఎస్ షర్మిల

అమరావతి: గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోవాలని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ ద్వారా సిఎం చంద్రబాబుకు ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రూప్-2 డిప్యూటీ పోస్టుల ఎంపికలో అనుసరించిన 1:100 నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రూప్-1, 2 పరీక్షలకు మధ్య సమయం తక్కువగా ఉండటం, కేవలం మూడు వారాల వ్యత్యాసంలోనే రెండు పరీక్షలు జరగడం, కొత్త సిలబస్ అని చెప్పి పాత సిలబస్‌లోనే ప్రిలిమ్స్ పరీక్షలు పెట్టడంతో అభ్యర్థులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని పేర్కొన్నారు. అభ్యర్థుల జీవితాలకు సంబంధించిన అంశం కాబట్టి ఈ విషయంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

మలయాళ హీరో మోహన్‌లాల్‌కి అస్వస్థత


(ఫైల్)

తిరువనంతపురం : ప్రముఖ మలయాళ నటుడు మోహన్ లాల్ అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం కొచ్చిలోని అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రిలో చేరారు. తీవ్ర జ్వరం, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులతోపాటు కండరాల నొప్పులతో మోహన్ లాల్ బాధపడుతున్నారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.అయితే ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని స్పష్టం చేశాయి. వైరల్ ఫీవర్‌తో ఆయన ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నాయి.

కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయనకు వైద్యులు సూచించారు. మోహన్ లాల్ నటించిన తాజా చిత్రం 'బరోజ్' ఈ ఏడాది అక్టోబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

సునీతా విలియమ్స్‌కు ఆరోగ్య సమస్యలు



వాషింగ్టన్: బోయింగ్ స్టార్‌లైనర్ ప్రోబ్ విఫలమై అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకున్న సునీత విలియమ్స్‌కు ఆరోగ్య సమస్యలు తలెత్తినట్లు సమాచారం. దృష్టి మాంద్యం వంటి సమస్యలు ఆమెను ఇబ్బంది పెడుతున్నాయి. సునీత , ఆమె సహచరుడు బచ్ విల్మోర్‌ను తిరిగి భూమికి తీసుకురావడానికి నాసా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని నాసా అధికారికంగా ధ్రువీకరించలేదు. బోయింగ్ స్టార్ లైనర్‌ను జూన్5న ప్రారంభించారు. ప్రోబ్స్ ఫిట్‌నెస్ టెస్టులో భాగంగా వీరిద్దరూ మిషన్‌లో పాల్గొన్నారు. అంతరిక్ష కేంద్రానికి వెళ్లే సమయంలో ప్రోబ్‌లో లీక్ ఏర్పడింది. జూన్6న కేంద్రానికి చేరుకోగా, సాంకేతిక లోపంతో తిరుగు ప్రయాణం ఆలస్యమైంది. స్టార్ లైనర్‌కు మరమ్మతు చేయడానికి చేసిన యత్నాలు ఇంకా విజయవంతం కాలేదు. ఇంతలో సునీతకు ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి.

నేడు డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్

- కమలా హారిస్ అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన
- గాజాలో కాల్పుల విరమణ, అబార్షన్ హక్కుల కోసం ప్రదర్శనకు వేలాదిమంది సిద్ధం

చికాగో : డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్ సోమవారం చికాగోలో ప్రారంభం కానుంది. ఇందుకోసం అమెరికా నలుమూలల నుంచి పార్టీ ప్రతినిధులు, అధికారులు ఇప్పటికే చికాగో చేరుకున్నారు. ఈ కన్వెన్షన్ గురువారం వరకూ జరగనుంది. ఈ కన్వెన్షన్‌లోనే అధ్యక్ష ఎన్నికల కోసం కమలా హారిస్ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. అధ్యక్ష ఎన్నికల బరిలో నుంచి జోబైడెన్ అనూహ్యంగా తప్పుకున్న తరువాత నుంచి కమలా హారిస్‌కే పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. దీన్ని ఈ కన్వెన్షన్‌లో అధికారంగా ప్రకటించనున్నారు. మరోవైపు కన్వెన్షన్ కోసం ఉద్యమకారులు కూడా ఎదురుచూస్తున్నారు.

గాజాలో కాల్పుల విరమణ, అబార్షన్ హక్కుల రక్షణ, అర్థిక అసమానతలు వంటి అంశాలపై భారీ సంఖ్యలో ఉద్యమకారులు ఆందోళనలు నిర్వహిస్తారనే అంచనాలు ఉన్నాయి. జులైలో మిల్వాకీలో జరిగిన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్ నుంచి తాము చాలా పాఠాలు నేర్చుకున్నామని, ఈ పాఠాలతో చికాగోలో భారీఎత్తున, బలమైన ప్రదర్శనలు జరుపుతామని ఉద్యమకారులు చెబుతున్నారు. కన్వెన్షన్ సాగే ప్రతిరోజూ తమ ప్రదర్శనలు కూడా ఉంటాయని తెలిపారు.

బెంగళూరులో విద్యార్థినిపై లైంగికదాడి



బెంగళూరు : డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినిపై ఒక గుర్తు తెలియని బైకర్ లైంగికదాడికి పాల్పడిన దారుణం బెంగళూరులో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. నగరంలో ఒక కళాశాలలో చదువుతున్న ఈ విద్యార్థిని శనివారం రాత్రి కోరమంగళలో జరిగిన గెట్‌టూ గెదర్‌లో పాల్గొనేందుకు వెళ్లింది. ఈ కార్యక్రమం తరువాత హెబ్బగోడిలోని ఇంటికి తిరిగి వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమెకు లిఫ్ట్ ఇచ్చాడు. తరువాత ఆమెపై దాడికి పాల్పడి అఘాత్యం చేశాడు. లిఫ్ట్ ఇచ్చిన అనుమానితుడ్ని ఒక రేపిస్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించినట్టు అదనపు పోలీస్ కమిషనర్ (ఈస్ట్‌జోన్) రమణ్ గుప్తా తెలిపారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితురాలు, కుటుంబ సభ్యులతో మాట్లాడినట్టు చెప్పారు. మొత్తం సమాచారాన్ని సేకరించామని, దర్యాప్తు కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వేగంగా విచారణ సాగుతోందని, త్వరలో నిందితుడ్ని పట్టుకుంటామని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో ఘోరం



వ్యాను, బస్సు ఢీకొని 10 మంది మృతి

మరో 27 మందికి తీవ్రగాయాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది మరణించగా, 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు. సలేంపూర్ ప్రాంతంలో బుదౌన్–మీరట్ రాష్ట్ర రహదారిపై కార్మికులతో వెళుతున్న పికప్ వ్యాన్ ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. మృతులు, క్షతగాత్రులంతా అలీగఢ్ జిల్లాకు చెందిన వారు. ఘజియాబాద్‌లోని ప్రముఖ బిస్కెట్ కంపెనీలో పనిచేస్తున్న వీరు రక్షాబంధన్ సందర్భంగా వ్యాన్‌లో సొంతవూరుకు వెళ్తూ, ప్రమాదం బారినపడ్డారు. ప్రమాద సమయంలో తామంతా నిద్రలో ఉన్నామని వ్యాన్, బస్సు ఢీకొన్నప్పుడు పెద్ద శబ్దం వచ్చిందని, అంతలోనే తీవ్ర గాయాల పాలయ్యామని కొందరు క్షతగాత్రులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు.

బ్రెజిల్‌లో ట్విటర్ మూసివేత



బ్రెజిల్: బ్రెజిల్‌లో తమ కార్యకలాపాలను వెంటనే ఆపేస్తున్నట్లు ట్విటర్ ప్రకటించింది. ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి అలెగ్జాండ్రె డీ మొరేస్ కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. 'అక్కడ మా హక్కులు, బాధ్యతల విషయంలో తను విధించిన సెన్సార్‌షిప్ పాటించాల్సిందేనని ఆయన బెదిరించారు. తను చెప్పినట్లు చేయకుంటే మా ప్రతినిధిని అరెస్టు చేయిస్తామన్నారు. సిబ్బంది భద్రత కోసం దేశంలో ట్విటర్ మూసేస్తున్నాం' అని స్పష్టం చేసింది.

రష్యాలో భూకంపం

రిక్టర్ స్కేలుపై 7.0 పాయింట్లుగా నమోదు



రష్యా : రష్యాలో భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 5.25 గంటలకు కంచట్కా ద్వీపకల్పంలో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.0 పాయింట్లుగా నమోదయింది. తూర్పు తీర ప్రాంత నగరమైన పెట్రోపవ్‌లావ్‌స్కీ–కమ్‌చట్‌స్కీకి 102 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూ కంప నాభి 50 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు తెలిపింది. అయితే దీనివల్ల ప్రాణ నష్టం కానీ, ఆస్తి నష్టం కానీ సంభవించినట్లు సమాచారమేదీ లేదని అధికారులు తెలిపారు.

రష్యా నౌకాదళానికి కీలక ప్రాంతమైన పెట్రోపవ్‌లావ్‌స్కీ–కమ్‌చట్‌స్కీ నగరంలో 1,80,000 మంది నివాసం ఉంటున్నారు. చుట్టూ అగ్నిపర్వతాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో అత్యధిక భాగం నావికా దళ ఆధీనంలో ఉంది. పెట్రోపవ్‌లావ్‌స్కీ–కమ్‌చట్‌స్కీకి 280 మైళ్ల దూరంలో ఉన్న షివేలుచ్ అగ్నిపర్వతం బద్దలై 8 కిలోమీటర్ల ఎత్తువరకు లావాను వెదజల్లుతున్నది. దీంతో సమీపంలో ఉన్న ప్రాంతాలు మొత్తం బూడిదమయమయ్యాయి.

థాయి మాజీ ప్రధాని తక్‌సిన్ షినవ్రతాకు

రాజు క్షమాభిక్ష

బ్యాంకాక్: థాయిలాండ్ అపర కుబేరుడు మాజీ ప్రధాని తక్‌సిన్ షినవ్రతాకు రాజు క్షమాభిక్ష ప్రసాదించారు. తన కుమార్తె ప్రధాని పదవికి పార్లమెంటు ఎన్నుకున్న మరుసటి రోజే ఈ క్షమాభిక్ష లభించింది. థాయిలాండ్‌లో అధికారం కోసం అటు రాచరికంతో జట్టుకట్టిన సైనిక జనరల్స్, థాయి ప్రభుత్వంపైన, సంస్థలపైన చాలా కాలంగా ప్రభావం చూపుతూ వచ్చిన కులక్కులతో కూడిన కూటమికి , ఇటు షినవ్రత కుటుంబం, దాని మిత్రులతో కూడిన కూటమికి మధ్య రెండు దశాబ్దాలపాటు సాగిన పోరాటంలో తక్‌సిన్ కీలక పాత్ర పోషించారు. 2006 మిలిటరీ తిరుగుబాటులో పదవీచ్యుతుడైన తక్‌సిన్ జైలు పాలుకాకుండా తప్పించుకునేందుకు విదేశాల్లో ప్రవాస జీవితం గడిపారు. నాటకీయ పరిణామాల మధ్య గత ఏడాది ఆగస్టులో ఆయన తిరిగి స్వదేశానికి వచ్చారు. 2001నుంచి 2006 మధ్య అధికారంలో ఉన్న సమయంలో తక్‌సిన్ ప్రభుత్వం అధికార దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతం, అవినీతికి పాల్పడిందన్న కేసులో ఆయనకు మొదట ఎనిమిదేళ్ల జైలు శిక్ష పడింది. తరువాత దానిని రాజు మహా వజీర్ లాంగ్‌కామ్ గత సెప్టెంబరులో ఒక ఏడాదికి తగ్గించారు. ఆరుమాసాలుగా ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రి డిటెన్షన్‌లో ఉన్న ఆయన మొన్న ఫిబ్రవరిలో మెడికల్ పెరోల్‌పై విడుదలయ్యారు. ఆ పెరోల్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. రాజు పుట్టిన రోజు సందర్భంగా మంచి ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించారని, అందులో భాగమే ఇది అని తక్‌సిన్ తరపు న్యాయవాది వినయత్ చార్తో తెలిపారు. తక్‌సిన్ కుమార్తె పేతొంగ్తరన్ షినవ్రత(37) థాయిలాండ్ ప్రధాని పదవి చేపట్టిన అతి పిన్నవయస్కురాలు. అంతేకాదు, ఈ పదవిని అధిష్టించిన రెండవ మహిళగా కూడా ఘనత సాధించారు.. పార్లమెంటులో ఆమె పార్టీకి మూడింట రెండొంతుల మెజార్టీ ఉంది.

వ్యవసాయంలోనూ అసమానతలే

ఆదాయాలు అంతంత మాత్రమే

- అరకొరగా శాశ్వత ఆవాసాలు
- భూ కమతాలూ తక్కువే
- వెనుకబడిపోతున్న ఎస్టీ, ఎస్సీ, ఓబీసీలు



న్యూఢిల్లీ : దేశంలో కుల పరమైన అసమానతలు అధికంగా ఉన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఆదాయాలు, భూ యాజమాన్యాలకు సంబంధించి ఈ అసమానతలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టు కులగణన చేపడితే భూ యాజమాన్యంలో కులపరమైన ఆధిపత్యం ఏ మేరకు ఉన్నదో అంచనా వేయవచ్చు. దేశంలో వ్యవసాయ కుటుంబాల భూ యాజమాన్య వివరాలను నమోదు చేసిన తాజా సర్వే 2018–19లో చేసిన పరిస్థితి మదింపు సర్వే (ఎస్ఏఎస్). వ్యవసాయ కుటుంబాలపై ఈ సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకూ ఎస్ఏఎస్ సమాచారాన్ని మూడు దఫాలుగా సేకరించారు. 2003, 2013, 2018–19లో సమాచార సేకరణ జరిగింది. భవిష్యత్తులో ఎప్పుడు సమాచారాన్ని సేకరిస్తారనే విషయంపై మంత్రిత్వ శాఖ వెబ్‌సైటులో వివరాలేవీ ఇవ్వలేదు.

ఐదు సంవత్సరాలకు ఒకసారి చేసే వ్యవసాయ గణన కూడా భూ కమతాలకు సంబంధించి సమాచారాన్ని అందించే మరో వనరు. చిట్టచివరగా 2015–16లో ఈ సర్వే వివరాలు విడుదలయ్యాయి. 2021–22లో సమాచార సేకరణ ప్రారంభమైనప్పటికీ అది ఇప్పటి వరకూ బహిర్గతం కాలేదు. కాబట్టి చిట్టచివరగా జరిపిన సర్వేలనే పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

సగటు వినియోగ వ్యయంలో...

బీజేపీ ఏలుబడిలో గ్రామీణ ఆదాయాలు, భూ యాజమాన్యాల గురించి ప్రభుత్వ వాదనలను అంచనా వేయడం చాలా కష్టంగా ఉంది. అయినప్పటికీ 2018–19లో జరిపిన ఎస్ఏఎస్ సర్వే సమాచారం కుల ఆధారిత భూ యాజమాన్యాన్ని అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ముందుగా నెలవారీ సగటు వినియోగ వ్యయాన్ని (మంత్లీ కన్సప్షన్ ఎక్స్‌పెండీచర్– ఎంసీఈ)ని పరిశీలిద్దాం. ఎంసీఈ అనేది కుటుంబ ఆదాయానికి సూచిక అని చెప్పవచ్చు. ఈశాన్య రాష్ట్రాలలో వివిధ కులాల మధ్య ఎంసీఈ పంపిణీ సమానంగానే ఉంది. మిగిలిన ప్రాంతాలు...అంటే ఉత్తరాది రాష్ట్రాలు, మధ్య ప్రాంత రాష్ట్రాలు, తూర్పు రాష్ట్రాలు, పశ్చిమ రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాలలో జనరల్ కేటగిరీ కుటుంబాల వ్యయమే అధికంగా (రూ.10,611) ఉంది. ఎస్టీ కుటుంబాలు అతి తక్కువ మొత్తంలో (రూ.8,204) ఖర్చు చేస్తున్నాయి. మధ్య, దక్షిణాది రాష్ట్రాలలో జనరల్ కేటగిరీ కుటుంబాల సగటు ఎంసీఈ ఎస్టీ కుటుంబాల ఎంసీఈ కంటే దాదాపు రెట్టింపుగా ఉండడం గమనార్హం. అన్ని ప్రాంతాలలోనూ ఎస్సీ కుటుంబాల ఎంసీఈని ఎస్టీ కుటుంబాలతో పోల్చవచ్చు. అలాగే ఓబీసీ కుటుంబాల ఎంసీఈ జనరల్ కేటగిరీ కుటుంబాల వ్యయానికి దగ్గరగా ఉంది. ఈశాన్య ప్రాంతంలో మినహా మిగిలిన అన్ని చోట్ల ఇతర కులాలతో పోలిస్తే ఎస్టీ కుటుంబాల వ్యయం ఇప్పటికీ బాగా తక్కువగానే ఉంది.

భూ యాజమాన్యంలో...

భూ యాజమాన్యం విషయంలో కూడా జనరల్ కేటగిరీ కుటుంబాలతో పోలిస్తే ఎస్టీ, ఎస్సీ, ఓబీసీ కుటుంబాలకు తక్కువ భూమే ఉంది. మొత్తంగా చూస్తే నెలసరి వినియోగ వ్యయం, పక్కా గృహాల యాజమాన్యం విషయంలో జనరల్, ఓబీసీ కేటగిరీ కుటుంబాల కంటే ఎస్టీ, ఎస్సీ కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. భూ యాజమాన్యం విషయంలో కూడా ఇతర సామాజిక గ్రూపులతో పోలిస్తే జనరల్ కేటగిరీ కుటుంబాలకే ఎక్కువ భూమి ఉంది. ఫలితంగా ఉత్పాదక ఆస్తుల యాజమాన్యం విషయంలో వారి ఆధిపత్యమే కొనసాగుతోంది. తద్వారా వారు సామాజిక, ఆర్థిక ప్రాబల్యాన్ని కనబరుస్తున్నారు.

అన్ని ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా డిమాండు చేస్తున్నట్టు, కులగణన జరిపితే ఈ విషయంలో మరింత స్పష్టత వస్తుందని ఒక అధ్యయనం వెల్లడించింది.

పక్కా ఇండ్ల నిర్మాణంలోనూ...

ఇక గ్రామీణ ప్రాంతాలలో శాశ్వత గృహాలు నిర్మించుకున్న వారిలో ఎక్కువ మంది జనరల్ కేటగిరీ కుటుంబాలకు చెందిన వారే. ఒక్క ఈశాన్య ప్రాంతంలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. అక్కడ మినహా మన గ్రామాలలో 57 శాతం జనరల్ కేటగిరీ కుటుంబాలు పక్కా ఇండ్లలోనే నివసిస్తున్నాయి. ఎస్టీలలో 27 శాతం మంది, ఎస్సీలలో 36 శాతం మంది మాత్రమే శాశ్వత ఆవాసాలలో ఉంటున్నారు. మధ్య రాష్ట్రాలలో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంది. అక్కడ ఎస్టీలలో 18 శాతం, ఎస్సీలలో 33 శాతం మందికే శాశ్వత నివాసాలు ఉన్నాయి. అక్కడ జనరల్ కేటగిరీలో ఏకంగా 64 శాతం కుటుంబాలకు పక్కా ఇళ్లు ఉన్నాయి. ఉత్తరాదిలో 42 శాతం ఎస్టీ, 44 శాతం ఎస్సీ, 67 శాతం జనరల్ కేటగిరీ కుటుంబాలకు, దక్షిణాన 41 శాతం ఎస్టీ, 45 శాతం ఎస్సీ, 59 శాతం జనరల్ కేటగిరీ కుటుంబాలకు శాశ్వత ఆవాసాలు ఉన్నాయి.

నిజాం షుగర్స్ పున:ప్రారంభిస్తాం

దాని కోసం పూర్తి సహకారం అందిస్తాం

- క్షత్రియులు అన్ని రంగాల్లో రాణిస్తారు
- శ్రమ, పట్టుదలే వారికి ఎదుగుదలకు కారణం : క్షత్రియ సేవా సమితి సన్మానసభలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

నిజాం చక్కెర కర్మాగారాన్ని త్వరలో పున: ప్రారంభిస్తామనీ, దానికి ప్రభుత్వం తరపున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తా మని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. క్షత్రియ సేవా సమితి (తెలంగాణ– ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి జీఎంసీ బాల యోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేదికపై ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాం షుగర్స్ సంస్థ ప్రస్తుతం 'రాజు'ల ఆధీనంలోనే ఉందనీ, దాని సమస్యల్ని త్వరలో పరిష్కరిస్తామన్నారు. హైదరాబాద్‌లో అన్ని రంగాల అభివృద్ధిలో క్షత్రియుల పాత్ర ఎంతో ఉందన్నారు. రాజులు ఏ రంగంలోనైనా రాణిస్తారనీ, దానికి వారి శ్రమ, పట్టుదలే కారణమని చెప్పారు. కృష్ణంరాజు ప్రస్తావన లేకుండా సినీ పరిశ్రమను చూడలేమనీ, ఆయన తనకు మంచి మిత్రుడని తెలిపారు. ఆ తర్వాత అదే చిత్రరంగంలో హాలీవుడ్‌తో పోటీపడేలా బాహుబలి ప్రభాస్ రాణించారనీ, దీనికి వారి కఠోర శ్రమ, పట్టుదలే కారణమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బోసురాజు అత్యంత క్రియాశీల పాత్ర పోషించారని చెప్పారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ రాకపోయినా పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేశారనీ, ఆయన నిబద్ధత, వినయ విధేయతలు, విశ్వాసాన్ని రాహుల్‌గాంధీ గుర్తించి మంత్రిని చేశారని తెలిపారు. పార్టీలు, సిద్ధాంతాలు వేరైనా క్షత్రియులంతా ఒక్కటే అని చెప్పారు. రాజకీయాల్లో రాణించాలనుకొనే వాళ్లను ప్రోత్సహించాలనీ, పీసీసీ అధ్యక్షుడిగా వారికి తప్పకుండా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వంలో సలహాదారుగా శ్రీనివాస రాజు ఉన్నారనీ, వారి ద్వారా సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కో చైర్మెన్‌గా శ్రీని రాజును నియమించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ స్పూర్తితో తాను ప్రజా సమస్యలపై కొట్లాడానని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో క్షత్రియులు కూడా భాగస్వాములేననీ, వారికి రాజకీయంగా తప్పకుండా గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. క్షత్రియ భవన్‌కు అవసరమైన స్థలం, నిర్మాణానికి కావాల్సిన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా అందిస్తుందని హామీ ఇచ్చారు. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు గుర్తింపు సాధించిన ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ తనకు మంచి మిత్రుడు అని చెప్పారు. కార్యక్రమానికి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, కర్నాటక రాష్ట్ర చిన్న నీటిపారుదల, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి నడింపల్లి బోసురాజు, పారిశ్రామికవేత్త అల్లూరి సీతారామ రాజు, క్షత్రియ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేరిచర్ల నాగరాజు, డాక్టర్ నడింపల్లి నానిరాజు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

మహిళలందరికీ సీఎం రాఖీ శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్‌తో పాటు రెండు వందల యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు పథకాలను ఇప్పటికే అమలు చేసిందని గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తగినంత చేయూతను అందిస్తుందని తెలిపారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, ఎక్కడ మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందనీ, అందరి దీవెనలతో విజయ వంతంగా ప్రజాపాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు మహిళలకు, రాష్ట్ర ప్రజలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

చైనాలో పర్యటిస్తున్న వియత్నాం అధ్యక్షుడు టొ లామ్



హనోయ్ : వియత్నాం అధ్యక్షుడు టొ లామ్ మూడు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ఆదివారం చైనా చేరుకున్నారు. ఈ రోజు ఉదయం లామ్ హాంగ్‌కాంగ్ సమీపంలోని పారిశ్రామిక , ఎగుమతుల కేంద్రమైన గాంగ్‌జౌ చేరుకున్నారని చైనా మీడియా పేర్కొంది. దక్షిణ చైనాలో మాజీ వియత్నాం కమ్యూనిస్ట్ నేత హొచి మిన్ పర్యటించిన ప్రదేశాలను కూడా సందర్శించడం లామ్ ఎజెండాలో భాగమని చైనా మీడియా సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొంది. ఈ పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మరియు ఇతర సీనియర్ అధికారులతో టొలామ్ భేటీ కానున్నారు.

చైనా, అమెరికా, రష్యాలతో సంబంధాలను కొనసాగించడంలో ట్రాంగ్ వ్యూహాన్ని కొనసాగించాలని లామ్ భావిస్తున్నారని చైనాలోని జెంగ్‌జౌ యూనివర్శిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ వియత్నాం స్టడీస్ డైరెక్టర్ యు జియాంగ్‌డాంగ్ శనివారం జాతీయ మీడియాతో పేర్కొన్నారు. లామ్ అధికారం చేపట్టిన అనంతరం తన తొలి విదేశీ పర్యటనకు చైనాను ఎంచుకోవడంతో.. చైనాతో సంబంధాలకు వియత్నాం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందనడానికి సంకేతమని యు పేర్కొన్నారు.

టొలామ్ వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా గతవారం ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. లామ్ పార్టీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారంటూ జులై 18న పొలిటికల్ బ్యూరో ఓ నోటీసు జారీ చేసింది. ట్రాంగ్ ఆరోగ్యం క్షీణిస్తున్నందున ఆయన మరణించడానికి ఒకరోజు ముందుగానే ఈ నియామకం జరిగింది. జులై 19న ట్రాంగ్ కన్నుమూశారు.

సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వానికి మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ వినతి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్



బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు. పాపన్న గౌడ్ 374 జయంతి సందర్భంగా ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలపై కొనసాగిన అణిచివేత, దాడులకు వ్యతిరేకంగా పోరాడిన మహాయోధుడని కొనియాడారు. పాపన్న ఆలోచన విధానాన్ని యువత కొనసాగించాలని పేర్కొన్నారు. గౌడ సామాజిక వర్గ సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో చేసిందనీ, అదే తరహాలో కాంగ్రెస్ సర్కార్ సైతం అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

పీఎంఏవై–జీ మీద

శ్రద్ధ కరువు

గృహాల యూనిట్ ధర పెంపునకు కేంద్రం నో

- ద్రవ్యోల్బణంపై చర్చకు దారి
- ఆర్థిక నిపుణుల ఆందోళన
- ఇది రాష్ట్రాలపై భారం మోపే యత్నం
- కొందరు విశ్లేషకుల ఆరోపణ
- మోడీ సర్కారుపై సామాజికవేత్తల ఆగ్రహం



న్యూఢిల్లీ : ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ (పీఎంఏవై–జీ) కింద ఇంటి యూనిట్ ధరను పెంచటానికి కేంద్రం ఇటీవల నిరాకరించింది. దీంతో, గ్రామీణ పేదలకు ఇండ్లు నిర్మించటానికి ద్రవ్యోల్బణం ఎలా సర్దుబాటు చేయబడుతుందనే దానిపై ఆర్థిక నిపుణుల మధ్య చర్చకు దారితీసింది. 2017లో.. ప్రభుత్వం పీఎంఏవై–జీ కింద మద్దతు ఇచ్చే ఇంటి యూనిట్ ధరను మైదాన ప్రాంతాల్లో రూ.70,000, కొండల్లో రూ.75,000 నుంచి వరుసగా రూ.1.2 లక్షలు, రూ. 1.3 లక్షలకు పెంచింది. పీఎంఏవై–జీ కింద 2.95 కోట్ల ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.

> వచ్చే ఐదేండ్లలో మరో రెండు కోట్ల గ్రామీణ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం సహకరిస్తుందని ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్డీ).. 2017 నుంచి 2024 మధ్య కాలంలో ద్రవ్యోల్బణం ఆరు శాతంగా ఉన్నందున ప్రతి ఇంటి ధరను పెంచాలని మంత్రివర్గం ముందు ప్రతిపాదించింది. కొత్తగా రెండు కోట్ల ఇండ్ల కోసం మైదానాల్లో రూ.1.2 లక్షలు, కొండల్లో రూ.1.3 లక్షల నుంచి వరుసగా రూ. 2 లక్షలు, రూ.2.2 లక్షలకు పెంచాలని ఎంఓఆర్డీ ప్రతిపాదించింది.

ఇంటి నిర్మాణ ధర పెంపుదలకు కేంద్ర క్యాబినెట్ నో

గతనెల 9న ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ప్రస్తుత రేటుతో ఆర్థిక సహాయాన్ని ఆమోదించిందని ఇద్దరు ప్రభుత్వ అధికారులు తెలిపారు. "యూనిట్ ధరను పెంచే ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం తిరస్కరించింది. యూనిట్ ధర పెంచితే తప్ప నాణ్యతను కాపాడుకోవడం కష్టం" అని సదరు అధికారులు అన్నారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిధుల నుంచి అదనపు సహకారం అందించాలని మంత్రివర్గం అభిప్రాయపడినట్టు తెలిసింది. పీఎంఏవై–జీ కింద రాష్ట్రాలు 40 శాతాన్ని భరిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం 60 శాతం భరిస్తుంది.

'రాష్ట్రాలపై భారాన్ని మోపితే అన్యాయం'

భూనిర్వాసితులకు ఇంటి స్థలంపై చట్టబద్ధంగా హక్కు కల్పించాలనే ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న పౌర సమాజ సంస్థ ఏక్తా పరిషత్ కార్యదర్శి అనీస్ థిల్లెంకేరీ మాట్లాడుతూ కేంద్రం.. రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని మోపితే అది అన్యాయమని అన్నారు. "పీఎంఏవై–జీ అనేది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం. రాష్ట్రాలు అదనపు మద్దతు ఇవ్వాలని మంత్రివర్గం తీసుకున్న అభిప్రాయంలో హేతుబద్ధత లేదు" అని ఆయన అన్నారు. గత ఏడేండ్లలో వేతనాలతో సహా అన్నింటి ధరలు పెరిగాయని థిల్లెంకేరీ చెప్పారు. ప్రస్తుతం ఉన్న రేటుతో ఇల్లు కట్టుకోవటం కష్టమని అన్నారు. 'రేట్లు పెంచకపోతే లేదా సమస్యను రాష్ట్రాలకే వదిలేస్తే నాణ్యత దెబ్బతింటుంది. కొన్ని రాష్ట్రాలు కొంత అదనంగా ఇవ్వవచ్చు, ఇవ్వకపోవచ్చు. అయితే ఇది రాష్ట్రాన్ని బట్టి మారుతూ ఉంటుంది' అని ఆయన అన్నారు.

ఈ పథకం కింద నిర్మించిన ఇండ్లన్నింటికీ మరుగుదొడ్లు, ఎల్పీజీ కనెక్షన్, నల్లా నీరు వంటి సౌకర్యాలు అందించబడతాయి. అయితే, మోడీ ప్రభుత్వం యూనిట్ ధరను పెంచి, గ్రామీణ ప్రాంత ప్రజలకు చక్కటి, నాణ్యమైన ఇండ్లను అందించాలని సామాజికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రాలను కారణంగా చూపి తప్పించుకోవాలనే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తే ఊరుకునేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

పాత పరదా



చీకట్లో తప్పిపోయిన చందమామలా,
బురఖాలో ఆమె ముఖాన్ని చూశాను.
మెరిసే తల్వార్ పదును చూసినట్టు,
వేలితో ఆమె నవ్వును తాకాలనిపించింది.
తుఫాను ఎడారిలో సుడిగాలి అయినట్టు,
ఆమె అడుగులు రేపుతూ,
నా కళ్లలో నడిచి పోయింది.
ఈ దారిన ఎవరు వెళ్ళారో,
గాలిలో మిగిలిన అత్తర్ వాసన తెలుపుతుంది.
కన్నీళ్లతో కలిసి ఆవిరయ్యిందా,
లిప్‌స్టిక్ రంగులో ఎండిపోయిందా,
పగటిపూట పగిలిన గాజులాంటి
ఎండా వేడీ తెలుపుతుంది. -
రాత్రి అద్దం మీది దుమ్ము లాంటి
చినిగిన వెన్నెల, పాత పరదాలా ఊగుతుంది.
నీ కళ్ళ రంగు నాకు ఇష్టం,
అది ఎరుపుగా వుండదు -
నీలం వజ్రంలా వుంటుంది.
సముద్రంలో దూకడం నాకు ఇష్టం,
నాది స్వేచ్ఛ కోరుకొనే స్వప్నం.
నీ కళ్ళు ఎప్పుడూ కన్నీళ్ళు రాల్చొద్దు,
అవి ఖంజర్ల మొనలు,
కఠినాత్ముల గుండెల్లో దిగాలి.
నాకు తెలుసు, ఇది ఎడారి.
తారల బారాత్‌లో నడవలేను
సంకెళ్ళు ఏవైనా మోయలేను
ఫైజ్ అహమద్ ఫైజ్ నూ మరవలేను.

- ఆశారాజు, 9392302245

ఆధునిక కవితా ప్రయోగ కర్త



మానవ జీవితంలో కవిత్వం అనేక పార్శ్వాలను దృశ్యీకరిస్తుంది. అలా దృశ్యంగా నిర్మించడం అందరి కవులకూ సాధ్యం కాదు. సుసంపన్నమైన, అసమానతలులేని మానవీయ సమాజాన్ని నిర్మించాలని కవి తపన పడ్తాడు. అలా అందరూ ఉండకపోవచ్చు. కొందరికే సాధ్యం. కవిత్వానికి శిల్పసొగసులద్ది, వైవిధ్యవస్తు అభరణాలను అలంకరించి, భావుకత కూడిన పదచిత్రాల వెలుతురు నీడలో కవిత్వానికి నిత్య సౌరభాలు నింపిన కవి గుంటూరు శేషేంద్ర శర్మ.

తెలుగు కవిత్వాన్ని ఖండాంతరాలకు తీసుకెళ్లి కవిత్వ వైభవాన్ని చాటిచెప్పిన కవి శేషేంద్ర. తొలుత సాంప్రదాయ కవిత్వం రాసినప్పటికీ కాలానుగుణంగా సామాజిక సమస్యలను ఆకళింపు చేసుకుని 'మనిషి' కేంద్రంగా సముద్రమంత కవిత్వాన్ని రాసి, భారతీయ సాహిత్యంలో గొప్ప కవిగా నిలిచిన కవి శేషేంద్ర. కవిత్వంలో అనేకానేక మార్పులకు శ్రీకారం చుట్టిన కవుల్లో ముందువరసలో ఉన్నవారు శేషేంద్ర. వచనకవితలో కావ్యవస్తువుతో పాటు రీతి కూడా మారాలని వాదించి తెలుగు కవిత్వాన్ని కొత్తపుంతలు తొక్కించిన కవి ఈయన. ప్రత్యేకించి చెప్పాలంటే శేషేంద్రది ఒక కవిత్వ తాత్వికయుగం. అధునిక కవిత్వ వికాసమంతా శేషేంద్ర కవిత్వంతో ముడిపడివుంది. ఆయన కవనం పట్టాక కవిత్వం రూపం, స్వరూపం మారిపోయింది. శేషేంద్ర చెప్పినట్టే అదుగో ఉదయించే దిక్కు, దానికే హృదయపూర్వకంగా మొక్కు అన్న స్థితిని తీసుకొచ్చాడు. ఆధునిక మహాభారతం, జనవంశమ్, సొరాబు, వచ్చింది ఓట్ల ఋతువు వరకు కూడా సాహిత్యచరిత్రలో సుదీర్ఘ అధ్యాయం. అందుకే ఆయనదొక యుగం అనాల్సి వస్తుంది. కొన్ని సంవత్సరాలపాటు అనో.. లేదా రెండుమూడు దాశాబ్దాలనో ఆయన కవిత్వ పరిణామాన్ని అంచనా వేసి సమాజానికందించే ప్రయత్నం చేశారు. ఇలా చెప్పటం కూడా సహేతుకం కాదనిపించింది. కలం పట్టింది మొదలు ఆఖరి అక్షరం పురుడుబోసుకునే దాకా కవిత్వాన్ని కొత్తపుంతలు తొక్కించాడు.

వర్తమాన వచన కవిత్వంలో అనేక కవిత్వప్రక్రియలు పురుడుబోసుకున్నాయి. నేటితరం వర్ధమాన, వర్తమాన కవులు ఆ కవిత్వ ప్రక్రియల నాడి పట్టుకుని కవిత్వక్షేత్రంలో పచ్చని కవిత్వపంట పండిస్తున్నారు. ఈనాడు కవిత్వంలో మినీ కవితలని, నానీలని, హైకూలని, రెక్కలని, వ్యంజకాలని ఇలా చాలా ప్రక్రియలు పురుడు బోసుకున్నాయి. ఈ సరికొత్త ఆధునిక ప్రక్రియలు ప్రారంభించిందెవరైనా నేటితరం కవులు మాత్రం ఆ కవిత్వ ప్రక్రియలను ఆవాహనం చేసుకుని ఆ ప్రక్రియల్లో రాస్తున్నారు, రాణిస్తున్నారు. అయితే వాటి మూలాలు మాత్రం ఎవరూ స్పష్టంగా చెప్పలేదు. కాస్త లోతుల్లోకి వెళ్తే..

అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన ఏ కాలంలోనైనా కవిత్వానికి అవసరమే. చాటువులు, శతకాలూ ఇంకా ఎన్నో చిన్న పద్యాలు, ముక్తకాలు పూర్వ సాహిత్యంలో వున్నాయి. ఆధునిక నాగరికతలో వేగం పెరిగిపోయింది. సుదీర్ఘమైన రచనలను ఆస్వాదించటానికి సామాన్యులకు అవకాశం అంతగా లేకపోవటం వలన సాహితీ ప్రక్రియల్లో కొన్ని మార్పులు వచ్చాయి. నవలతోపాటు 'నవలిక', కవిత్వంతో పాటు 'మినీ కవిత' వ్యాప్తిలోకి వచ్చాయి. చిన్నచిన్న కవితలు పూర్వకాలంలో కూడా వున్నా, ఆ పేరు ఇటీవల వచ్చిందే. మొట్టమొదట ఈ పేరు ఎవరు ఉపయోగించారో తెలియదుగానీ, పత్రికల ప్రచారం వలన ఈ ప్రక్రియ కొద్దికాలంలో ఎక్కువ ప్రచారంలోకి వచ్చింది. 'మినీ కవిత' అంటే పొట్టిగా, క్లుప్తంగా వుండే కవిత మాత్రమే కాదు, మరికొన్ని విధాలుగా కూడ దీన్ని గుర్తించవచ్చు. నిగూఢమైన భావాన్ని కొద్ది పంక్తులలో పొదిగి, ఒక రసవత్కావ్య ఖండికను చదివిన అనుభూతి కలిగించటం దీని ప్రత్యేకత. వ్యర్థపదం ఒక్కటీ లేకుండా, చెప్పదలచిన భావం పూర్తయ్యాక గీతం పూర్తయిందా లేదా అని చూడక అక్కడే ఆపి వెయ్యటం 'మినీ కవితలో' కన్పిస్తుంది. పత్రికలలో ఖాళీ జాగాలను పూరించటానికి సంపాదకులు వీటిని స్వీకరించటంవల్ల, మినీ కవితలు విరివిగా వెలువడు తున్నాయి. వచన కవితా వైవిధ్యానికి తోడ్పడుతున్న రూపం 'మినీ కవిత'. 'మినీ కవితలు' పద్యాల్లో, గేయాల్లోనూ వచ్చిన ఈ మాట వచన కవితల్లో వచ్చిన వాటికే సార్థకమనిపిస్తున్నది.

> **మినీ కవిత్వ నిర్మాణం ఎలా ఉండాలో అలా ఆనాడే బీజం వేశారు. సామాజిక స్పృహ కన్నా సాహిత్య స్పృహ మాత్రమే ఉండాలని కాదు.. సామాజికత ఎంత బలంగా ఉండాలో 1974 వచ్చిన 'మండే సూర్యుడు' కవిత్వం చదివితే ఎవరికైనా అర్థమైపోతుంది. ఇందులో వర్గచైతన్యం, కళాత్మక అభివ్యక్తి, అన్నింటికీ మించి గొప్ప శిల్పం ఉంది.**

మినీకవితల మూలాలు శేషేంద్ర కవిత్వంలో..

1972లో శేషేంద్ర జ్యోత్స్నా పర్వం రాశారు. జ్యోత్స్నా పర్వం ఒకటో సర్గలో మినీ కవితలు రాశారు. మొదటి కవితలో...
"ఎండలాంటి నా ఊహ శబ్దం మీద పడినది/ సుదీర్ఘంగా దాని నీడ శతాబ్దం మీద పడినది/ సూర్యుడు ఉదయం పూచిన పూలతో/ క్రీడిస్తున్నాడు/ వీరుడ్ని చూచి కాలం భయపడినది"

తెలుగునాట పద్యం రాజ్యమేలుతున్న కాలమది. ఆ కాలంలోనే మినీ కవితలు రాశారు. పై మినీ కవిత రిథమిక్‌గా సాగుతుంది. అందుకే మినీ కవిత్వ నిర్మాణం ఎలా ఉండాలో అలా ఆనాడే బీజం వేశారు. సామాజిక స్పృహ కన్నా సాహిత్య స్పృహ మాత్రమే ఉండాలని కాదు.. సామాజికత ఎంత బలంగా ఉండాలో 1974 వచ్చిన 'మండే సూర్యుడు' కవిత్వం చదివితే ఎవరికైనా అర్థమైపోతుంది. ఇందులో వర్గచైతన్యం, కళాత్మక అభివ్యక్తి, అన్నింటికీ మించి గొప్ప శిల్పం ఉంది. మండే సూర్యుడు రాసి యాభై ఏళ్ళు దాటినా కవిత్వసొబగులు, సువాసనలు అలాగే గుభాళిస్తున్నాయి. ఇందులో సామాజిక చైతన్యం నవతరం కవులను పిడికిలి బిగించి ఉద్యమం చేసేలా చేయగలిగింది. ఈ వరం రెండో సర్గలోనూ మినీ కవిత ఎలా ప్రారంభిస్తాడో చూడండి.. **"సంధ్యాకాల బాహువుల్లో ఇరుక్కుని/ ధరిత్రి/ సౌందర్యాలకు లొంగింది/ కోటలాంటి గుండెమీద/ ప్రేమ శతఘ్ని పేలింది".** (ఆధునిక మహాభారతం- రెండోసర్గ-తొలికవిత)



- కెంగార మోహన్,
9493375447

> **రాజకీయవేత్త నినాదాల్లో కవిత్వం బందీ అయిపోయిందని బాధపడి ఒక కొత్త కవిత్వోద్యమాన్ని శేషేంద్ర ప్రారంభించడం మూలంగా దానికి 'కవిసేన' అని పేరు పెట్టి లోతైన కవిత్వవిమర్శ చేయడం వల్ల ఈ పరిణామాలనిపిస్తుంది.**

మరి మినీ కవితా ఉద్యమం దాదాపు 1980 తర్వాతనే అని చెబుతున్న పరిశోధకులు ఈ మూలాలను చూడలేదా? అప్పుడు శేషేంద్ర కవిత్వంలో లేదా? ఇంకా చెప్పాలంటే తెలిసినా దాన్ని పరిగణనలోకి తీసుకోలేదా? చాలామంది పరిశోధనా గ్రంథాల్లో పరిశీలించినపుడు శేషేంద్రకు తీరని అన్యాయమే చేశారనిపిస్తుంది. ఇప్పటి ప్రక్రియలకు మూలకర్తలు వీళ్ళే, సృష్టికర్తలు వీళ్ళే అని ప్రసంగాల్లో తమ పాండిత్యాన్ని వొలకబోస్తూ మాట్లాడేవాళ్ళు శేషేంద్ర మినీ కవిత్వాన్ని ఎందుకు పసిగట్టలేదు. ఆధీపర్వం శేషేంద్రజాలం పేరుతో 1985లో ఆంధ్రజ్యోతి వారపత్రిక ప్రచురించింది. ఆ కాలంలో వందలాది అభిమానులను ఆయన కవిత్వం ఒక సైన్యంలా చేయగలిగింది. సిద్ధాంత రీత్యా ఆయన భావజాలంతో విభేదించవచ్చేమో కాని, ఆయన కవిత్వంతో ఎవరు విభేదించినా కవిత్వలోనికి తీరని ద్రోహం చేసినవాళ్లమౌతాం. అసలు ఇవి మినీ కవితలు కావా..? ఆధీపర్వంలోని మొదటి సర్గ చూడండి.. ఎంత గొప్ప భావుకత, శిల్పం కనబడతాయో.. ఇందులో సామాజిక స్పృహ, సాహిత్య స్పృహ దర్శనమిస్తాయి. పరిశీలించండి..

"సూర్యుడ్నించి సూర్యుడికి/ ఇరవైనాలుగు గంటల దూరం/ మనిషి నుంచి మనిషికి/ రెండు గుండెలే దూరం/ ఆకాశం ప్రభాత వాయువుల చేతుల్లో/ ఊదా రంగు ముడతలు విప్పి/ తనని జెండాలా ఎగరేస్తోంది/ అడుగు!/ గ్రామం నుంచి సంగ్రామానికి/ ఎన్ని తుపాకుల దూరం/ వాడు ఒక్కొక్క జీవితపు పేలిక కోసం/ వాడికి ఉన్న రెండు చేతుల్తో యుద్ధం చేశాడు/ శాంతి రేవులు చేరే కోరికతో సముద్రాలు ఈదాడు/ ఆశల ఒడ్డ కోసం తెడ్లు లేని నావల్లో ప్రయాణించాడు./ అరే ఎప్పుడు తెలుసుకుంటావు/ ఇది భూగోళం! మానవుడి ఆస్తి"

1985 రాసిన మౌక్తిక పర్వమంతా కూడా మినీ కవితలమయమే కదా! ఈ మౌక్తిక పర్వమొకటి చాలు ఇప్పుడున్న కవిత్వ ప్రకియల మూలాలన్నీ కనబడతాయి. ఈయనను ఆదిపురుషుడు.. మూలపురుషుడు అనాలని నేను కోరుకోవడం లేదు. రావలసినంత ఖ్యాతి రాకుండా పోయిందనేదే బాధ. గమనించండి మినీ కవితలు..

"కాలాన్ని నా కాగితం చేసుకుంటా/ దాని మీద లోకానికి ఒక స్వప్నం/ రాశి యిస్తా/ దాని కింద నా ఊపిరితో సంతకం చేస్తా/ సముద్రం ఒకడి కాళ్ళ దగ్గర కూర్చుని మొరగదు/ తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు/ పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు/ నేనెంతా.. ఒక పిడికెడు మట్టే కావచ్చు/ కానీ కలమెత్తితే నాకు/ ఒక దేశపు జెండా కున్నంత పొగరుంది."

ఉదాహరణకు మాత్రమే ఇవి.. ఈ పర్వం నిండా మినీ కవితలే. ఆధునిక కవిత్వం పురుడుపోసుకున్న వివిధ కవిత్వ ప్రక్రియల నిర్మాణ రహస్యాలన్నీ ఈ వొక్క పర్వంలో కనబడతాయి. చాలా ప్రగతిశీల కవిత్వం రాసినా ఆయన్ని దూరం పెట్టారనిపిస్తుంది. బహుశా ఆయన 'కవులు రాజకీయ పక్షాల నిరంకుశ ప్రజ్ఞలకు కట్టుబడి సాహిత్య సృహను కోల్పోరాదని' కవిసేన ద్వారా హెచ్చరించడమే కారణమని అనిపిస్తుంది. అంతేకాక రాజకీయవేత్త నినాదాల్లో కవిత్వం బందీ అయిపోయిందని బాధపడి ఒక కొత్త కవిత్వోద్యమాన్ని శేషేంద్ర ప్రారంభించడం మూలంగా దానికి 'కవిసేన' అని పేరు పెట్టి లోతైన కవిత్వవిమర్శ చేయడం వల్ల ఈ పరిణామాలనిపిస్తుంది. కవిసేన ద్వారా కవిత్వాన్ని ఒక మహాయుధంగా సామాజిక ప్రగతివాదులమని భావించే కవులపై ఝుళిపించారు. తొలుత సాంప్రదాయశైలిలో షోరాబ్, ఋతు ఘోష, పక్షుల కావ్యాలను రచించడమైనా కావచ్చు. ఆయనపై సాంప్రదాయక కవి ముద్ర ఉండటం వల్ల అన్యాయం జరిగి ఉండవచ్చు. వాస్తవానికి కావ్య వస్తువులో, కవితా శిల్పంలో మార్పు రావలసిన ఆవశ్యకతను గుర్తించి, సమకాలీక సమాజ సమస్యలను అవగాహన చేసుకొని వీరు వచన కవితకు మరలారని, ప్రకృతి పరిశీలనలో శేషేంద్ర శర్మ దృష్టి అమోఘమని కొంతమంది మాత్రమే చెప్పగలిగారు.

దేవతలే లేకుండా బ్రతకలేని జాతి మనది. పూజలనీ, భజనలనీ అస్తమానమూ భక్తులు పెట్టే బాధలు పడలేక దేవతలు మందిరాల్నించి పారిపోతున్నారు. నేడు భక్తుల్లో పెరుగుతున్న మహాభక్తి దేవతలకు జాతీయ సమస్యగా మారిందని తనే చెప్పారు. శేషజ్యోత్స్న, మండే సూర్యుడు నా దేశం, నా ప్రజలు సముద్రం, నా పేరు నీరై పారిపోయింది, గొరిల్లా, ప్రేమలేఖలు వంటి కావ్యాలు శేషేంద్రశర్మగారి కవితా సౌందర్యాన్ని ప్రతిబింబించే నిలువుటద్దాలని విమర్శకులు చెబుతూనే ఉన్నారు. కవిత్వం రాస్తే ఆయనలా రాయాలి లేకుంటే రాయనవసరం లేదని, కవిత్వాన్ని రాయడం మానేసి పాఠకులుగానే మిగిలిపోయిన కవులు తెలుగు రాష్ట్రాల్లో చాలామందే ఉన్నారు. చైతన్యం ముసుగు కింద వీరవిహారం చేస్తున్న శిల్పరహిత అకవిత్వ మలినాన్ని దేశంనుంచి క్షాళనం చెయ్యాలన్నదే శేషేంద్ర సంకల్పమని, శిల్ప రహితమైన కవిత్వం త్వరలోనే తన తేజస్సు కోల్పోతుందని గొప్ప విమర్శ చేయడం తెలుగు సాహిత్య చరిత్రలోనే నూతన అధ్యాయం. శేషేంద్ర సాహిత్యమంతా ప్రయోగాల మయమే. తెలుగులో గజల్ సాధ్యం కాదన్నారు. సాధ్యం చేసి చూపించాడు. చంధస్సుల్లోనూ, ఆశ్చర్యకరమైన చమత్కారికల్లోనూ ప్రయోగాలు చేశాడు. వేమన ఆటవెలది చేసినట్టు సంస్కృతంలోని చంధస్సు ప్రయోగంతో కావ్యాలు రచించినట్లు ఈయన అనేకానేక ప్రయోగాలు చేశాడు. ఎట్లా చెప్పావన్న దానిపైనే కవిత్వ విలువలుంటాయన్న శేషేంద్ర చిరస్మరణీయుడు.

సాహితీ వార్తలు

జాతీయస్థాయి కవితల పోటీ

అల్వాల బాల్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా కవితలకు ఆహ్వానం పలుకుతున్నారు. 20 - 25 లైన్లకు మించని కవితలను ఆగస్టు 20 రాత్రి 12 గంటల లోపు పంపాలి. వివరాలకు : శ్రీమతి విజయలక్ష్మి వడ్డేపల్లి, 6303732862.

నవలల పోటీకి ఆహ్వానం

అరసం వరంగల్ వారు ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం 2024 కు గాను నవలలను ఆహ్వానిస్తున్నారు. 2020 జూలై నుండి 2024 జూన్ వరకు ప్రచురించిన మొదటి ముద్రణ నవలలను 4 ప్రతులను ఆగస్టు 31 లోపు 'మా నిధి, ఇంటి నెంబర్ : 2 - 4 - 1449 అశోక కాలని, హనమకొండ 506001, తెలంగాణ' చిరునామాకు పంపాలి. వివరాలకు : 9701000306.

మినీ నవలల పోటీ 2024

వురిమళ్ల ఫౌండేషన్ ఖమ్మం వారు బాలలకు, యువతకు మినీ నవలల పోటీ నిర్వహిస్తున్నారు. ఏదైనా సామాజిక, పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ, మానవీయ సంబంధాలు అంశాలపై 30 పేజీలకు తగ్గకుండా నవల రాయాలి. నవలలను కొరియర్, పోస్ట్ ద్వారా సెప్టెంబర్ 30 లోపు ఇంనెం.11-10-694/5, బురహాన్‌పురం, ఖమ్మం - 507001 చిరునామాకు పంపాలి. వివరాలకు : 9494773969.

'అమృతలత - పాలపిట్ట' దీపావళి కథల పోటీ

డాక్టర్ అమృతలత -పాలపిట్ట సంయుక్తంగా ఈ ఏడాది దీపావళి కథల పోటీ నిర్వహించాలని సంకల్పించాయి. సహజ ఇతివృత్తాలతో కూడిన కథలకు ఆహ్వానం పలుకుతున్నారు. మొదటి మూడు బహుమతులు, 10 ప్రత్యేక బహుమతులుంటాయి. కథలు చేరవలసిన చివరి తేదీ సెప్టెంబర్ 25. చిరునామా : ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 3, బ్లాక్-6, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500044. ఫోను: 9490099327, ఈమెయిల్: palapitta books@gmail.com

నిజంగా.. వాళ్ళని నేను కలిసాను - ఓ జ్ఞాపకం గుల్జార్




- వారాల ఆనంద్,
9440501281

ఇటీవలే సుప్రసిద్ధ కవి గుల్జార్ రాసిన ACTUALLY ... I MET THEM MEMOIR BY GULZAR (నిజంగా.. వాళ్ళని నేను కలిసాను- ఓ జ్ఞాపకం - గుల్జార్) పుస్తకం గొప్ప జ్ఞాపకాల సమాహారం. అవన్నీ అద్భుతమయిన జ్ఞాపకాలు కదా! ఏకబిగిన చదివించే స్థాయి. గుల్జార్ ఇన్నేళ్ళ జీవితంలో ఎంతో మందిని కలిసారు. కవులు, రచయితలు, దర్శకులు, నటీనటులు, గాయకులూ, సంగీత దర్శకులు ఓహ్ గొప్ప జ్ఞాపకాలు, మరెన్నోగొప్ప అనుభవాలు. ఈ పుస్తకంలో తాను తన నిత్య జీవితంలో కలిసిన వాళ్ళ గురించి ప్రస్తావించారు. తన వృత్తి జీవితంలో తాను కలిసి పనిచేసిన వారి గురించీ రాసారు. అంతే కాదు తన పై వాళ్ళ ప్రభావాన్ని కూడా గుల్జార్ ఈ పుస్తకంలో సవివరంగా చెప్పారు. పుస్తకం శీర్షిక 'నిజంగా.. వాళ్ళని నేను కలిసాను'లో నిజంగా అనడంలోనే గుల్జార్ కవితాత్మ కనిపిస్తున్నది. వాళ్ళని ఊరికే కలిసాను అని కాకుండా నిజంగా కలిసాను అంటే మనసు లోతుల్లోంచి కలిసి రాసాను అంటున్నాడు గుల్జార్. ఇదొక మంచి జ్ఞాపకాల తోరణం.

నిజానికి ఇది గుల్జార్ జీవిత చరిత్ర కాదు. ఎందుకంటే జీవితచరిత్ర రచనకు, జ్ఞాపకాలకు తేడా వుంటుంది. జీవితచరిత్రలో సమగ్ర జీవితం వుంటే జ్ఞాపకాల్లో కొన్ని ముఖ్యమయిన సందర్భాలు, సంఘటనలు వుంటాయి. ఈ పుస్తకం నిండా జ్ఞాపకాలున్నాయి.

మనిషి జీవితంలో జ్ఞాపకాలు మరుగున పడవు. చేతన, అంత:చేతనల్లో ఎక్కడో ఒక చోట సజీవంగా నిక్షిప్తమయ్యే వుంటాయి. అందునా కవీ, కళాకారుడి జీవితాల్లో జ్ఞాపకాలు హృద్యంగానూ, సాంద్రంగానూ వుంటాయి. కావలసిందల్లా ఆ జ్ఞాపకాలని రాయాలనుకున్నప్పుడు మనసు, ఆలోచనలు తిరిగి ఆ కాలంలోకి వెళ్ళాలి. ఆ కాలాన్ని పునర్ దర్శించాలి. వున్నది వున్నట్టు కల్పనారహితంగా రచనలో ప్రతిబింపజేయాలి. అప్పుడే ఆ జ్ఞాపకాలకు సాహిత్యంలో స్థానంతో పాటు గౌరవమూ లభిస్తాయి. నా అభిప్రాయంలో ACTUALLY... I MET THEM MEMOIR BY GULZAR పుస్తకం అలాంటి గౌరవం ఇవ్వాల్సిన రచన. ఈ పుస్తకం ఫస్ట్ పర్సన్‌లో సాగుతుంది. తొలుత బెంగాలీ పత్రిక ఆదివారం సంచిక కోసం గుల్జార్ ఇవి రాశారు. అవన్నీ కలిపి 'పంటా భాటే' పేరున బెంగాలీలో పుస్తకంగా వచ్చింది. ఇప్పుడు మహార్ఘ్య చక్రవర్తి ఇంగ్లీషులోకి చేసారు. పెంగ్విన్ వాళ్ళు ప్రచురించారు.

ఈ ACTUALLY ... I MET THEM MEMOIR BY GULZAR లో గుల్జార్ తన గురువు, మెంటార్ అయిన బిమల్ రాయ్ నుంచి మొదలు పెట్టాడు. తాను తన మొదటి పాట కోసం బిమల్‌రాయ్ దగ్గరికి ఎట్లా, ఏ పరిస్థితుల్లో వెళ్లిందీ ఆసక్తికరంగా రాశారు. కవి శైలేంద్రకూ, సంగీత దర్శకుడు ఎస్డీ బర్మన్‌కూ చిన్న మనస్పర్థ వచ్చి, పాటకోసం శైలేంద్ర తనను పంపాడని గుల్జార్ రాశారు. అట్లా అనేక సంఘటనలను కథాత్మకంగా రాశారు. బిమల్ రాయ్‌తో మొదలయిన ఈ జ్ఞాపకాల పరంపర సంగీతదర్శకులు సలిల్ చౌదరి, హేమంత్ కుమార్, ఆర్.డి.బర్మన్, ప్రపంచ ప్రఖ్యాత దర్శకులు సత్యజిత్ రే, రిత్విక్ ఘటక్, బెంగాలీ సూపర్‌స్టార్ ఉత్తమ కుమార్, గాయకుడు కిషోర్ కుమార్, సంజీవ్ కుమార్, హృషికేశ్ ముఖర్జీ, పండిట్ రవి శంకర్, భీంసేన్ జోషి, నటీమణులు సుచిత్రసేన్, షర్మిళాటాగోర్, రచయిత్రి మహాశ్వేతా దేవి లాంటి అనేక మందితో తన పరిచయం, తనపై వారి ప్రభావం రాశారు. గుల్జార్ రాసే విధానం మనతో మాట్లాడుతున్నట్టు వుండి చకచకా చదివిస్తుంది. అనేక విషయాల్ని ఆలవోకగా చెప్పినట్టు అనిపిస్తుంది.




ఇక గుల్జార్ గురించి చెప్పుకుంటే... 'బాబూమొషై జిందగీ బడీ హోని చాహీయే, లంబీ నహి',/ 'జబ్ తక్ జిందా హూ తబ్ తక్ మరా నహీ, జబ్ మర్ గయా సాలా మై హీ నహీ'/ 'మౌత్ తో ఏక్ పల్ హై, (జీవితం ఉన్నతమైంది కావాలి, కాని దీర్ఘమయింది కాదు, బతికి ఉన్నంతవరకూ చావలేదు, చచ్చింతర్వాత నేనే లేను, మరణం ఒక క్షణమే).

ఇలాంటి తాత్విక సజీవమయిన సంభాషణలు ఆనంద్ సినిమాలోవి. అవి రాసిన వారు గుల్జార్. అట్లా కేవలం సంభాషణలే కాదు, ఈయన గొప్ప కవి, సినీ గేయ రచయిత, రచయిత, సినీ దర్శకుడు కూడా. బహుముఖీన కార్యశీలి, ప్రతిభావంతుడు, భావుకుడు. ఈయన రచనలు, సినిమాలు, గజల్స్ అన్నీ సృజనాత్మకంగానూ తాత్వికంగానూ వుండి ఆయనలోని సున్నితత్వాన్ని సరళత్వాన్ని ఆవిష్కరిస్తాయి. ఆయన కవిత చదివే పద్ధతి కూడా శ్రోతల్ని అమితంగా ఆకట్టుకుంటుంది. ఇట్లా పలు రంగాల్లో తన ముద్రను చాటుకున్న గుల్జార్ అనువాదంలో కూడా ఉన్నతమయిన కృషి చేశారు, చేస్తున్నారు. ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పంజాబీ, బెంగాలి భాషల్లో ప్రావీణ్యమున్న గుల్జార్ దేశంలోని ఇతర భాషల రచనల్ని చదవడానికీ ఇష్టపడతారు. 'మన మెదడు అంటిన్నా(antenne) ను తెరిచి వుంచాలి. అప్పుడే ఇతర ప్రాంతాల్లో, ఇతర భాషల్లో ఏమి జరుగుతుందో తెలిసి వస్తుంది' అంటారు ఈయన. అట్లా భాషా, సాంస్కృతిక ప్రక్రియల్లో నిరంతర కృషి కొనసాగిస్తున్న గుల్జార్ ఒక లివింగ్ లెజెండ్. దర్శకుడిగా, కవిగా హిందీ చలన చిత్రసీమలో తన ముద్రను చాటుకున్నారు.

గుల్జార్‌గా అందరికీ పరిచయమున్న ఆయన అసలు పేరు సంపూరన్ సింగ్ కల్రా. ఆగస్ట్ 18,1936 రోజున ప్రస్తుతం పాకిస్తాన్‌లో వున్న దీన పట్టణంలో సిక్కు కుటుంబంలో జన్మించారు. చిన్నప్పటినుంచీ అంత్యాక్షరీ ఆడడంలో ఆసక్తిగా వుండే ఆయన అప్పటినుండే భాష పట్ల, పదాల పట్ల మక్కువను పెంచుకున్నారు. చిన్నప్పటినుండే హిందుస్తానీ సంగీతం పట్ల మక్కువ కలిగిన గుల్జార్ రవిశంకర్, అలీ అక్బర్‌ఖాన్‌ల కచేరీలకు వెళ్ళేవారు. గుల్జార్ కుటుంబం దేశవిభజనలో తీవ్రంగా ప్రభావితమయింది. సొంతవూరు విడిచి అమృత్‌సర్‌కి వలస వచ్చింది. తమ కుటుంబ వ్యాపారమయిన మెకానిక్ దుకాణంలో పనిచేయడంతో గుల్జార్ జీవితం ఆరంభమయింది. తన పదమూడేళ్ళ వయస్సులోనే చదవడం పైన ఆసక్తి కలిగిన గుల్జార్ పుస్తకాలు కిరాయికిచ్చే షాప్ నుండి అపర పరిశోధక నవలలు, మాజిక్ ఫాంటసీ రచనల్ని చదవడం ఆరంభించారు. వారానికి ఇంత అని రుసుము చెల్లిస్తే ఎన్ని పుస్తకాలయినా చదివే వీలుండేది అక్కడ. దాంతో తమ షాప్ పని అయిపోగానే రోజుకు ఒకటి అని కాకుండా రెండు మూడు పుస్తకాలు చదివేవారు గుల్జార్.

ఒక నాటికి షాప్‌లోని పుస్తకాలు దాదాపు అయిపోవడంతో షాపతను ఇట్లా ఎన్ని చదువుతావు అంటూ సజ్జ మీదవున్న పుస్తకమొకటి తీసి ఇచ్చాడు. అది టాగోర్ రాసిన 'గార్డనర్'. అది చదివింతర్వాత గుల్జార్లో చదివే దృక్పథమే మారిపోయింది. తర్వాత ప్రేమ్‌చంద్ నుంచి మొదలు అనేక మంది గొప్ప రచయితల రచనలు చదవడం మొదలుపెట్టారు. అప్పుడే గుల్జార్‌కి ప్రగతిశీల రచయితలు, కళాకారులతో పరిచయం కలగడం, PWA కార్యక్రమాలల్లో పాల్గొనడం మొదలయింది. దాంతోపాటు ఆయనకు సినిమాల పట్ల ఆసక్తి కూడా ఆరంభమయింది. అప్పుడే శైలేంద్ర పరిచయం అయ్యారు. ఆ పరిచయమే బిమల్‌రాయ్ వద్దకు చేర్చింది. అట్లా సినిమాతోనూ సాహిత్యంతోనూ సహజీవనం చేస్తున్న గుల్జార్ జ్ఞాపకాల పుస్తకం ఈ ACTUALLY... I MET THEM MEMOIR BY GULZAR. ఇది చాలా గొప్ప జ్ఞాపకాల సమాహారం. తప్పకుండా చదవాల్సిన మధుర 'స్మృతి' సంకలనం.

ఇది ఓ జీవితం.. ఓ కవితా సముద్రం





'జన్మించడమే కవిత్వం' ఓ జీవితం. ఓ కవితా సముద్రం. దీన్ని సమీక్షించాలంటే భాష, భావం లోతులకు వెళ్లాలి. వెళతాం. ఒక్క మాటలో చెప్పాలంటే శైలజా మిత్ర భాషతో ఆడుకున్నారు. "నా జీవితం సాహిత్యంలో ఉందా? లేక సాహిత్యం నా జీవితంలో ఉందా?" అనే సందిగ్ధంలో పడతానన్నారు ఆమె. అయితే, రెండూ కలిపిన జీవితం ఆమెది.

'నా ప్రయాణం చందమామ కై' అనే కవితలో శైలజామిత్ర తన జీవిత,30 ఏళ్ల కవితా ప్రయాణాన్ని అంతా చొప్పించేశారు. భూమి అంటేనే బోరుకొట్టడం-శూన్య ముహూర్తం చూసి ఇల్లు మొదలుపెట్టడం-ఒంటిరిగానైనా సంతోషంగా నివసించడం- నిర్మలమైన నవ్వులు- నిర్బంధమే లేనితనం - గడిచిన బాల్యం - భావాల విహంగమై గగన తలాన్ని చుట్టడం- ప్రతి అనుభూతి నేనే అవడం - అలసటలేని అరణ్యం - అంతిమపోరాటం - అక్షరమై నిలిచిపోవడం...ఇదంతా ఒకే కవితలో అల్లేశారు. ఒక జీవిత ప్రయాణ అనుభవాలన్నీ ఇందులో ఉన్నాయి. "కవిత్వం నాకు తెలిసినంతవరకు ఒక సజీవ ప్రక్రియ" అని ముందే చెప్పారు. అలాగే రాశారు. ఓ మనిషి, ముఖ్యంగా ఓ స్త్రీ జీవితమంతా శైలజామిత్ర కవిత్వంలో ఉంది.

"ఇప్పటికీ నా అణువణువులో అమ్మ లాలిపాట వినిపిస్తుంటే నా బిడ్డకు డబ్బు కోసం ఈ అమ్మ పోరుబాట కనిపిస్తోంది" రెండు లైన్లలో నాటి తల్లికి, నేటి తల్లికి తేడా చాలా స్పష్టంగా చెప్పేశారు. ఇందులో ఓ గ్రంథం రాసేటంత నిగూఢ అర్థం దాగుంది. ఇదే అసలైన సిసలైన అద్భుతమైన అందరికీ అర్థమయ్యే కవిత్వం.

అమ్మానాన్న-ఉదయం-మధ్యాహ్నం-సాయంత్రం-రాత్రి- ఈ మధ్యలో వచ్చే స్వార్థం- అబద్ధం- ఆకలి-అన్యాయం-ప్రేమ-కోపం- ఒంటరితనం -కన్నీరు -ఆనందం -ఆత్మీయత-అనురాగం- ఆశలు-నవ్వులు -ఆశయాలు-చీకటి-వెలుగు..ఇదే మనజీవితం. అదే శైలజామిత్ర కవిత్వం. మరణం ఏ ఒక్కరి ఆస్తి కాదు. వాహ్! ఇందులో ఎంత భావం ఉందో!!

అంతస్తులను బట్టి అనుబంధాలు.. ప్రేమేలేని వింత బంధాలు.. ఎంత కాదన్నా అల్లుకున్న బంధాలు.. ఎంత కొత్త యుద్ధమైనా ఫలితాలన్నీ పాతవే.. క్షణికావేశాల మధ్య గడ్డ కడుతున్న పాషాణ హృదయాలు.. కాలం గమనాను సారం సాగిపోవడం. ఎందరో వ్యక్తులు, మనస్తత్వాలతో నడవడం.. తెల్లవారితే వెళ్లిపోయే రాత్రి. 'పగ'లతో రగిలిపోయే పగలు.. ఇలా సాగుతుంది శైలజా మిత్ర కవిత్వం.

కవిత్వంతోపాటు ఈ పుస్తకంలో 2004లో బెంగళూరు సాహిత్య అకాడమి వారు ఇచ్చిన ట్రావెల్ గ్రాంట్ ద్వారా శైలజా మిత్ర సాహితీ ప్రయాణ విశేషాలు ఓ బోనస్. గొప్ప గొప్ప తమిళ రచయితలు, కవులను, సాహితీవేత్తలను ఆమె స్వయంగా కలిశారు. వారి గురించి, వారి సాహిత్యం గురించి చాలా చాలా చక్కగా శైలజా మిత్ర తనదైన శైలిలో వివరించారు. ఆమె సాహితీ ప్రయాణం తప్పక తెలుసుకోవాలి. ఆమె తన ప్రయాణంలో ఓ పబ్లిషర్, ఓ నటుడు, ఓ ఉపాధ్యాయుడు, ఓ ఉపాధ్యాయురాలు, ఓ బ్యాంక్ ఆఫీసర్, ఓ ఐఏఎస్ ఆఫీసర్, ఓ విలేకరి, ఓ అనువాదకుడు, ఓ రాజకీయ నాయకురాలు, ఓ స్క్రీన్ ప్లే రైటర్, ఓ ఎలక్ట్రానిక్ మీడియా న్యూస్ ఎడిటర్, ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్, ఓ ఆస్పత్రి సూపరింటెండెంట్, ఓ తత్వవేత్త, ఓ ప్రభుత్వ ఉద్యోగి... ని కలిశారు. వీరంతా తమిళ ప్రజల మనసు దోచుకుని ఎన్నో అవార్డులు అందుకున్న ప్రముఖ సాహితీ వేత్తలే. శైలజా మిత్ర ఒక్కొక్కరిని కలిసినప్పటి అనుభవాలు తప్పక తెలుసుకోవాలి. నడుస్తున్న చరిత్ర అది. ఆ విధంగా ఆమె తమిళ సాహితీవేత్తల హృదయాన్ని మన ముందు పెట్టారు.



- శిరందాసు నాగార్జున,
9440222914

పేరుకు 'బెస్ట్'.. పనులు వరెస్ట్

ఉత్తమ అధికారిగా అవార్డు.. మూడు రోజుల్లోనే సరెండర్

- విధుల్లో నిర్లక్ష్యం, అవకతవకలతో డీఎంహెచ్ఓపై వేటు
- లైంగిక వేధింపుల ఆరోపణలతో డీపీఓ సరెండర్
- డీఎంహెచ్ఓ మాలతి వ్యవహారాలను బయటపెట్టిన 'నవతెలంగాణ'
- 59 ఏండ్ల వయసులో జిల్లా పంచాయతీ అధికారి పాడు పనులు
- చర్చనీయాంశంగా ఉత్తమ అవార్డు అధికారి తీరు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ అధికారిగా ఉత్తమ సర్వీసు అందించిన ఉద్యోగులకు అవార్డులిస్తుంటారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున, జనవరి 26 గణతంత్ర దినోత్సవం నాడు, జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం...ఇలా పలు సందర్భాల్లో ఈ అవార్డులు ప్రదానం చేయటం ఆనవాయితీ. కానీ ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగులకు దక్కాల్సిన అవార్డులు పైరవీలతో పక్కదారి పడుతున్నాయని వింటుంటాం. దానికి నిదర్శనమే ఈ ఘటన. ఖమ్మం జిల్లా వైద్యాధికారి బోడ మాలతి.. మొన్న ఆగస్టు 15 సందర్భంగా గురువారం నాడు ఉత్తమ జిల్లా అధికారిగా అవార్డు తీసుకున్నారు. సరిగ్గా మూడు రోజులైందో.. లేదో.. విధి నిర్వహణలో ఆమె వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెతో పాటు జిల్లా పంచాయతీ అధికారి ఈ. హరికిషన్‌ను సైతం బాధ్యతల నుంచి తప్పించారు. ఒకేరోజూ ఇద్దరు అధికారులను.. అందునా ఉత్తమ అవార్డు


(ఫైల్)

అందుకున్న మూడురోజులకే సరెండర్ చేయటం చర్చనీయాంశంగా మారింది.

అదనపు బాధ్యతలు..

జిల్లా పంచాయతీ అధికారి స్థానంలో జడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న నాగలక్ష్మికి అదనపు బాధ్యతలు ఇచ్చారు. జడ్పీ సీఈఓ వినోద్ బదిలీ అయినప్పటి నుంచి ఆమె సీఈఓగా అదనపు బాధ్యతలు చూస్తున్నారు. ఆమె ఇప్పుడు డీపీఓగానూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇక డీఎంహెచ్ఓను వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖకు సరెండర్ చేశారు.

ఆరోగ్యశాఖ కమిషనర్, పూర్వ కలెక్టర్ ఆర్వీ కర్ణన్ జిల్లా పర్యటనలో డెంగ్యూ కేసుల నమోదు, రోగులకు చేసే పరీక్షల్లో లోపాలతో ఆయన అసహనానికి లోనయ్యారు. ఫలితంగా కలెక్టర్ సరెండర్ చేశారు. ఆమె స్థానంలో జిల్లా కుష్టు నియంత్రణాధికారిగా పనిచేస్తున్న వరికూటి సుబ్బారావుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు.

ఉత్తమ అవార్డు అందుకున్న డీఎంహెచ్ఓపై వారం తిరక్కముందే వేటు పడటం.. ఎంపికలో లోపాలను ఎత్తిచూపుతోందనే చర్చ మొదలైంది.

డీపీఓ హరికిషన్‌ది మరో కథ..



జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ మహిళా ఉద్యోగులతో అసభ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై బాధిత మహిళా ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయన్ను పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. దాంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య చర్యల విషయంలోనూ డీపీఓ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

'నవతెలంగాణ' కథనాలే మూలం..!

ముఖ్యంగా డీఎంహెచ్ఓ మాలతి సరెండర్‌కు మూలం 'నవతెలంగాణ' కథనాలే అని చర్చ సాగుతోంది. డీఎంహెచ్ఓ విధి నిర్వహణలో అవకతవకలు, అద్దె వాహనాల విషయంలో ఆరోపణలు, ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా తన తల్లిపేరుతో ఉన్న కారును అద్దెకు పెట్టడం, ప్రయివేటు హాస్పిటల్స్ అనుమతులు, పునరుద్ధరణకు సంబంధించి ఇన్‌వార్డు, ఔట్‌వార్డులో లొసుగులు, ఔట్‌వార్డు రిజిస్టర్ మెయింటెన్ చేయకుండా ముడుపులు ఇస్తేనే అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు, హైదరాబాద్ నుంచి వచ్చే అధికారులకు రూ.లక్షలు ఖర్చు పెట్టడం, తనకు అనుకూలంగా వ్యవహరించే ఉద్యోగులకు పెద్దపీట వేయడం.. లేదంటే కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం.. ఇలాంటి అనేక ఆరోపణలతో ఆమెకు డిపార్టుమెంట్‌పై అజమాయిషీ తగ్గిందనే వాస్తవాలను పై అధికారులు గుర్తించారు. ఆమెపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు సైతం విచారణ నిర్వహిస్తున్నారు. వరంగల్ రీజియన్ విజిలెన్స్ అధికారికి అప్పట్లో సీఎం పేషీ నుంచి ఖమ్మం జిల్లా డీఎంహెచ్ఓపై దృష్టి సారించాల్సిందిగా ఆదేశాలు అందాయి. ఇవన్నీ ఉన్నా ఆమె మంత్రులు,



వైద్యారోగ్యశాఖ మంత్రిత్వశాఖలో కొందరి పైరవీతో జిల్లాలోనే కొనసాగుతున్నారు. తన రిటైర్మెంట్‌కు మరో మూడునెలలు అంటే నవంబర్ వరకు మాత్రమే సమయం ఉండటంతో పై అధికారులు కూడా చర్యల విషయంలో ఉపేక్షించారు. ఈ అంశాలపై 'నవతెలంగాణ'లో మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పలు కథనాలు వచ్చాయి. వీటితో పాటు ఇటీవల జిల్లాలో డెంగ్యూ కేసులు విచ్చలవిడిగా పెరిగాయి. జ్వరాలు విపరీతంగా ప్రబలుతున్నా శాఖాపరంగా నామమాత్రపు చర్యలే ఉండటం, ప్రయివేటు ఆస్పత్రులపై అజమాయిషీ లేని కారణంగా డీఎంహెచ్ఓను ప్రభుత్వానికి సరెండర్ చేసినట్టు తెలుస్తోంది.



గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్

- అహమ్మద్‌నగర్ బస్తీలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గంజాయి, డ్రగ్స్ మహమ్మరిని తరిమికొడదామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) పిలుపునిచ్చింది. ఈమేరకు ఆదివారం డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నాంపల్లి జోన్ అహమ్మద్‌నగర్ బస్తీలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ హాజరై మాట్లాడారు. నేటి యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అత్యంత ప్రమాదకరమైన మత్తు పదార్థాలను సేవించడంతో సకల అనర్థాలకు కారణమవుతున్నారన్నారు. నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ దందా విస్తరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బడిపిల్లల నుంచి వర్సిటీ విద్యార్థులు, రోజు కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు ముఖ్యంగా సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఈ మత్తు మహమ్మారికి బానిసలౌతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరంతరమైన నిఘాను ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ నిర్మూలించాలని డిమాండ్ చేశారు. యువత ఉన్నతమైన స్థానాల్లో ఉండి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థులు, యువత బహుముఖ సేవా కార్యక్రమాల్లో, డీవైఎఫ్ఐ నిర్వహించే అహగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎండీ జావెద్, అధ్యక్షులు హాస్మి బాబు, ఉపాధ్యక్షులు అర్షద్, రవి, కలిమ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్, నాగేందర్, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ డిస్కంలో భారీగా పదోన్నతులు

- 2017 నుంచి పెండింగ్...
- 2,263 మందికి ఒకేసారి ప్రమోషన్లు
- పాలాభిషేకాలు చేసిన ఉద్యోగులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో భారీగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు ఆ సంస్థ సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థలో ఒకేసారి 2,263 మందికి ప్రమోషన్లు లభించాయి. పదోన్నతులతో ఖాళీ అయిన పోస్టుల్ని త్వరలో భర్తీ చేస్తామని సీఎమ్‌డీ చెప్పారు. విద్యుత్ సంస్థల్లో పదోన్నతులపై కొద్దిరోజులుగా వివాదం చెలరేగుతున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు ఈ వివాదాలకు సీఎమ్‌డీ ముగింపు పలికారు. ఇంజినీరింగ్ విభాగంలో 101, అకౌంట్స్‌లో 47 ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎమ్)లో 2,099, పీ అండ్ జీలో 16 మంది అధికారులు, సిబ్బందికి పదోన్నతులు లభించాయి. పదోన్నతులపై ఈనెల 8వ తేదీ ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థికశాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క డిస్కం ప్రధాన కార్యాలయంలోనే సమీక్షా సమావేశం నిర్వహించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని ఆదేశించారు. ఆ మేరకు సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ ఏకకాలంలో 2,263 మందికి ప్రమోషన్లు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనితో డిస్కం ప్రధాన కార్యాలయం లో పాటు ఇతర జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీల చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి, కృతజ్ఞతలు తెలిపారు. అయితే 2017 నుంచి పదోన్నతులు పెండింగ్‌లో ఉండటంతో అర్హులైన ఉద్యోగులు అనేకమంది పదోన్నతులు పొందకుండానే రిటైర్ అయ్యారు. ప్రస్తుతం పదోన్నతులు పొందిన 2,263 స్థానంలో ఖాళీ అయిన పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని సీఎమ్‌డీ తెలిపారు.

'ఫొటో కాంపిటీషన్'లో మహిమల భాస్కర్ రెడ్డికి ప్రథమ బహుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


రాష్ట్ర స్థాయి న్యూస్ ఫొటో కాంపిటీషన్-2024లో ప్రథమ బహుమతి పొందిన ఫొటో

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటోజర్నలిస్టుల సంఘం నిర్వహించిన రాష్ట్ర స్థాయి న్యూస్ ఫొటో కాంపిటీషన్-2024లో రాష్ట్రంలోని 31 జిల్లాల నుంచి దాదాపు 100 మంది ఫొటోజర్నలిస్టులు తమ ఎంట్రీలను పంపారని తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి అనుమళ్ల గంగాధర్, కె.ఎన్.హరిలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన న్యూస్ ఫొటో కాంపిటీషన్-2024 ఛాయాచిత్ర ప్రదర్శనలో సీనియర్ జర్నలిస్ట్, సీఎం సీపీఆర్ఓ బి.అయోధ్య రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సిహెచ్. శుశీల్ రావు, సీనియర్ ఫొటో జర్నలిస్టు హెచ్.సతీష్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ఉత్తమ వార్తా చిత్రాలను ఎంపిక చేసారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, మహిమల భాస్కర్ రెడ్డి, వెలుగు (సిద్దిపేట), ద్వితీయ బహుమతి రూ.8 వేలు, పి. సురేంద్ర, డెక్కన్ క్రానికల్ (హైదరాబాద్), తృతీయ బహుమతి రూ. 5 వేలు ఏ. తరుణ్, టైమ్స్ అఫ్ ఇండియా (హైదరాబాద్)లు ఎంపికయ్యారు.

రూ. 2 వేల చొప్పున 25 కన్సోలేషన్ బహుమతులకు పి.మోహన చారి, సాక్షి (హైదరాబాద్), ముచ్చర్ల విజయ్, ఆంధ్రజ్యోతి (నల్గొండ), ఆర్. రాఘవేందర్, ఈనాడు (హైదరాబాద్), కె. జయకృష్ణ, ఈనాడు (హైదరాబాద్), బి.శివప్రసాద్, సాక్షి, (సంగారెడ్డి), జి.శ్రీనివాస్, నమస్తే తెలంగాణ (హైదరాబాద్), కె.శ్రావణ్ కుమార్, ఈనాడు (సిద్దిపేట), మొహమ్మద్ ఆరిఫ్, ది హిందూ (సంగారెడ్డి), ఎన్.యాదగిరి, ఈనాడు (హైదరాబాద్), పి. శ్రీధర్, ప్రజాపక్షం (కరీంనగర్), సూర్య శ్రీధర్, తెలంగాణ టుడే (హైదరాబాద్), టి.కిషోర్ సింగ్, హిందీ మిలాప్ (హైదరాబాద్), జి.ఎన్.రావు, ది హిందూ (ఖమ్మం), గోపి, నమస్తే తెలంగాణ (హైదరాబాద్), అశోకుడు యాదవ్, ఆంధ్రజ్యోతి (హైదరాబాద్), సి.బషీర్, ఈనాడు (హైదరాబాద్), వి.భాస్కర చారి, సాక్షి (మహబూబ్‌నగర్), పి. సింహ చలం, ఈనాడు (ఆదిలాబాద్), డి.సుమన్ రెడ్డి, టైమ్స్ అఫ్ ఇండియా (హైదరాబాద్), ఆవుల శ్రీనివాస్, ఈనాడు (హైదరాబాద్), శ్రీనివాస్ శెట్టి, ది హన్స్ ఇండియా (హైదరాబాద్), కె. దుర్గరావు, డెక్కన్ క్రానికల్ (హైదరాబాద్), ఏ. తరుణ్, టైమ్స్ అఫ్ ఇండియా (హైదరాబాద్), జ్వాలా కోటేశ్వర్ రావు, ఆంధ్రజ్యోతి, (హైదరాబాద్), బందగీ గోపి, నమస్తే తెలంగాణ (మహబూబ్‌నగర్) ఎంపికైనట్టు వారు ప్రకటించారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శనను సోమవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభిస్తారనీ, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కె. విరహత్ అలీ, రామనారాయణ తదితరులు హాజరవుతారని వారు తెలిపారు.

సంపూర్ణ రుణమాఫీ కాలేదు

- మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సంపూర్ణ రుణ మాఫీ కాలేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. సంపూర్ణ రుణ మాఫీ కాలేదని కాంగ్రెస్ నేతలు కోదండ రెడ్డి, ఆది శ్రీనివాస్‌తో పాటు కోదండరాం లాంటి వారే స్వయంగా ఒప్పుకున్నారని పేర్కొన్నారు. తాను అదే విషయాన్ని చెబితే తనపై ఎదరు దాడి చేస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులే రుణమాఫీ కాలేదని చెబుతున్న నేపథ్యంలో ఎవరు రాజీనామా చేయాలో సిఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు .రుణమాఫీ అయిపోయి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎందుకు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రుణమాఫీ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసి, రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీలో జాప్యం

- తగ్గిన ఆయుర్వేద యూజీ సీట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు ఇంకా కొనసాగుతుండటంతో వరంగల్ ఆయుర్వేద కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి చెందిన యుజి సీట్ల సంఖ్య తగ్గినట్టు తెలిసింది. అవసరమైన సబ్జెక్ట్ కావాల్సిన బోధన సిబ్బంది లేకపోవడంతో నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సిఐఎస్ఎం) యుజి సీట్లను 59 నుంచి 47కు తగ్గించారు. వరంగల్ కళాశాలను సందర్శించి, అక్కడి వాతావరణం, సిబ్బంది తదితర అంశాలను పరిశీలించిన అధికార బందం నిబంధనల మేరకు అవసరమైన సబ్జెక్ట్‌లకు తగిన సిబ్బంది లేదని గుర్తించినట్టు సమాచారం. దీంతో 2024-25 విద్యాసంవత్సరానికి సీట్లను తగ్గించారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఉంటే ప్రస్తుతం సీట్ల సంఖ్య తగ్గే అవకాశాలు లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయుర్వేద కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి వైద్యారోగ్యశాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. సుమారు 36 పోస్టులు ఖాళీగా ఉండగా, వీటి నియామకానికి ఆర్థిక శాఖ నుంచి అనుమతి కూడా లభించింది. దీంతో త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తారని గత కొంత కాలంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ నోటిఫికేషన్ మాత్రం జారీ కాలేదు. ఈ పోస్టుల కోసం దశాబ్దకాలంగా సుమారు రెండువేల మంది ఆశలు పెట్టుకున్నారు. ఈ పోస్టుల భర్తీ అంశంలో రాజకీయ ప్రమేయం ఉన్నట్టు ఆయుర్వేద కళాశాల వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వం నుంచి మొదలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు కొందరు ఉద్యోగుల అడ్డుపడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది వరకే ఖాళీ పోస్టులను భర్తీ చేసి ఉంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో యుజి సీట్ల సంఖ్య తగ్గే అవకాశాలు ఉండేవి కావని కొందరు చెబుతున్నారు. మరోవైపు కొందరు అధికారులు పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం వద్ద లాబీయింగ్ చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. వరంగల్ ఆయుర్వేద కళాశాలలో డిప్యూటేషన్ అధికారులు తిష్టవేశారు.అవసరమైన సబ్జెక్టులకు కాకుండా, ఇతర సబ్జెక్టులకు మాత్రం అవసరానికి మించి డిప్యూటేషన్ పద్ధతిన బోధన సిబ్బంది ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుతం సుమారు 14 మంది వరంగల్ ఆయుర్వేద కళాశాలలో పనిచేస్తున్నారు. క్లినికల్ వైపు పని చేస్తున్న కొందరు మెడికల్ ఆఫీసర్లు ఆయుర్వేదంలో తిష్టవేశారు.వారు ఆయుర్వేద కళాశాలలో పని చేస్తుండడంతో అక్కడ కొరత ఏర్పడింది. దీంతో అక్కడున్న ఉద్యోగులపైన అదనపు భారం పడుతోంది.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృత్యువాత

నవతెలంగాణ-బయ్యారం



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని వినోబా నగర్ గ్రామంలో సదానందం పశువుల శాలలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు 12 గొర్రెలు మృతిచెందగా, మరో ఐదు గొర్రెలు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని బాధితుడు సదానందం వాపోయాడు. మరణించిన గొర్రెల విలువ సుమారు రూ.2 లక్షల పైనే ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఇక రణరంగమే...

- హర్యానాపై కాంగ్రెస్ విశ్వాసం
- జమ్మూలో బీజేపీకి డీలిమిటేషన్ కలిసి వస్తుందా..కష్టాలు తెస్తుందా?



జమ్మూకాశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీ ప్రకటించగానే మరో ఎన్నికల రణరంగానికి తెరలేపినట్టయింది. జమ్మూ కాశ్మీర్‌లో మూడు దశల్లో ఎన్నికలు జరగనుండగా, హర్యానాలో 90 స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 4న వెలువడనున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ, కాంగ్రెస్‌లు మరోసారి ఎన్నికల రంగంలో తలపడడం ఇదే తొలిసారి. లోక్‌సభ ఎన్నికల తర్వాత హర్యానాలో తొలి ప్రత్యక్ష పోటీ జరగనుంది.

ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనేదే ప్రశ్న. బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందా లేక కాంగ్రెస్ పునరాగమనం చేస్తుందా? ఎన్నికలలో తమ పనితీరు గురించి అన్ని పార్టీలు తమ సొంత వాదనలను కలిగి ఉన్నాయి. హర్యానా ఎన్నికలలో పోటీ చేస్తున్న పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, జేజేపీ, ఇండియన్ నేషనల్ లోక్ దళ్ , బీఎస్పీ కూటమి. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్‌ల కూటమి ఇండియా బ్లాక్ కింద ఉండగా, హర్యానాలో మాత్రం రెండు పార్టీలు విడివిడిగా ఎన్నికల్లో పోటీ చేయడమే కీలకాంశం.

లోక్‌సభలో కాంగ్రెస్ ఖాతా తెరిచింది

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని కాంగ్రెస్ చెబుతోంది. లోక్‌సభలో వారి పనితీరు కాంగ్రెస్ వాదనకు కారణం. నిజానికి హర్యానాలో 2019 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన కాంగ్రెస్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 5 స్థానాలకు చేరుకుంది. కాంగ్రెస్ ఓట్ల శాతం 2019లో 28.51 శాతం నుంచి 43.67 శాతానికి పెరిగింది. అంటే సీట్లతో పాటు ఓట్ల శాతాన్ని పెంచుకోవడంలో కాంగ్రెస్ విజయం సాధించింది. సింపుల్‌గా అర్థం చేసుకుంటే, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు 50-50. అంటే బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల బాట అంత సులువు కాదు. అయితే, ఎన్నికల తేదీల ప్రకటనకు ముందు, ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ రైతులను సంతోషపెట్టడానికి అనేక పథకాలను ప్రకటించారు.

హర్యానా కుల సమీకరణం ఇలాంటిదే

హర్యానాలో కుల సమీకరణాన్ని పరిష్కరించడానికి, అన్ని పార్టీలు సామాజిక సూత్రాన్ని సిద్ధం చేశాయి. బీజేపీ దృష్టి మొత్తం జాట్‌యేతర ఓటర్లపైనే ఉన్నది. కానీ కాంగ్రెస్ దృష్టంతా జాట్ , దళిత ఓటర్లపై ఉంది.ఐఎన్ఎల్‌డీ, జేజేపీ ప్రభావం ప్రధానంగా జాట్ ఓటర్లకే పరిమితమైంది. హర్యానా కుల సమీకరణం జరగబోతోంది.

ప్రధాని మోడీ పర్యటనతో బీజేపీ మిషన్ షురూ..

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత జూన్ 4న నరేంద్ర మోడీ జమ్మూకాశ్మీర్ చేరుకున్నారు. ఇక్కడ యువతకు నియామక పత్రాలు పంపిణీ చేసి వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి రూ.1500 కోట్లతో 84 ప్రాజెక్టులు, రూ.1800 కోట్లతో ఇతర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అంటే ఇక్కడ నుంచే బీజేపీ మిషన్ ఎన్నికలు ప్రారంభమయ్యాయి.ప్రధాని పర్యటనలయ్యాకనే...కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించటం గమనార్హం.

పదేండ్ల తర్వాత జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు

జమ్మూకాశ్మీర్‌లో 2014 తర్వాత అంటే పదేండ్ల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో 24 స్థానాలకు సెప్టెంబర్ 18న, సెప్టెంబర్ 25న 25 స్థానాలకు, అక్టోబర్ 1న 40 స్థానాలకు మూడు దశల్లో ఓటింగ్ జరగనుండగా అక్టోబర్ 4న ఫలితాలు రానున్నాయి. కాగా ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా మారింది . డీలిమిటేషన్ తర్వాత సీట్లు కూడా పెరిగాయి. నిజానికి 2014లో జమ్మూ కాశ్మీర్‌లో 87 స్థానాలకు ఎన్నికలు జరగ్గా ఇప్పుడు ఆ సీట్లు 90కి పెరిగాయి. జమ్మూ ప్రాంతం గురించి మాట్లాడితే, ఇంతకుముందు 37 సీట్లు ఉంటే, ఇప్పుడు అది 43 సీట్లకు పెరిగాయి. కాశ్మీర్ ప్రాంతంలో గతంలో 46 సీట్లు ఉండగా, ఇప్పుడు అది 47 సీట్లకు పెరిగింది. గతంలో లడఖ్‌లోని 4 సీట్లు జమ్మూ కాశ్మీర్‌లో చేర్చబడ్డాయి, కానీ ఇప్పుడు లడఖ్ ప్రత్యేక కేంద్రంగా మారింది.

లోక్‌సభ ఎన్నికల ఆధారంగా జమ్మూ కాశ్మీర్‌లో ఎవరు ఎన్ని స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారంటే...

ఎన్డీయే 30 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, బీజేపీ-20, పీపుల్స్ కాన్ఫరెన్స్ 1 స్థానంలో, భారత కూటమి 46 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నాయి. ఇందులో నేషనల్ కాన్ఫరెన్స్ 34 స్థానాల్లో, కాంగ్రెస్ 7, పీడీపీ 5, ఇతరులు 14 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు.

ఇందులో స్వతంత్రులు 14 స్థానాల్లో ముందంజలో ఉన్నారు.

5 ఆగస్టు 2019న ఆర్టికల్ 370 , 35ఏ రద్దుతో జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా మారింది.ఆ తర్వాత నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ వంటి ప్రాంతీయ పార్టీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అయితే జమ్మూ కాశ్మీర్‌లో వాతావరణం చెడిపోకుండా చూసేందుకు మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాలను గృహనిర్బంధంలో ఉంచారు. జమ్మూ కాశ్మీర్‌లో ఇప్పుడు ఏం జరుగుతుందో ఎవరికి తెలియనంతగా పరిస్థితులు మారిపోయాయి. పైకి మాత్రం జమ్మూ కాశ్మీర్‌లో శాంతి నెలకొల్పినట్టు కేంద్రం ప్రకటించుకుంటున్నా..ఉగ్రవాదులు, ఆర్మీల మధ్య అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతూనే ఉన్నాయి.అయితే ఇటీవల తొలిసారి లోక్‌సభ ఎన్నికలు జరగ్గా, ఇప్పుడు మరోసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

హర్యానా ఎన్నికల్లో ఈ మూడు కీలక అంశాలు

హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో మూడు కీలక అంశాలు ముడిపడి ఉన్నాయి. వాటిపైనే కాంగ్రెస్ దాడి చేస్తోంది.ఈ దెబ్బకు బీజేపీ బ్యాక్‌ఫుట్‌లో ఉంది. మొదటి సమస్య కనీసమద్దతు ధర(ఎంఎస్‌పీ)పై రైతుల్లో అసంతృప్తి రగులుతోంది. రెండో అంశం అగ్నివీర్ పథకంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. మూడో అంశం మహిళా రెజ్లర్‌పై లైంగిక దోపిడీ కేసు. మూడు వ్యవసాయ చట్టాలు రద్దు చేసినప్పటికీ, హర్యానా, పంజాబ్‌లలో రైతులు ఇప్పటికీ ఎంఎస్‌పీ డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. చాలా నెలలుగా హర్యానా-పంజాబ్ సరిహద్దులో రైతులు నిరసనలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో రాహుల్ గాంధీని రైతు సంఘం కలిసింది.

ఎంఎస్‌పీపై రైతులకు చట్టపరమైన హామీ ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. కానీ పార్లమెంట్ సమావేశాలను మోడీ సర్కార్ ముగించింది.

ఇలాంటి పరిస్థితిలో.. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో రైతుల సమస్య పై చేయిగా మారింది.అయితే బీజేపీ తమ సోషల్ నెట్‌వర్క్‌లో ప్రతిపక్షాల కథనాన్ని ఎదుర్కొంటుంది. కుల సమీకరణాన్ని పరిష్కరించడానికి, బీజేపీ మనోహర్ లాల్ ఖట్టర్‌ను తొలగించి, నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. రాష్ట్ర అధ్యక్షుడి కుర్చీపై బ్రాహ్మణ ముఖాన్ని ఉంచి, జాట్ ఓటును చీల్చేందుకు, కాంగ్రెస్ రెబల్, హర్యానా మాజీ సీఎం బన్సీ లాల్ కోడలు కిరణ్ చౌదరిని పార్టీలో చేర్చుకున్నారు. ఇప్పుడు కిరణ్ చౌదరి ప్రవేశంతో జాట్ కమ్యూనిటీ ఆగ్రహాన్ని బీజేపీ తొలగించగలదా అనేది ప్రశ్న, ఎందుకంటే హర్యానాలో బీజేపీ దృష్టి మొత్తం జాట్-యేతర ఓటర్లపైనే ఉంది.



జమ్మూకాశ్మీర్‌లో ఆసక్తికరంగా ఎన్నికల పోరు

2015 మార్చిలో బీజేపీ-పీడీపీ కూటమిలో పీడీపీకి చెందిన ముఫ్తీ మహ్మద్ సయీద్ సీఎం కాగా, బీజేపీ అభ్యర్థి నిర్మల్ సింగ్ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. జమ్మూ కాశ్మీర్ సీఎం ముఫ్తీ మహ్మద్ సయీద్ 7 జనవరి 2016న మరణించారు. 2016 ఏప్రిల్ 4న బీజేపీ-పీడీపీ కూటమిలో పీడీపీకి చెందిన మెహబూబా ముఫ్తీ సీఎం అయ్యారు. 19 జూన్ 2018న పీడీపీ ప్రభుత్వానికి బీజేపీ మద్దతు ఉపసంహరించుకుంది. జమ్మూ కాశ్మీర్‌లో 20 జూన్ 2018న గవర్నర్ పాలన అమల్లోకి వచ్చింది . 2018 నవంబర్ 21న అసెంబ్లీని రద్దు చేశారు. ఆగస్టు 5, 2019 న, జమ్మూ, కాశ్మీర్ నుంచి ఆర్టికల్ 370ని మోడీ ప్రభుత్వం రద్దు చేసింది, జమ్మూ , కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా మారింది, లడఖ్ ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతంగా మారింది. డీలిమిటేషన్ తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో సీట్లు 87 నుంచి 90కి పెరిగాయి. జమ్మూకాశ్మీర్‌లో ఈసారి ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. ఐదేండ్ల వ్యవధిలో బీజేపీ దుందుడుకుగా వ్యవహరించింది. దీనికి ప్రతిగా కాశ్మీర్‌లోని ప్రాంతీయ పార్టీలు కూడా ఎన్నికలలో బీజేపీ ప్రతీకారం తీర్చుకోవాలని తహతహలాడుతున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా ఈ ప్రాంతీయ పార్టీలతో కాంగ్రెస్ నిలబడటం చూడవచ్చు. జమ్మూకాశ్మీర్‌కు సీఎం కావడానికి తాను కూడా సిద్ధమేనని ఫరూక్ అబ్దుల్లా అంటున్నారు.

వాయనాడ్‌కు బొండాడ గ్రూపు సాయం



హైదరాబాద్ : వాయనాడ్ ప్రకృతి వైపరీత్య బాధితులకు అపన్నహస్తం అందించినట్టు బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ (బిఇఎల్) ఓ ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం కేరళ చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్‌కు రూ.25,00,000 ఇచ్చింది. ఈ చెక్కును కేరళ సీఎం పినరయి విజయన్‌కు బిఇఎల్ సిఎండి రాఘవేంద్రరావు అందించారు. ఈ మొత్తంతో వాయనాడ్ ప్రకృతి బాధితులకు కొంతనైనా సాయంగా ఉంటుందని భావించి ముందుకు వచ్చామన్నారు.

పోస్ట్ చేసే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలి

- కేటీఆర్ ట్వీట్‌పై మంత్రి దామోదర రాజనర్సింహ స్పందన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సామాజిక మాధ్యమాల్లో ఏదైనా పోస్ట్ చేసే ముందు దానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. అంతకు ముందు కేటీఆర్, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలిస్తున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటున్నదంతా అబద్ధమని ట్వీట్ చేశారు. సూర్యాపేట ప్రభుత్వాస్పత్రి ఉద్యోగి వసీం ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇందుకు బదులుగా మంత్రి దామోదర రాజనర్సింహ రీట్వీట్ చేస్తూ, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్న ఘటనను రాజకీయాలకు వాడుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వసీంకు బకాయిలో ఉన్న ఒక నెల వేతనం చెల్లించడానికి ప్రాసెస్‌లో ఉందని తెలిపారు.

రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాసరెడ్డి, కాలే యాదయ్య తదితరులు కూడా సమావేశానికి వచ్చారు. ఈ సమావేశంలో చేసిన నిర్ణయం మేరకు రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ సోమవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోసహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్దఎత్తున హాజరవుతారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని ప్రతిపాదించిన వెంటనే ఆమోదించినందుకు అధిష్టానానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టం అమలులో అనేక రాజ్యాంగ, న్యాయపరమైన చిక్కులు, అవాంతరాలు ఉత్పన్నమయ్యాయని చెప్పారు. 2014 పునర్విభజన చట్టాన్ని పదేండ్లపాటు కేంద్రం అమలు చేయలేదని విమర్శించారు.

రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలపై, చట్టసభలతోపాటు సుప్రీంకోర్టులో బలంగా వాదన వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే రాజ్యాంగ, న్యాయ కోవిదుడు అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని అధిష్టానాన్ని కోరినట్టు తెలిపారు. అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో, న్యాయస్థానాల్లో ఆయన బలంగా వాదిస్తారని గుర్తు చేశారు. మాజీ ఎంపీ కేకే పెద్ద మనసుతో క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించారని తెలిపారు. కేకే రాజీనామాతో ఈ ఉప ఎన్నిక వచ్చిన సంగతి తెలిసిందే. తనను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించినందుకు ఏఐసీసీ పెద్దలకు అభిషేక్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తాను మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కుల విషయంలో తాను మాట్లాడుతూనే ఉంటానన్నారు.

అభిషేక్‌కు ఘనంగా స్వాగతం

రాజ్యసభ అభ్యర్థి హోదాలో అభిషేక్ మను సింఘ్వీ ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి మాజీ ఎంపీ కే కేశవరావు నివాసానికి వెళ్లారు. ఆయన్ను కేకే సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత ఆయన జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సాయంత్రం జరిగే శాసనసభాపక్ష సమావేశంలో తన రాజ్యసభ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. రేవంత్ దంపతులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఆయన భేటీ అయ్యారు.

త్వరలోనే రైతు కృతజ్ఞత సభ : సీఎం

రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ ఈనెల 20 అనుకున్నప్పటికీ ఆ తేదీలోఅగ్రనేతలకు వీలు కావడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రైతు కృతజ్ఞత సభ, రాజీవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంపై త్వరలో ఢిల్లీ పెద్దలతో మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం

- మంచిర్యాల ఏసీపీ కార్యాలయంలో ఘటన


నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీ 21వ వార్డ్ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు బేర సత్యనారాయణ ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. భూవివాదంలో ఆదివారం ఏసీపీ కార్యాలయానికి వచ్చిన సత్యనారాయణ కత్తితో గొంతు కోసుకున్నారు. గాయపడ్డ ఆయనను పోలీసులు పట్టణంలోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్‌లో సత్యనారాయణ మాట్లాడుతూ.. రాజకీయంగా తనను అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే పోలీసుల సాయంతో తనపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో తన కూతురు ఇంట్లో ఉండగా అక్కడి నుండి పోలీసులు మంచిర్యాలకు తీసుకొచ్చారని తెలిపారు.

సామాన్య కార్యకర్త నుంచి ఎదిగిన తనను రాజకీయంగా అణగదొక్కేందుకు పోలీసులు, ఎమ్మెల్యే కలిసి ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించాడు. అనంతరం ఆయనను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేర సత్యనారాయణపై అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణకు రావాల్సిందిగా కోరామని ఏసీపీ ఆర్.ప్రకాష్ తెలిపారు. ఆదివారం ఉదయం కార్యాలయానికి వచ్చి ఇంతలోనే ఇలా చేశారని తెలిపారు.

పిడుగుపాటుకు రైతు మృతి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందిన సంఘటన కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కొమురయ్య, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిడం శ్రీనివాస్ (46) అనే రైతు తన పొలంలో వరినట్లు వేయడానికి వెళ్ళాడు. సాయంత్రం భారీ వర్షం కురిసింది. అయినా వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కొమురయ్య సంఘటన స్థలాన్ని పరిశీలిం చారు. మృతునికి భార్య కాంతా, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం

బెంగాల్ ప్రభుత్వం నిందితులను రక్షించే చర్యలు దారుణం

- సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలి
- నిందితులను కఠినంగా శిక్షించాలి : సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు





నవతెలంగాణ-విలేకరులు

కోల్‌కతా నగరంలో ట్రైనీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసనలు వెల్లువెత్తాయి. కొవ్వొత్తుల ర్యాలీలు, కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయం సుందరయ్య భవనం నుంచి నిర్మల్ హృదయ్ హైస్కూల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కోల్‌కతా నగరంలో ట్రైనీ డాక్టర్‌పై సభ్య సమాజం తలదించుకొనే విధంగా లైంగికదాడి చేసి అనంతరం అతి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసును ఆత్మహత్యగా చిత్రీకరించి ఘటనకు పాల్పడిన నిందితులను కాపాడటానికి ఆనవాళ్ళు లేకుండా చేయడానికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేయకుండా సాక్ష్యాలను రూపుమాపేందుకు పూనుకుంటుందన్నారు. న్యాయం కోసం ఆందోళన చేస్తున్న వారిపై, ఆస్పత్రిపై టీఎంసీ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు ప్రవర్తిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ ఇష్టానుసారంగా ప్రయివేటు మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇస్తూ భద్రతను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.



తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీలు, హాస్పిటల్స్‌లో మహిళా డాక్టర్లు, నర్సులు, ఇతర మహిళా సిబ్బందికి భద్రత కల్పించాలని కోరారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇల్లందు మండలంలో ఐద్వా మండల కార్యదర్శి ఆలేటి సంధ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. నింధితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం రూరల్‌లో ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతలక్ష్మి, సీనియర్ నాయకులు నాదెళ్ల లీలావతి మాట్లాడారు. దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షులు పూజల లక్ష్మి పట్టణంలోని ఏఎంసీ కాలనీలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దుమ్ముగూడెం మండలంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా మాజీ చైర్మెన్ కనుబుద్ది దేవా ఆధ్వర్యంలో లక్ష్మీనగరం సెంటర్‌లో బాధితురాలి చిత్రపటానికి నివాళులు అర్పించి, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, మహిళా రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు చెప్పాల బాలమణి మాట్లాడుతూ.. మహిళా ముఖ్యమంత్రి ఉన్న చోట మహిళలకు రక్షణ కరువవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు పెర్క అంజి, ఉపాధ్యక్షులు బత్తుల అభిషేక్, భాను, నవ నవదీప్, చిక్కి, పండు తదితరులు పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు.

యాదగిరిగుట్ట పట్టణంలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద సీపీఐ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజపేట మండలంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని మీనా ఇంజనీరింగ్, నర్సింగ్ కాలేజ్ వద్ద విద్యార్థులతో కలిసి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ.. మహిళల రక్షణకు ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించి 30 రోజుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రజకులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి

- గ్రామా అభివృద్ధి కమిటీ పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి : తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో 8 నెలల నుంచి రజకులపై కొనసాగుతున్న సాంఘిక బహిష్కరణను వెంటనే ఎత్తివేసి, బహిష్కరణకు పాల్పడిన పెత్తందారులను అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో బహిష్కరణకు గురైన బాధితులను కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రజకుల అసైన్‌మెంట్ భూమిని కబ్జా చేయాలని పెత్తందారులు ప్రయత్నించడాన్ని రజకులు వ్యతిరేకించినందుకు సాంఘిక బహిష్కరణ చేసినట్టు.. రజక మహిళలు, యువకులు ఆశయ్య దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో బహిష్కరణకు సంబంధించిన కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో రజకులకు, పసిపిల్లలకు పాలు పోయనీయడం లేదని, కిరాయి ఆటోలు ఎక్కనీయడం లేదని తెలిపారు. కూలీ పనులకు పిలవడం లేదని, రజకుల వ్యవసాయ భూములకు ట్రాక్టర్లను కూడా రానీయడం లేదని, రజకులను ఎవరైనా పనులకు పిలిచినా, సహాయం చేసినా రూ.10వేల జరిమానా విధిస్తామని గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో పెత్తందార్లు హుకుం జారీ చేశారని వివరించారు. బహిష్కరణ చేసి 8 నెలలు గడిచినా.. స్థానిక అధికార యంత్రాంగం పట్టనట్టు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీస్, రెవెన్యూ యంత్రాంగం రజకులకు తగిన రక్షణ కల్పించి సాంఘిక బహిష్కరణను ఎత్తివేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజక ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు గోపనపల్లి శంకర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, రజక ఐక్యవేదిక జిల్లా సాంస్కృతిక కన్వీనర్ జగడం పోషన్న, జక్రాన్‌పల్లి గ్రామ అధ్యక్షులు జగడం భూషన్, చిక్కాల శ్రావణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు జగడం సురేష్, గ్రామ కమిటీ సభ్యులు జగడం మోహన్, జగడం అభిమన్య, పవన్, పద్మ, శ్యామల, చిన్నుబాయి తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా బస్తీ దవాఖానాలు

- రెగ్యులర్ పోస్టులు రావడంతో పలువురు డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్ల రాజీనామాలు
- సిబ్బంది కొరతతో సేవల కుదింపు
- ఉన్నవారికి నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చిన్న చిన్న రోగాలు వస్తే ప్రాథమిక దశలో పేదలకు వైద్యమందించేందుకు బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌లను స్ఫూర్తిగా తీసుకుని తొలుత హైదరాబాద్, ఆ తర్వాత జీహెచ్ఎంసీ పరిధికి విస్తరించారు. వాటికి మంచి స్పందన లభించడం, పేద రోగులకు సేవలందడం, పెద్దాస్పత్రులపై చిన్న చిన్న రోగాల బారిన పడిన వారి రద్దీ తగ్గడం, బోధనాస్పత్రుల్లో వైద్యులు సంక్లిష్ట కేసులపై శ్రద్ధ చూపించేందుకు సానుకూలత ఏర్పడటం వంటి విజయాలు బస్తీ దవాఖానాల ఏర్పాటు తర్వాత గమనించారు. పరిమిత సంఖ్యలో ప్రారంభమైన బస్తీ దవాఖానాల సంఖ్య క్రమేణా పెంచుతూ దాదాపు 500 వరకు విస్తరించారు. ఒక బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్స్‌తో పాటు సపోర్టింగ్ స్టాఫ్‌ను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించి సేవలందించారు. ఇటీవల స్టాఫ్ నర్సులకు రెగ్యులర్ పోస్టింగ్ అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో దాదాపు 90 మంది స్టాఫ్ నర్సులు బస్తీ దవాఖానాల్లో సేవలకు రాజీనామా చేసి వెళ్లిపోయారు. అదే విధంగా రెగ్యులర్ పోస్టులు వచ్చిన డాక్టర్లతో పాటు వివిధ కారణాలతో రాజీనామాలు చేసిన వారు దాదాపు 50 మంది వరకున్నట్టు సమాచారం. వీరు వెళ్లిపోయిన తర్వాత ఆ స్థానాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయకపోవడంతో పలు బస్తీ దవాఖానాలు సేవల విషయంలో నామమాత్రంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. డాక్టరు ఉన్న చోట స్టాఫ్ నర్సు లేరు. స్టాఫ్ నర్సు ఉన్న చోట డాక్టర్ లేరు. ఇలా వీటి పరిస్థితి తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్తీ దవాఖానాల్లో ఖాళీల భర్తీని వెంటనే చేపట్టకపోవడంతో సిబ్బంది కొరత వెక్కిరిస్తున్నది. దీంతో పర్యవేక్షణాధికారులు ఇలాంటి ఇబ్బందులున్న బస్తీ దవాఖానాల విషయంలో ఒక్కో స్టాఫ్ నర్సుకు, డాక్టర్‌కు రెండేసి బస్తీ దవాఖానాల బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తున్నది. గతంలో రెగ్యులర్ టెస్టులు, డాక్టర్ కన్సల్టేషన్ అందుబాటులో ఉన్న బస్తీ దవాఖానాల్లో సైతం, రెగ్యులర్‌గా కాకుండా సర్దుబాటు సమయాల్లో మాత్రమే ఆయా సేవలు అందిస్తున్నారు. మరీ ఇబ్బందిగా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా ఆస్పత్రులకు వెళ్లాలని ప్రజలకు సూచిస్తున్నారు. దీంతో బస్తీ దవాఖానాల ఏర్పాటు మౌలిక లక్ష్యమే దెబ్బతింటున్నదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీ అయిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచిస్తున్నారు. దీనికి తోడు ఉన్న సిబ్బందికీ గత నాలుగు నెలల నుంచి జీతాలు పెండింగ్‌లో ఉండటంతో వారిలో నైరాశ్యం నెలకొంది. పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం ఉండటం లేదని వాపోతున్నారు. ఆ జీతాలను వెంటనే విడుదల చేసి, ఖాళీలను భర్తీ చేస్తే బస్తీ దవాఖానాల ఏర్పాటు ఉద్దేశం నెరవేరుతుంది.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన 'ఈవో'

నవతెలంగాణ-కొత్తగూడ



దేవాలయ ఆవరణలో సామగ్రి, పూజా సామగ్రి విక్రయిస్తున్న యజమాని నుంచి దేవాలయ ఈవో రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో ఆదివారం చోటు చేసుకుంది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ దేవాలయంలో ఈవోగా విధులు నిర్వహిస్తున్న బిక్షమాచారి దేవాలయ ఆవరణలో పూజా సామగ్రి విక్రయిస్తున్న దుకాణ యజమాని సాంబయ్యను మూడు సంవత్సరాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ప్రతి ఏడాది డబ్బులు వసూలు చేస్తుండటమే కాకుండా కొద్ది రోజులుగా డబ్బులు ఇవ్వాలని, లేదంటే దుకాణం తీసేయాలని బెదిరించసాగాడు. దాంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆదివారం దేవాలయంలోని కౌంటర్ వద్ద బిక్షమాచారికి రూ.20వేలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఎస్ఐ శ్యాంసుందర్ రాజు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో రాజకీయాల్లో రాణించాలి

- ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం నెలకొల్పాలి
- జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలి :

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ



నవతెలంగాణ-ముషీరాబాద్

సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో రాజకీయాల్లో రాణించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ అన్నారు. తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం, కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ విగ్రహానికి కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మెన్ బాలగోని బాలరాజు గౌడ్.. తాటి, ఈత కమ్మల దండ వేశారు. అనంతరం ఎంవీ రమణ మాట్లాడుతూ.. జమీందారులు, జాగీర్దారుల అరాచ కాలను సహించలేక కల్లు గీసే కత్తిని పక్కకు పెట్టి ఖడ్గం చేతబట్టి మొగలుల ఆధిపత్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటను జయించిన మొనగాడు సర్దార్ సర్వాయి పాపన్న అని అన్నారు. ప్రతి ఏడాది లాగానే కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న 'అమరుల యాదిలో..' కార్యక్రమం ద్వారా హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని యాది చేసుకుంటున్నామని చెప్పారు. గౌడుల ఆరాధ్యుడు కాటమయ్య స్ఫూర్తితో వన సంరక్షణ చేపట్టాలని, పాపన్న స్ఫూర్తితో రాజకీయాల్లో రాణించాలని పిలుపుని చ్చారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా కుల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని తెలిపారు. ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం నెలకొల్పాలని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. స్కైలాబ్ బాబు, జీఎంపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్, కేజీకేఎస్ హైదరాబాద్ కన్వీనర్ ఎం.కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో ఆరుగురికి పునర్జన్మ

పుట్టెడు దుఖంలోనూ మాతృమూర్తి ఔదార్యం..



నవతెలంగాణ - గంభీరావుపేట

రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన కుమారుడిని చూసి పుట్టెడు దుఖంలో ఉన్న ఆ మాతృమూర్తి తీసుకున్న నిర్ణయం మరో ఆరుగురికి పునర్జన్మనిచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ద్యానబోయిన నర్సింలు- దేవలక్ష్మికి కుమారడు ద్యానబోయిన నరేష్ (27), కూతురు నవిత ఉన్నారు. ద్యానబోయిన నర్సింలు రెండేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పులు తీర్చడానికి, కుటుంబానికి అండగా నిలబడడానికి నరేష్ గల్ఫ్ దేశం వెళ్లి వచ్చి సోదరి పెండ్లి చేశాడు. ఐదు నెలల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. గత మంగళవారం లింగన్నపేట గ్రామంలో నరేష్ బంధువులు చనిపోగా వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మండల కేంద్రంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో నరేష్ తలకు తీవ్ర గాయమైంది. చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బ్రెయిన్ డెడ్ అయినట్టు తెలిపారు. ఈ క్రమంలో అవయవ దానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. దాంతో కొడుకు దక్కడనే బాధను దిగమింగుకుని మరో ఆరుగురికి పునర్జన్మ ఇచ్చేందుకు తల్లి ముందుకువచ్చింది. అవయవదానానికి తల్లి సుముఖత చూపడంతో రెండు మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె తీసి జీవన్ దాన్ ద్వారా భద్రపరిచారు. నరేష్ భౌతికంగా లేకున్నా అవయవాల వితరణతో మరో ఆరుగురికి అవయవ దానం చేయడం పట్ల నరేష్ మాతృమూర్తిని పలువురు అభినందించారు. భర్త నర్సింలు, కొడుకు నరేష్ ఇద్దరూ మృతిచెందడంతో కుటుంబం దిక్కులేని స్థితిలో పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం.. ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గోల్కొండకోటను ఏలిన బీసీ బిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న

- బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఖిలాషాపూర్ కోట మొదలు గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని ఏలిన బీసీ బిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న అని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న 374 జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నప్పుడే తండ్రి చనిపోయినా తనకంటూ ఒక లక్ష్యం పెట్టుకుని నిజాం అరాచకాలకు, కులవృత్తులపై వేసే పన్నులకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు అని ప్రశంసించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలంతా పాపన్న ఆశయాలను సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, ఉపాధ్యక్షులు సంజయ్ గణతే, మాజీ మేయర్ సుభాష్ చందర్‌జీ, భరత్ గౌడ్, గీత సెల్ కన్వీనర్ పటేల్ వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ పార్క్ హెూటల్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం వేడుకలను సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని గ్రీన్ పార్క్ హెూటల్‌లో జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొననున్నారు. రాష్ట్ర మీడియా అకాడమీ అధ్యక్షులు కె. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు, ముఖ్యమంత్రి కార్యాలయం సీపీఆర్వో అయోధ్య రెడ్డి, పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ విభాగంలో విశేష సేవలు అందించిన పలువురు ఫోటోగ్రాఫర్లకు అవార్డులను అందజేయడంతో పాటు సన్మానించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

గవర్నర్‌కు రాఖీ కట్టిన కార్పొరేటర్ చింతల అరుణ



నవతెలంగాణ - నాగోల్

మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో ఆదివారం నాగోలు శిల్పారామంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్... రాష్ట్ర గవర్నర్ జిష్టు దేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు రాఖీని కట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్నా చెల్లెల అనుబంధానికి ఈ రాఖీ పండుగ గుర్తు అని అన్నారు. నేటి యువతరం మన దేశ సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించాలని కోరారు.

సీఐ సత్యనారాయణకు ఘన సన్మానం



నవతెలంగాణ - చంపాపేట్

సంతోష్‌నగర్ సీఐ కోలా సత్యనారాయణ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను చంద్రాయణ గుట్ట నియోజకవర్గం కంచన్ భాగ్ డివిజన్ అధ్యక్షులు షేక్ మహమ్మద్ ఫజల్ ఆదివారం స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీఐని కలిసిన వారిలో పలువురు సభ్యులు తదితరులు ఉన్నారు.

కాసువాగు రైతులకు అండగా ఉంటా

- డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని కాసువాగు రైతులకు న్యాయం జరిగే వరకూ తాను అండగా ఉంటానని డిప్యూటీ సీఎం సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... ఈ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. తప్పకుండా అన్నదాతలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని.. పోరాటం చేద్దామని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ హయాంలో ఇచ్చిన భూములను మళ్లీ ఇందిరమ్మ రాజ్యంలో



భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని కాసువాగు రైతులు ఆదివారం డిప్యూటీ సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నాయకులు ఆనంద్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, నాదర్ గుల్ కాసువాగు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల

ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం

నవతెలంగాణ - చంపాపేట్

కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ దాతల సహకారంతో నేడు నిర్వహించే పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి యన్. లావణ్య ఆదివారం దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కలిసి మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ ధర్మకర్తలు మేక సురేందర్ రెడ్డి, చాతిరి మధుసూదన్ సాగర్, గూడూరు మధుసూదన్ రెడ్డి, బిల్లకంటి కిరణ్ కుమార్, మేకల యాదగిరి, బబ్బూరి ఆనంద్ కుమార్ గౌడ్, సాంబరాజు శైలజ ఆలయ



ఆహ్వానించారు. ఈ మేరకు సచివాలయములోని మంత్రి కార్యాలయంలో ఆమెను ఆలయ చైర్మెన్ నల్ల రఘుమారెడ్డి, ధర్మకర్తలు, ఆలయ వేద పండితులతో వేద పండితులు ఆర్ చంద్రకాంత్ శర్మ, సి.హెచ్. ముత్యాల శర్మ, అర్చకుడు శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్య వైశ్యులకు అండగా ఉంటా : ఉప్పల



నవతెలంగాణ -నాగోల్

ఆలయ నిర్మాణాలకు విరాళాలను అందించడమే కాకుండా రాష్ట్రంలోని ఆర్య వైశ్యలకు అండగా ఉంటానని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. నగరంలోని పురాన పూల్ ఆర్య వైశ్య భవనం నిర్మాణానికి తన వంతుగా చారిటబుల్ ట్రస్ట్‌కు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఆర్యవైశ్యులలో ఉన్న పేదలకు కూడా అన్ని కులాల మాదిరిగా ప్రభుత్వం అందించే పథకాలను అందించి, వారికి అన్నివేళలా వెన్నంటి ఉంటామని భరోసా ఇచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సదానంద గుప్త, యాడ శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

'జూనియర్ డాక్టర్‌పై

లైంగికదాడి హేయమైన చర్య'



నవతెలంగాణ - హస్తినాపురం

కోల్‌కత్తాలో మెడికల్ కాలేజీ విద్యార్థిని, జూనియర్ డాక్టర్ లైంగికదాడికి గురికావడం హేయమైన చర్య అని వెల్ నెస్ హాస్పిటల్ యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాధితురాలికి మద్దతుగా వెల్ నెస్ హాస్పటల్ యాజమాన్యం సిబ్బంది ఆధ్వర్యంలో హస్తినాపురం సెంట్రల్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని బెంగాల్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మెడికల్ విద్యార్థుల కోసం కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ప్రతి పాదనలు తీసుకొచ్చి, వాటిని పారదర్శకంగా అమలుచేయాలని వెల్ నెస్ వైద్య సిబ్బంది బృందం, యాజమాన్యం కోరారు.



సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు





నవతెలంగాణ - మీర్ పేట్

సర్దార్ పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ఉన్న సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మేయర్ డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి గౌడ్ ఆధ్వర్యంలో ...



నవతెలంగాణ - వనస్థలిపురం



వనస్థలిపురం డివిజన్ పరిధిలోని వనస్థలిపురం సీనియర్ సిటిజన్స్ భవనంలో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డిలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన ప్రజారాజ్య స్థాపకుడు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, దొరల అరాచకాలను, మొగలాయిల దౌర్జన్యాలను ఎదురించిన ధైర్యశాలి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో వనస్థలిపురం బీజేపీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం డివిజన్‌లో కాంటం క్రాంతి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలకు కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వందల ఏండ్ల క్రితమే నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి సామాజిక న్యాయమే ధ్యేయంగా అసువులు బాసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు బహుజనులంతా కంకణం కట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ వెంకన్న, సాయి కిరణ్, ఓబీసీ మధు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హయత్ నగర్

మన్సూరాబాద్ డివిజన్‌లోని హయత్‌నగర్ పరిధిలో గల షిర్డీసాయినగర్ (వీరన్నగుట్ట)లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను ఆదివారం వీరన్నగుట్ట గౌడ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులుసు రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షిర్డీసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ కంబాలపల్లి నర్సింహ యాదవ్, ప్రధాన కార్యదర్శి శాగంటి కోటయ్య మాజీ అధ్యక్షులు కె.కె.యల్.గౌడ్, చామకూర జంగయ్యగౌడ్, వీరన్నగుట్ట గౌడ కుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గట్టు నిరంజన్‌గౌడ్, కోశాధికారి కాసుల బాల్‌రాజ్ గౌడ్, మస్తాన్‌గౌడ్, యాదగిరిగౌడ్, అంతటి భిక్షపతిగౌడ్, కాసుల గణేష్ గౌడ్, రామాంజనేయులు గౌడ్, సైదులు గౌడ్, ప్రసాద్ గౌడ్, సురేష్ గౌడ్, సంతోష్ చారి, బాలాజీ, రాజు, నగేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- ఎల్బీనగర్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి, రాజకీయ-సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తిగా సర్వాయి పాపన్న చరిత్ర అసామాన్యమైనదని అని అన్నారు. సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తితో ప్రజాప్రభుత్వం వారి ఆశయాలను కొనసాగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మహేందర్ యాదవ్, రాష్ట్ర యువజన నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్, గౌడ సంఘం సెక్రెటరీ కందికంటి శ్రీధర్ గౌడ్, రాజు గౌడ్, జంగారెడ్డి, విజయ్, కళ్యాణ్ యాదవ్, నబీ కుమార్, సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హస్తినాపురం

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేష్ గుప్తా నగర్ నందనవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గొప్పగాని యాదయ్య గౌడ్, ఎరుకల మల్లేష్ గౌడ్, ముద్దగోని రాములు గౌడ్, ముద్దగోని వెంకటేష్ గౌడ్, ఎరుకల శేఖర్, రాజు గౌడ్, ప్రమోద్ గౌడ్, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంస్కృతి

సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు



- కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి

నవతెలంగాణ - చంపాపేట్

సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు అని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. యకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ చింతల్ బస్తీ పరిధిలో ఆదివారం అత్యంత వైభవంగా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కుటుంబ సమేతంగా అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం కార్పొరేటర్ మన సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే విధంగా సీఎం రేవంత్ రెడ్డి బోనాల పండుగను అధికారికంగా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. తర్వాత బోనాల సంస్కృతి తొట్టెల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణ, శేఖర్, మహేష్, యాదయ్య, రవి, వెంకటేష్, వినోద్, నాగరాజ్, సంతోష్, చిన్న, రాము, శివ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి గుర్తు రాఖీ

- రాక్ టౌన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినోద్ రెడ్డి



నవతెలంగాణ- నాగోల్

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి గుర్తు ఈ రాఖీ పండుగ అని నాగోల్ డివిజన్ రాక్ టౌన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినోద్ రెడ్డి అన్నారు. ఆదివారం రాక్ టౌన్ కాలనీ మెయిన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో రాఖీ పండుగ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్షాబంధన్ ప్రాముఖ్యతను తెలియజేశారు. తర్వాత విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రాక్ టౌన్ కాలనీ ప్రెసిడెంట్ వినోద్ రెడ్డి, కాలనీ సభ్యులు రాంచంద్రా రెడ్డి, సంపత్ కుమార్, సంజీవ రెడ్డి, రామోజీ రావు, సుదర్శన్ చారీ, ప్రభుత్వ ఉన్నత, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అల్మాస్ గూడలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్ గూడ గ్రామంలో గిరిజనులు తీజ్ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు ప్రత్యేక పండుగగా తీజ్ ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుకోవటం జరుగుతుందని తెలిపారు. పూర్వ కాలం నుండి గిరిజన యువతులు, మహిళలు ఆనవాయితీగా ఈ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన వివిధ కాలనీల ప్రజలు యువతీ యువకులు మహిళలు పాల్గొన్నారు.





సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రభుత్వం నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రంగ ప్రదీప్ గౌడ్ పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం లోని రాంనగర్ డివిజన్, భోలక్‌పూర్ డివిజన్, కవాడిగూడ డివిజన్‌కి చెందిన లబ్దిదారులు దరఖాస్తు చేసు కున్న సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బోలక్పూర్ డివిజన్ ప్రెసిడెంట్ వై శ్రీనివాస్, వల్లాల శ్యామ్ యాదవ్, శంకర్ ముదిరాజ్, మొహమ్మద్ అలీ, రహీం, కిషన్ రావు, శంకర్ గౌడ్, మీడియా ఇన్చార్జ్ ముచ్చ కుర్తి ప్రభాకర్, శివ యాదవ్, వల్లల రవి యాదవ్, ప్రవీణ్ ముదిరాజ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో నూత నంగా ఏర్పాటు చేసిన డాక్టర్ శంకర్ పీపుల్స్ ఆస్పత్రిని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ ఆస్పతి ప్రారంభోత్సవంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, హాస్పిటల్ ఎండి.డాక్టర్ శంకర్ హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద ప్రజలకు అతి తక్కువ ధరలు నాణ్యమైన వైద్యం అందించడమే శంకర్ పీపుల్స్ ఆస్పత్రి యొక్క ప్రత్యేకత అన్నారు. అత్యాధునిక సదు పాయాలతో పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఈ ఆస్పత్రిని ప్రారంభించిన వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ల యొక్క ప్రేమ అనురాగాలతో కూడిన పలకరింపుతో రోగికి సగం జబ్బు న్యాయమవుతుందని చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి రోగికి ఆప్యాయతతో వైద్యం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తూ వైద్యానికి పెద్దపీట వేస్తుంద న్నారు. ఆస్పత్రి ఎండి.డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. ఈ ఆస్పత్రిని వ్యాపార దృక్పథంతో కాకుండా ప్రజలకు సేవ చేయాలనే ఒకే ఒక లక్ష్యంతో ప్రారంభించామని తెలిపారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చి సిటీలో ఆస్పత్రి నిర్మించి ప్రజలకు తక్కువ ధరకే వైద్యం అందించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. తమ ఆసుపత్రి ద్వారా లక్షలాది మందికి సర్జరీలు చేశామని తెలిపారు. అతి తక్కువ ధరలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రాజారామ్, డాక్టర్ అశ్విన్ కుమార్, చింతల భాస్కర్, సిహెచ్ నారాయణ ,సిహెచ్ రామకృష్ణ, లక్ష్మి డాక్టర్ అర్చన, డాక్టర్ తేజ, యువ నాయకులు ముఠా జై సింహ, మీడియా ఇన్‌చార్జి మచ్చకుర్తి ప్రభాకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

బడుగుల సమానత్వం కోసం పోరాడిన వ్యక్తి 'పాపన్న'

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారికి సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్దార్ పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ బడుగులను ఐక్యం చేయడంతో పాటు ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని గోల్కొండ కోటను జయించిన పాపన్న నేటి తరానికి ఆదర్శమన్నారు. బడుగు బలహీనవర్గాల ఐక్యత, సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.ఆశన్న, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి పెరిక యాద య్య జిల్లా వికలాంగుల అభివృద్ధి అధికారి రాజేందర్, వయోజన విద్య ఉపసంచాలకులు జయ శంకర్, నరసింహులు, సంజీవులు, నీరజ రెడ్డి కృష్ణమాచారి, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

లైంగిక దాడి నిందితుడిని శిక్షించాలి

- సీఐటీయు మహిళా సంఘం కమిటీ నాయకులు



నవతెలంగాణ-ముషీరాబాద్

పశ్చిమ బెంగాల్లో వైద్య విద్యార్థి పై అత్యంత దారుణంగా లైంగిక దాడి.. హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించి ఉరిశిక్ష విధించాలని సీఐటీయు మహిళా సంఘం కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం, భోలక్ పూర్ డివిజన్ సీఐటీయు మహిళా సంఘాల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనిషి ప్రాణాలు కాపాడే వైద్యురాలకే రక్షణ కరువైతే సమాజంలో మనుగడ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మహిళలపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నా యని వాటిని అరికట్టాలంటే నిందితులను కఠినంగా శిక్షించి బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చమ్మ ,లక్ష్మి, రాములమ్మ, అలివేలు, నాగమణి, ఈశ్వరమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్స్ మ్యూజియంలో ఆకట్టుకుంటున్న రాఖీ ఆకారంలో కారు



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ బహదూర్‌పూర సుధాకర్స్ మ్యూజియంలో రాఖీ ఆకారం లో కారు సందర్శకులను ఆకట్టుకుంటుంది. రక్షాబంధన్‌ను పురస్కరిం చుకొని సుధాకర్స్ మ్యూజియం యజమాని విన్నూతమైన కార్ల సృష్టికర్త సుధాకర్ రాఖీ ఆకారంలో కారును ఆవిష్కరించారు. సుధాకర్స్ మ్యూ జియంలో ఆ కారులో దూసుకుపోతూ చూపరులను ఆకట్టుకుంటుంది. రాఖీ ఆకారంలో ఉన్నటువంటి కారు వివరాలను ఆదివారం మీడియా కు వెల్లడించారు. 50 సీసీ ఇంజన్ కలిగిన ఈ కారు లో ఒక్కరే కూర్చుని ప్రయాణించ వచ్చన్నారు. రాఖీ బంధన్ ఆకారంలో ఉన్నటువంటి కారు ను తయారు చేసేందుకు మూ డు నెలల సమయం పట్టిందని ఇది గంటకు 25 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందన్నారు. సుధాకర్స్ మ్యూజియంలో ఎన్నో రకాల కార్లు ఉన్నాయని, అలాగే వరల్డ్ కప్ బ్యాట్లు ఇతర వస్తువుల పండుగల వస్తువుల యొక్క కార్లు కూడా ఉన్నాయని తెలిపారు.

అపోహలతో దంపతులు సంసారాలను విచ్ఛిన్నం చేసుకోవద్దు

- సౌత్, వెస్ట్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసరావు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

దంపతులు మనస్పర్థాలతో, చిన్నపా టి అపోహలతో సంసారాలను విచ్ఛిన్నం చేసుకోవద్దని సౌత్, వెస్ట్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. షాయినాథ్ గంజ్ లోని సౌత్, వెస్ట్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దంపతులు తగాదా పడి వచ్చినప్పుడు వారికి సర్ది చెప్పి రాజీ కుదర్చడమే ప్రథమ కర్తవంగా కృషి చేస్తున్నామ న్నారు. చాలా కుటుంబాలలో దంపతుల నడుమ తలెత్తిన చిన్న పాటి మనస్పర్థలు, అపోహలు చిలికిచిలికి గాలివానగా మారి పోలీస్ స్టేషన్‌కు వస్తున్నారని తెలిపారు. భార్యభర్తలు కూడా అపోహలు అనుమానాలతో వస్తున్నారని వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నామ న్నారు. ఇంటిలో భర్త కూడా కుటుంబ బాధ్యత తీసుకొని బాధ్యతగా మెలగా లని సూచిస్తున్నామన్నారు. స్త్రీలు కూడా కుటుంబం పట్ల గౌరవ మర్యాదలు పాటిస్తూ అత్తమామల పట్ల ప్రేమగా ఉండడంవల్ల కుటుంబంలో తగాదాలు రావని సూచించారు. భార్యా భర్తలు చిన్నచిన్న విషయాలకే పిల్లల ముందు గొడవ పడడం వల్ల వారు మానసిక ఒత్తిడికి గురవుతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కుటుంబం పట్ల బాధ్యతగా ఉంటూ సంసార జీవితాన్ని కొనసాగించాలని దంపతులకు సూచించారు.

విదేశీ విద్యా 'స్టే ఫండ్' అర్హులందరికీ ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-ముషీరాబాద్

విదేశీ విద్యా 'స్టే ఫండ్' అర్హులందరికి ఇవ్వాలని బీసీలకు 300ల మందికి కాదు.. 2వేల మందికి ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం సంఘం అధ్యక్షులు, రాజ్యసభ్యులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఆదివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రిపొన్నం ప్రభాకర్ ను తన కార్యాలయంలో కలిసి చర్చలు జరిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు కోర్సుకు రూ.20 లక్షల స్టే ఫండ్ మంజూరు చేస్తున్నారు. రాష్ట్రంలో బీసీలకు 300 మందికే స్టే ఫండ్ మంజూరు చేస్తున్నారు. బీసీలకు ఇది ఏ మాత్రం సరిపోవడం లేదు. ఇంకా 90% మందికి రాక ఇబ్బంది పడుతున్నారు. తెలివితే టలు చదువులలో మెరిట్ ఉండి కూడా ఆర్థిక సహాయం లేకపోవడంతో విదేశాలకు వెళ్లలేకపో తున్నారు. అందుకని 300 మందికి కాదు 2వేల మంది బీసీ విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విదేశీ విద్యాను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంద న్నారు. బీసీల డిమాండ్ల పరిష్కారానికి ముఖ్య మంత్రితో చర్చించి త్వరలో అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ చర్చలలో బీసీ నాయ కులు గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, సి. రాజేం దర్, సతీష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటా

కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

గంగపుత్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం అంబర్ పెట్ నియోజకవర్గంలో గోల్నాక లోని వీరన్న గుట్టలో గంగ తెప్పోత్సవ శోభాయాత్ర ర్యాలిని అంబ ర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి ,నల్లకుంట కార్పొరేటర్ అమృత తో కలిసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గతంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గా ఉన్నప్పుడు అంబర్ పెట్ డివిజన్ లోని గాంధీ బొమ్మ మార్కెట్ వద్ద ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయవలసిందిగా మేయర్ దృష్టికి కి తీసుకుపోవడం జరిగిందని, అందుకు సానుకూ లంగా స్పందించిన మేయర్ ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటానని తెలి యజేశారని, ప్రభుత్వం మారిపోవడంతో మరొకసారి మేయర్ దృష్టికి ఫిష్ మార్కెట్ ఏర్పా టుకు సహకరించవల సిందిగా తెలియజేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గంగా తెప్పోత్సవ నిర్వహణ కమి టీ నాయకులు వివిధ పార్టీల నాయకులు మైలారం రాజు, పెంటం రాజు, దిలీప్, ఉదయ్ కిరణ్, సాయి,భాస్కర్ గౌడ్,రసమల అనిల్,అజయ్, తదితరుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ దే

- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఏనాడు రైతులపై కనీస కనికరం చూపని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రైతుల గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగం పల్లిలోని తన కార్యాలయంలో బీజేపీ, బీఆర్ఎస్ రైతు వ్యతిరేక విధానాలపై పత్రికా ప్రకటన ద్వారా స్పందిం చారు. ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు వివిధ కారణాల చేత చనిపోతే కనీసం పరామర్శించని బీఆర్ఎస్ పార్టీ వరి వేస్తే ఉరి అన్నటు వంటి బీఆర్ఎస్ నాయకులు నేడు రైతుల గురించి రైతు రుణమాఫీ గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేసినటువంటి ఘనత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీకే దక్కుతుంద న్నారు. ప్రజా ప్రభుత్వ హయాంలో రైతులు ప్రజల ఆనందాన్ని చూసి ఓర్వలేక అబద్ధపు మాటలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం లో ఉన్న రెండు పర్యాయాలు లక్ష రూపాయల రుణ మాఫీ చేస్తామని చెప్ప ప్రజలను ఏ విధంగా మోసం చేశారో మనందరం కూడా ప్రత్యక్షంగా చూడగలిగామన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్నటువంటి అసత్య ఆరోపణల ను తెలంగాణ ప్రజానీకం నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ గాని బీఆర్ఎ స్ గాని రైతుల పట్ల ఏనాడు కూడా వారికి లబ్ది చేకూరే ప్రయత్నం చేసినటువంటి భారతీయ జనతా పార్టీ రైతుల గురించి రైతు రుణమాఫీ గురించి మాట్లాడడం విడ్డూ రంవందల మంది రైతులను పొట్టన పెట్టుకున్నటువంటి భారతీయ జనతా పార్టీ రైతుల గురించి మాట్లాడం దయ్యాలు వేదాలు వెలిసినట్టు అనిపిస్తుందని ఎద్దేవా చేశారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

సర్దార్ సర్వయ్ పాపన్న గౌడ్ 374వ జయంతి అలీకేఫ్ చౌరస్తా, అంబర్‌పేటలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేపీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు అంబర్‌పేట నియోజకవర్గం, గౌడ సంఘం ప్రతినిధులు లింగం గౌడ్ లక్ష్మణ్ గౌడ్, భాస్కర్ గౌడ్, మేదర సంఘం రాష్ట్ర నాయకుడు పిల్లి బాలరాజ్ పాల్గొని సర్వయ్ పాపన్న గౌడ్ చిత్రపటానికి ఘనంగా పూలమాలతో నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కేపీ మురళీకృష్ణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం రావాలని, బీసీల్లో ఉండే అట్టడుగు కులాలను సమీకరించి, మొగల్ చక్రవర్తిపై దండయాత్ర చేసి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకొని, బహుజనులు కూడా రాజ్యాధికారం సాధిస్తారని, ప్రజాపాలన నిర్వహిస్తారని చెప్పిన గొప్ప వ్యక్తి, ఆదర్శమూర్తి, బడుగు బలహీన వర్గాలకు మార్గదర్శి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో రాజ్యాధి కారమే అంతిమ లక్ష్యంగానే పని చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న జీవితం అందరికీ ఆదర్శమన్నారు. భవిష్యత్ తరాలకు పాపన్న స్ఫూర్తి గాథలు తెలియాలని అభిప్రాయపడ్డారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-ముషీరాబాద్

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ముషీ రాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని భోలక్‌పూర్ దేవుని తోటలోని భవానీ శంకర్ టెం పుల్ సమీపంలో తెలియని వ్యక్తి (40) ఫుట్ పాత్ పై అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించి స్థానికులు ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు సమా చారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 108 సిబ్బంది సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరి శీలించి మృతి చెందాడని తెలపడంతో మృతుడి వివరాలకి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సమాజంలో మహిళలకు రక్షణ కల్పించాలి

- గైనకాలజిస్ట్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ శాంత కుమారి, డాక్టర్ సుభాకర్

నవతెలంగాణ-ముషీరాబాద్

సమాజంలో మహిళలకు రక్షణ కల్పించాలని గైనకాల జిస్ట్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ శాంత కుమారి, డాక్టర్ సుభాకర్ డిమాండ్ చేశారు. కల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన నిరసిస్తూ ది ఆబ్ స్టిక్స్ గైనకాలజీకల్ సొసైటీ ఆఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీలో డాక్టర్ శాంతకుమారి , డాక్టర్ సుభాకర్ హాజరై మాట్లాడుతూ వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని , నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. దేశంలో ఇలాంటివి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని కోరా రు. సమాజంలో మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ ఘటనపై రాజకీయ పలు స్వచ్ఛంద మహిళా సంఘాలు ఖండించకపోవడం విచారకరమన్నారు ప్రతి ఒక్కరు బయటకు వచ్చి, తమ నిరసనను తెలియ జేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మెడికల్ కాలేజీ , ఆస్పత్రులల్లో విమెన్ సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదంటే ప్రతి ఒక్కరు ముక్తకంఠంతో దీన్ని ఖండించి సమాజంలో మహిళలకు మెరుగైన భద్రత కల్పించే విధంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు ప్రజలు పాల్గొన్నారు.

కూలిన ఉస్మానియా ఆస్పత్రి రెలింగ్..





- ధ్వంసమైన ద్విచక్ర వాహనాలు
- తప్పిన పెను ప్రమాదం..

నవతెలంగాణ-ధూల్ పేట్

ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో సాయంత్రం కురిసిన వర్షానికి ఓపీ భవనం పార్కింగ్ ప్రాంతంలో కూలింది. భవనం రెండవ అంతస్తు మధ్య ఉండే రేలింగ్ పడింది. అక్కడే పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల పై ఒక్కసారిగా పడటంతో ధ్వంసం అయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం తో పెను ప్రమాదం తప్పిందని సిబ్బంది వాపోతున్నారు. ఆక్టివా, బైక్‌లు సుమారు మూడు, నాలుగు వాహనాలు దెబ్బతిన్నాయి.





గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలనకై అందరూ భాగస్వామ్యం కావాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదామని డీవైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ యువతకు పిలుపునిచ్చారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నాంపల్లి జోన్ హమ్మద్ నగర్ బస్తీలో గంజాయి డ్రగ్స్ నిర్మూలనకై అవగాహన సదస్సును నిర్వ హించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజ రైన డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లా డుతూ నేటి యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అత్యంత ప్రమాదకరమైన గంజాయి, డ్రగ్స్ సేవించడంతో సకల అనర్థాలకు కారణమవుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ దందా విస్తరిస్తు న్నదని బడిపిల్లల నుండి వర్సిటీ స్టూడెంట్స్ దాకా రోజు కూలీ నుంచి సాఫ్‌వేర్ ఉద్యోగుల వరకు ముఖ్యంగా సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఈ మత్తు మహమ్మారికి బానిసలవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరంతరమైన నిఘాను ఏర్పాటు చేసి గంజాయి డ్రగ్స్ నిర్మూలించాలని కోరారు. విద్యార్థులు యువత బహుముఖ సేవా కార్యక్రమాల్లో, డీవైఎఫ్ఐ నిర్వహించే అహగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శలు హ్మస్మి బాబు, జావీద్ జిల్లా ఉపాధ్యక్షులు అర్షద్ రవి, కలిమ్, జిల్లా అధ్యక్షులు లెనిన్, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

'న్యాయవాదులకు రక్షణ కల్పించాలి'

- తెలంగాణ అడ్వకేట్ జేఏసీ డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దేశ వ్యాప్తంగా ఇటీవల న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నేపథ్యంలో న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని తెలంగాణ అడ్వ కేట్ జేఏసీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ఏ.బి.వేద్ ప్రకాష్ యాదవ్, కన్వీనర్ బత్తుల కృష్ణ, కూకట్ పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి తదిత రులు మాట్లాడుతూ ఈ నెల 16న బోరబండలో అకారణం గా న్యాయవాదిపై దాడి చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడ తామని హెచ్చరించారు. కూకట్‌పల్లి కోర్టులో న్యాయవాది గా ప్రాక్టీస్ చేస్తున్న సంతోష్ కుమార్ 4 నెలల క్రితం బోరబండలోని ఒక భవనంలో కింద పోర్షన్‌లో కిరాయికి తీసుకుని ఉంటున్నారని తెలిపారు. ఇంటి ఓనర్ గత రెండు దశాబ్దాలుగా బెల్ట్ (మద్యం) షాప్ నిర్వహిస్తున్నారని చెప్పారు. కాగా ఈ నెల 16వ తేదీ ఉదయం 6.30 గంటలకు బోరబండ పోలీసులు ఆ బిల్డింగ్ వద్ద గేటుకు ఉన్న తాళం తీయమని సంతోష్ కుమార్‌ను బెదిరించారని, దీంతో సంతోష్ కుమార్ తాళాలు తన వద్ద లేవని బిల్డింగ్ ఓనర్ దగ్గర ఉంటాయని చెప్పారని, అందుకు రెచ్చిపోయిన పోలీసులు గేటును ధ్వంసం చేసి తాళాలు పగలగొట్టి, ఆయనపై దాడి చేసి లుంగీ, బనియన్ పై ఉన్న సంతోష్ కుమార్ ను అలాగే పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ప్రయోగించి వదిలి పెట్టారని వారు ఆరోపించారు. ఎస్ఐ జమాల్, సిబ్బందిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని శనివారం నగర పోలీస్ కమిషనర్‌కు తాము ఫిర్యాదు చేశా మని, ఇందుకు కమిషనర్ మాట్లాడుతూ మీరేనా అడ్వకేట్లు నేను ఎల్.ఎల్.బి చేశానని, ఇప్పుడు ఎల్ఎల్ఎం చేస్తున్నా నని అవమానపరిచారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక బాధ్యతయుతమైన అధికారి చట్టాన్ని కాపాడవలసింది పోయి రాజ్యాంగాన్నే అపహాస్యం చేసే విధంగా మాట్లాడా రని వారు ఆరోపించారు. ఈ విషయంలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని అడ్వకేట్ సంతోష్ కుమార్‌కు న్యాయం చేయాలని కోరారు.ఎస్ఐ జమాల్, కమిషనర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో అడ్వకేట్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలసాని సురేష్, శ్రీకాంత్ యాదవ్, దుర్గ భవానీ, విజయ కుమారి, కార్యదర్శి రమేష్, మీడియా సెల్ ఇన్‌చార్జి మారోజు వినోద్ కుమార్ పాల్గొన్నారు.

వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలి

- డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ నేషనల్ కన్వీనర్ కాటమొని వెంకటేష్ గౌడ్
- 21న డిఎస్‌డి ఆధ్వర్యంలో చలో ఇందిరా పార్క్



నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ నేషనల్ కన్వీనర్ కాటమొని వెంకటేష్ గౌడ్, వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి 21న డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ ఆధ్వర్యంలో చలో ఇందిరా పార్క్ మహాధర్నాను విజ యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బాగ్‌లింగంపల్లిలో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలుగా అయినా ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేయూత పథకం వికలాంగుల పెన్షన్ రూ. 4016 నుంచి రూ. 6000 వరకు పెంచి వెంటనే పంపిణీ చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర మంతటా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కు వసతి కల్పించాలన్నారు. వికలాంగు లకు కేటాయించిన ఉద్యోగాలు క్యాలెండర్ పద్ధతిలో భర్తీ చేయుటకు వెంటనే ఆదేశాలు జారీ చేయాల న్నారు. వికలాంగుల హక్కుల చట్టం చట్టం 2016ను పటిష్టంగా అమలు చేయాలని వికలాంగులకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 5% కేటాయించాలన్నారు. వెంటనే సమస్యల పై స్పందిం చాలని మంత్రి శ్రీధర్ బాబుకు మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశా రు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎ ఉద్దీన్, వాసుదేవా రావు, ప్రే మ్ కుమార్, సర్వుదిన్, గౌస్ పీర్, తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అంబర్‌పేట కార్పొరేటర్ ఇ విజయ్ కుమార్ గౌడ్, నాయకులు లక్ష్మణ్ గౌడ్, భాస్కర్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్ ఓక్రిడ్జ్ స్కూల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన క్రిష్ణ మొబైల్స్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసి వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్యాసారం శ్రీశైలం యాదవ్, మలుగుల శ్రీశైలం యాదవ్, యజమానులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

9

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

సోమవారం | ఆగస్టు 19, 2024 | www.navatelangana.com

సర్వాయి పాపన్నకు నివాళులర్పించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి సందర్భంగా.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి ఈస్ట్ కమాన్ దగ్గర ఉన్న సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు.



వైద్యరంగంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల పాత్ర కీలకం

- రోగులకు బాధ్యతాయుతంగా వైద్య సేవలందించాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు రెండూ కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ విషయంలో ప్రయివేటు రంగం మరింత బాధ్యతాయుతంగా వైద్య సేవలందించాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లో యూడెర్మ్ హెయిర్ అండ్ స్కిన్ క్లినిక్ రెండో శాఖను ఆదివారం మంత్రి ప్రారంభి మాట్లాడారు. ఇటీవలి కాలంలో చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరికీ జుట్టు రాలడం, ఇతర చర్మ సంబంధిత ఇబ్బందులు వస్తున్నాయనీ, వాటన్నింటికీ సమగ్రంగా వైద్యసేవలు అందించడానికి వీలుగా ఒకేచోట అన్నిరకాల వైద్యం చేసేందుకు ఈ ప్రాంతంలో యూడెర్మ్ హెయిర్ అండ్ స్కిన్ క్లినిక్‌ను ప్రారంభించడం సంతోషకరం అన్నారు. డాక్టర్ సశాంత్ ముక్కా మాట్లాడుతూ 'ఇప్పటికే కోకాపేటలో ఒక ఆస్పత్రి నిర్వహిస్తున్న మేము.. ఇప్పుడు నగరవాసులకు కూడా సేవలందించేందుకు వీలుగా జూబ్లీహిల్స్‌లో ఆస్పత్రిని ఏర్పాటు చేశాం. ఇక్కడ కేవలం ఒక్కరే కాకుండా.. అన్నిరకాల చర్మ, శరీర, జుట్టు సమస్యలకు సంబంధించిన వైద్యులు, మహిళా వైద్యులు, కాస్మెటాలజిస్టులు, డెర్మటాలజిస్టులు కూడా అందుబాటులో ఉంటారు. సాధారణ చర్మసంబంధిత ఇన్ఫెక్షన్ల నుంచి సోరియాసిస్ లాంటి తీవ్ర సమస్యల వరకు.. అలాగే జుట్టు రాలడం, పూర్తిగా ఊడిపోవడం లాంటి తీవ్రమైన ఇబ్బందుల వరకు అన్నింటికీ చికిత్సలు అందిస్తాం. కాస్మెటిక్ చికిత్సలు కూడా ఇక్కడ అందించగలం. శరీరంలోని గుప్తభాగాలకు సంబంధించిన సమస్యలు, ఇన్ఫెక్షన్లు ఉన్నా.. వాటికి సైతం సమర్ధవంతంగా చికిత్సలు చేయగల సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి' అని తెలిపారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి



- ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

పేదలకు వరం సీఎం సహాయ నిధి అని ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన, ఎనిమిది లక్షల ఇరవై వేల రూపాయల, సీఎంఆర్ఎఫ్ చెక్కులను వివేకానంద నగర్ లోని తన నివాస కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పంపిణీ చేశారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా.. 20 మంది లబ్ధిదారులకు మంజూరైన ఎనిమిది లక్షల ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన, సీఎంఆర్ఎఫ్ చెక్కులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి, ఎమ్మెల్యే బాధిత కుటుంబాలకి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా.. తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే పునరుద్ఘాటిం చారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంత రం సేవలను అందిస్తూ, ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని పేర్కొన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలియచేశారు. వైద్య చికిత్సకి సహకారం అందించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పశ్చిమబెంగాల్ రాష్ట్రం, కలకత్తాలో జూనియర్ వైద్యురాలు మౌమిత పై లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద సీపీఐ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు సీపీఐ రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నంలు పాల్గొని మాట్లాడుతూ మహిళల పై అత్యాచారాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంఘటనలు జరిగినప్పుడు కఠినంగా వ్యవహరిస్తామని, కఠిన చట్టాలు తీసుకువస్తామని గంభీరమైన ప్రకటనలు చెయ్యడమే కానీ అమలులో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. యూపీ, ఢిల్లీ రాష్ట్రాలలో మహిళలను లైంగిక దాడి చేసిన నిందితులకు బీజేపీ నాయకులు దండలు వేసి స్వాగతం పలకడం చూసిన ప్రజలు లైంగిక దాడి చేస్తే శిక్షలు పడవని, దానికి కొంతమంది రాజకీయ నాయకుల అండ ఉంటే సరిపోతుందని అభిప్రాయానికి రావడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలకత్తాలో లైంగిక దాడి చేసిన నిందితుల వెనుకాల పలుకుబడి, లేక అధికారుల అండదండలు ఉండి ఉండవచ్చని అందుకే లైంగిక దాడి జరిగి వారం రోజుల వరకు కేవలం ఒక్కరినే అరెస్టు చేయడం విడ్డూరమన్నారు. నిందితుడిని విచారణ పేరుతో కాలక్షేపం చెయ్యకుండా వెంటనే శిక్షించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులకు కారణం అశ్లీల చిత్రాలు, మద్యం, డ్రగ్స్, వంటి మాదకద్రవ్యాల వంటి అలవాట్లు సమాజంలో మహిళలపై చులకన భావం, శిక్ష నుంచి తప్పించుకోవచ్చనే భావన లాంటివి కారణమన్నారు. ముందుగా వాటి పై ఆలోచించి కఠిన చర్యలతో పాటు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యు) కార్యదర్శి హైమావతి, సత్యవతిలు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం భేటి పడావో-భేటి బచావో అనే నినాదం ఇచ్చింది కానీ స్వయంగా కొంతమంది బీజేపీ నాయకులే అత్యాచారాలు చేసిన నిందితులను సన్మానం చెయ్యడం, అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఎంపీ పదవులు ఇవ్వడం చేస్తూ బేటికో బీజేపీ సే బచావో అనే విదంగా మారిందని బీజేపీ కేవలం మత రాజకీయాలు చేయడానికే కానీ ప్రజల సమస్యలు, బాగోగులు పట్టవని విమర్శించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఏ.ప్రవీణ్, ఏఐటీయూసీ అధ్యక్షులు వి. హరినాథ్, సీపీఐ నాయకులు కృష్ణ, సహదేవ్ రెడ్డి, చంద్రయ్య, ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకులు రవి, సామెల్, మహిళ నాయకురాలు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మదర్ థెరీసా రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రాజీవ్ గృహకల్పలోని మధర్ థెరీస్సా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ, జనరల్ బాడీ సమావేశం ఆదివారం కోలన్ శ్రీనివాస రెడ్డి అధ్యర్యంలో.. నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికయిన కమిటీ సభ్యులు

చైర్మెన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పితాని శ్రీనివాసరావు, అధ్యక్షుడు మానేపల్లి నరసింగరావు, ఉపాధ్యక్షుడు పోచారం ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ ఎర్ర దాలినాయిడు, ఎగ్జిక్యూటివ్ నెంబర్ ముంగండ వెంకటేశ్వర రావు, ట్రెజరర్ అదంకి శ్రీనివాసరావు, జాయింట్ ట్రెజరర్ పోతుల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ సలాడి శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అత్తోట నాగభూషణం, కోఆర్డినేటర్ పల్లె శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ డెక్కపాటి బుజ్జి కోఆర్డినేటర్ మూర్తి, నూతన కమిటీ సభ్యులుగా నియమితులయ్యారని చైర్మెన్ కోలన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

పలు అభివృద్ధి పనులు పరిశీలన



- అధికారులతో, కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్ నగర్‌లో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాస రావు పరిశీలించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. రోడ్డును లెవెల్ చేసి వర్షపు నీరు నిలవకుండా ముందస్తు ప్రణాలికతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని ఈ సందర్భంగా కార్పొరేటర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ,మహదేవ్ కాలనీ వాసులు కుమార స్వామి, మహేష్, సురేష్, కృష్ణం రాజు, శివరాం ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి



- కూకట్‌పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి.కృష్ణ

నవ తెలంగాణ-బాలానగర్

వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి అని కూకట్‌పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి.కృష్ణ అన్నారు. కోల్ కతాలోని ఆర్జీ కార్ హాస్పటల్‌లో మహిళా జూనియర్ వైదురాలి లైగింక ఘటన పై కూకట్‌పల్లి మండల పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ నుంచి శ్రీశ్రీ నగర్ సీపీఐ కార్యాలయం వరకు ఘనననను ఖండిస్తూ .. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో.. నిరసన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్, కోల్ కతాలోని ఆర్జీ కార్ హాస్పటల్‌లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన యావత్ దేశాన్నే దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి ని గుర్తుచేశారు. ఈ ఘటనపై జ్యూడిషియల్ విచారణ జరిపి, నిండుతుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.మనోచారి, సిహెచ్.బాలయ్య, ఉమారాణి, చంద్రమ్మ, జి. రాములు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సుచిత్రలో 'లలిత జ్యువెల్లర్స్'56వ బ్రాంచ్ ప్రారంభోత్సవం



- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుచిత్ర సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన లలిత జ్యువెల్లర్స్ 56వ బ్రాంచ్‌ని ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మాత్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ప్రారంభించారు.

సుచిత్ర సర్కిల్‌లో లలిత జ్యువెల్లర్స్ నూతన శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందని, ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బంగారాన్ని, వెండిని అందించాలని అన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిం చాలని లలిత జ్యువెల్లర్స్ ఎండి కిరణ్‌ని మాజీ ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో లలిత జ్యువెల్లర్స్ ఎండి కిరణ్, సినీ నిర్మాత బండ్ల గణేష్, కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్ గౌడ్, బుచ్చిరెడ్డి, బాలప్ప, కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, మోతె శ్రీనివాస్ యాదవ్, లలిత జ్యువెల్లర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సుచిత్రలో నూతనంగా ఏర్పాటుచేసిన "లలితా జువెలర్స్" ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "బంగారు భవిష్యత్తుకు నమ్మకమైన పెట్టుబడి" బంగారమని జువెలరీ రంగంలో అతి తక్కువ కాలంలో విశేష ఆదరణ పొందిన లలిత జ్యువెలర్స్ నేడు 56వ శాఖను ఏర్పాటు చేసినందుకు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వ్యాపారం మరింత అభివృద్ధి చెంది, దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జీడిమెట్ల డివిజన్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్, గుమ్మడి మధుసూదన్ రాజు, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, కాలే నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ ప్రజల గుండెచప్పుడు జల్దా వెంకటేశం



- స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్దా లక్ష్మీనాథ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నిస్వార్ధ ప్రజా నాయకుడు,పేదల పెన్నిధి, గాంధీ నగర్ ప్రజల గుండె చప్పుడు కీర్తిశేషులు జల్దా వెంకటేశం అని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్దా లక్ష్మీ నాథ్ అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి పురస్క రించుకొని రంగారెడ్డినగర్ డివిజన్, గాంధీనగర్ చౌరస్తాలో గల విగ్రహానికి స్థానిక బస్తి వాసులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన వెంకటేశం సేవలు మరువలేనివని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఖాజా భాయ్, మేకల ఎల్లయ్య, వర్క్ షాప్ సత్యనారాయణ, ఎడ్ల బిక్షపతి, పర్వతాలు, యువజన నాయకులు మీసాల సత్యనారాయణ, లక్ష్మణ్ గౌడ్, తుమ్మ శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఫస్ట్ కేర్ ఫార్మసీ ఆధ్వర్యంలో.. ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని పటేల్ కుంట పార్కు వద్ద ఫస్ట్ కేర్ ఫార్మసీ ఆధ్వర్యంలో.. ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, బిఎంఐ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఫస్ట్ కేర్ ఫార్మసీ మేనేజర్ శేఖర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. వైద్యుల సూచనల మేరకు, తగిన మందులు వాడాలనీ పోషక విలువలున్న ఆహారం తీసుకొని, ప్రతి రోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న చటామోని జగదీష్ మాట్లాడుతూ, ఇలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనీ తెలిపారు. తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోవచ్చునని పేర్కొన్నారు. డాక్టర్ సలహా మేరకు సరైన మందులు వాడితే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జిలు సురేష్, షహబాజ్, ఫస్ట్ కేర్ ఫార్మసీ సిబ్బంది ఈ వైద్య పరీక్షలు చేశారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి



నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ మండల కమిటి ఆధ్వర్యంలో.. భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు నగేష్ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఔరంగజేబు, మొగలాయ్‌లను ఎదిరించి వారితో యుద్ధం గెలిచి గొల్కొండ కోట ఖిల్లాపై బహుజన జెండా ఎగురవేసిన గొప్ప విప్లవ యోధుడని కొనియాడారు. నేటి బహుజన సమాజం ప్రజాస్వామ్య యుద్ధం చేసి మళ్ళీ రాజ్యాధికారం సాధించడమే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఇచ్చే నిజమైన నివాళని, నేటి యువత పాపన్నను కుల, మతాలకు అతీతంగా ఆదర్శంగా తీసుకోలని ఆయన ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, అభిలాష్, రవి కాంత్, నాగ రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374 వ జయంతి సందర్భంగా పటేల్ శ్రీకాంత్ గౌడ్, పులి శివ గౌడ్ ఆధ్వర్యంలో..బాలానగర్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నవతెలంగాణ-బాలానగర్



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి సందర్భంగా నివాళు లర్పించిన జీవీఆర్...

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలి..



- కార్పొరేటర్ బి.విజయశేఖర్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చరిత్రలో మొట్టమొదటి సారిగా గోల్కొండ కోట ను ఏలిన ఏకైక బహుజన హిందూ చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ఆశయాలను కొనసాగించాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయశేఖర్ గౌడ్ అన్నారు.ఈ మేరకు ఆదివారం పాపన్న 374 వ జయంతి వేడుకలు చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో స్థానిక బస్తి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాల ప్రజలు దోపిడీకి గురవుతున్నారని పాలకులకు వ్యతిరేకంగా పోరాడితే రాజ్యాన్ని ఏలే రాజులు కూడా కావచ్చని చేతల్లో చేసి చూపించిన బహుజన వీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు.బడుగు బలహీనర్గాలకు పాపన్న ఒక ఆశ జ్యోతి అని మొఘలులు, సబ్బండ వర్గాల ప్రజలను దోచుకుంటున్న సమయంలో ఆదుకొని ఉత్తమ పాలన అందించిన ప్రజా నాయకుడు సర్దార్ పాపన్న అని,అతి నిరుపేద కుటుంబంలో జన్మించి అన్యాయా నికి,విదేశీ ముస్లిం మొగల్ దోపిడీ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన వర్గాలను ఏకం చేసి గోల్కొండ కోటను ఏలిన మహనీయుడు పాపన్న మహారాజ్ అని నాయకులు కొనియాడారు. నేటి యువత కూడా పాపన్నను ఆదర్శంగా తీసుకుని రాజకీయంగా ఎదగాల ని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తంగా లక్ష్మారెడ్డి, భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి.సత్యం సాంబయ్య, సామ్రాట్, గౌడ సంఘ అధ్యక్షులు బబ్బూరు బిక్షపతిగౌడ్, ఉపాధ్యక్షులు బీసు వెంకటేశం గౌడ్, బాల్నే రమేష్ గౌడ్, పచ్చిమట్ల నరేందర్ గౌడ్, బత్తిని శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

నవతెలంగాణ

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

సోమవారం ఆగస్టు 19, 2024 www.navatelangana.com

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ- కంటోన్మెంట్



కంటోన్మెంట్ నియోజకవర్గం 8వ వార్డు బొల్లారంలో పెనియల్ ఫౌండేషన్ వారు ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య సేవలు అందిస్తున్న పెనియల్ ఫౌండేషన్ వారికి అభినందనలు తెలిపారు. పెనియల్ ఫౌండేషన్ వారు భవిష్యత్‌లో నియోజకవర్గంలో ఇతర ప్రాంతాలలో కూడా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు. ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మెన్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను సన్మానించిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ - ఓయూ



గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన తెలంగాణ ఉద్యమ రథసారథి, ప్రొఫెసర్ కోదండరాంను తార్నాకలోని ఆయన నివాసంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు, టీ టీయుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డితో కలిసి ప్రొఫెసర్ కోదండరాంను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తున్న నేటి తరం'

నవతెలంగాణ - బంజారాహిల్స్



భారతీయ సంస్కృతిలో పట్టు , హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, నేటి తరం కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని నిర్వాహకుడు గుప్తా అన్నారు. జగదీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 కళింగ కల్చరల్ హాల్లో హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శన, అంతకు ముందు బేగంపేట కంట్రీక్లబ్‌లోని స్టూడియో యాక్టివ్‌లో హ్యాండ్ లూమ్ కలెక్షన్ థీమ్ ఫ్యాషన్ షోను నిర్వహించారు. ఈ షోలో కంచి, బెనరస్, సిల్క్, పోచంపల్లి, అపూర్వ వంటి కలెక్షన్స్ను నిర్వహకులు గుప్తా, మోడళ్లతో కలిసి హ్యాండ్ టూ హ్యాండ్ ప్రదర్శన పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకుడు గుప్తా మాట్లాడుతూ... ఈ నెల 20 నుండి 24 వ తేది వరకు బంజారాహిల్స్‌లోని కళింగలో హాలులో జరుగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు వివరించారు.

ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమురెల్లి బాబు డిమాండ్



నవతెలంగాణ- ఓయూ

హబ్సిగూడలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యమూలాన ప్రాణాలు కోల్పోయిన బాలిక కుటుంబాన్ని, తీవ్ర గాయాల పాలైన ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కొమురెల్లి బాబు మాట్లాడుతూ...నో ఎంట్రీ సమయంలో భారీ వాహ నాలు సిటీలోకి అనుమతించడంతోనే ఇలాంటి ప్రమా దాలు జరుగుతున్నాయని అన్నారు. కావున ఈ విష యాల పైన ప్రభుత్వం బాధ్యత వహిస్తూ.. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా నో ఎంట్రీ సమ యంలో భారీ వాహనాలు అనుమతించరాదన్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు ఘటనలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్నారు తప్ప.. పూర్తిస్థాయి నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రాములు, శ్రీహరి, హుస్సేన్, శివ, రవికాంత్, వెంకట్‌గౌడ్, సయ్యద్‌గౌస్, పాల్గొన్నారు.

గంగపుత్రులకు

గంగమ్మ తల్లి దీవెనలు, ఆశీస్సులు అందించాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ - బేగంపేట

మత్స్య వృత్తి జీవనాధారంగా ఉన్న గంగపుత్రుల గంగమ్మ తల్లి చల్లని దీవెనలు, ఆశీస్సులు అందించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యేతలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. తెలంగాణ గంగపుత్ర తెప్పోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్ లో నిర్వహించిన గంగ తెప్పోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఖైరతాబాద్ లోని 7 టెంపుల్స్ నుండి అధ్యక్షుడు మల్కు మహేందర్ ఆధ్వర్యంలో గంగ తెప్ప, బోనాలు, డప్పు చప్పుళ్ళతో కోలాహలంగా నర్సింహరావు మార్గం చౌరస్తా లోని గంగమ్మ దేవాలయం వద్దకు చేరుకొని బోనాలు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లికి నిర్వహించిన పూజలలో మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యేతలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ నిర్వహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాక్సర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్





బోరబండ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ బోరబండలోని ఎస్ఆర్ఆర్‌పురం సైట్-2 సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసి ఉద్దీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్బండ వర్గాల ఆత్మగౌరవ స్ఫూర్తిగా నిలిచిన సర్వాయి పాపన్న వీరగాథను వివరించారు. అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ ప్రదర్శించిన ఆత్మగౌరవ పోరాటం మనందరికీ స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గౌడ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కంటోన్మెంట్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని ఆదివారం బోయిన్పల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయానగర్ చౌరస్తాలో ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ ప్రతినిధులు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండు యాదవ్, బీజేపీ నాయకులు మల్లికార్జున్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యంలో

మహిళల భాగస్వామ్యం కీలకం

- మహిళ పోరాట ఫలితమే 50 శాతం రిజర్వేషన్లు
- మంత్రి సీతక్క





నవతెలంగాణ - బంజారా హిల్స్

పోరాట ఫలితంతో ఏదైనా సాధించవచ్చు అనే నినాదాన్ని ప్రజాస్వామ్యంలో మహిళలు నిజం చేశారని, ప్రజాస్వామ్య పాలనలో మహిళల భాగస్వామ్యం కీలకమని తెలంగాణ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. నగరంలోని ఓ కార్యక్రమానికి మాజీ మంత్రి గీతారెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో తమ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ది రూరల్ ఉమెన్స్ లీడర్ షిప్ ప్రొగ్రాం'ను డెమోక్రటిక్ సంఘ నాయకురాళ్లతో కలిసి ప్రారంభించినట్లు తెలిపారు. లాభాపేక్షలేని, నిష్పక్షపాత, సామాజిక సంస్కరణ సంస్థ, డెమోక్రటిక్ సంఘ, మానవ హక్కులు, చట్టాల అమలు , మహిళల భాగస్వామ్యం, పౌర విద్య , సామాజిక మరియు ఎన్నికల సంస్కరణలతో సహా ప్రజాస్వామ్య సూత్రాలను ప్రచారం చేయడానికి కృషి చేస్తోందన్నారు. దీనిని రైట్ లైవ్లీహుడ్ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత భారతీయ సంఘ సంస్కర్త ఉద్యమ నేత స్వామి అగ్నివేష్ విద్యార్థి బ్రహ్మచారి చైతన్య స్థాపించారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలపరచటంతో పాటుగా పరిరక్షించటానికి డెమోక్రటిక్ సంఘ కృషి చేయటంతో పాటుగా పేదలు, తమ హక్కులను సాధించుకోలేని మరియు అట్టడుగువర్గాల ప్రజల జీవితాలను మార్చడానికి మన రాజకీయ వ్యవస్థను ప్రేరేపిస్తుందన్నారు.

ప్రజాస్వామ్యం అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, తమ మొట్ట మొదటి ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ది రూరల్ ఉమెన్స్ లీడర్‌షిప్ ప్రొగ్రాం' (గ్రామీణ మహిళల నాయకత్వ కార్యక్రమం)ను ప్రారంభించినట్లు డెమోక్రటిక్ సంఘం వెల్లడించిందన్నారు.కరీంనగర్ జిల్లాకు చెందిన మహిళా సంఘ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ మహిళల నాయకత్వంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన వర్గాల గ్రామీణ మహిళలను అభివృద్ధి, సామాజిక మార్పు కోసం పోరాడేవారిగా మార్చే లక్ష్యంతో గ్రామాలలో ఉమెన్స్ కలెక్టివ్స్ (మహిళా సంఘ) ఏర్పర్చడం అభినందనీయమన్నారు. తమ స్థానిక పరిస్థితులలో మార్పు ఏజెండాను విశ్వసించే, అమలు చేసే నాయకులు సమిష్టిగా ఉన్నప్పుడే మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

డెమోక్రటిక్ సంఘం తన మొదటి సంవత్సరంలో తెలంగాణలోని కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఆర్థికంగా, సామాజికంగా, అట్టడుగున ఉన్న వర్గాల మహిళల నేతృత్వంలో 50 ఉమెన్స్ కలెక్టివ్స్‌లను విజయవంతంగా ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఉమెన్స్ కలెక్టివ్స్ తమ గ్రామాల్లో మార్పు ఎజెండాను అమలు చేయడానికి తమకు అధికారం కల్పించే ఏడాది కాలపు కార్యక్రమం కోసం నెలకు ఒకసారి సమావేశమవుతాయనీ, ఈ కార్యక్రమం వారికి స్వీయ-అవగాహన, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ ముసాయిదా హక్కులు, మానవ హక్కులు, లింగ హక్కులు , సమానత్వం, ఆహారం, ఆరోగ్యం, హింస, జీవనోపాధి, విద్య, ఆస్తి హక్కులు వంటి అంశాలను అర్థం చేసుకోవడంలో వారికి తోడ్పడుతుందని వివరించారు. మొత్తం తొమ్మిది శిక్షణా మాడ్యూల్స్, రెండు కమ్యూనిటీ ప్రచారాలు ప్రభుత్వంతో ఒక చర్చ కార్యక్రమం, తమ గ్రామాలను అభివృద్ధి చేసి తమ సంపదను కూడా పెంపొందించుకోవాలనే తపన కలిగిన వేలాది మంది మహిళా నాయకులను రూపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అండ్ చైర్ పర్సన్ సామాజికవేత్త సుధారెడ్డి, నటి రెజీనా, పార్లమెంటు సభ్యులు లావు కృష్ణ దేవరాయలు, గడ్డం వంశీ కృష్ణ, కరీంనగర్ జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ పమేలా సత్పతి ఐ ఏ ఎస్, డెమోక్రటిక్ సంఘ వ్యవస్థాపకుడు, చైతన్య ఎంఆర్ఎస్ పాల్గొన్నారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్న కారు

నవతెలంగాణ - బంజారా హిల్స్



అదుపు తప్పిన ఓ కారు డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం సెలవు దినం కావడంతో రహదారులన్నీ ట్రాఫిక్ లేకుండా ఉండడంతో ఇద్దరు యువకులు ఉత్సాహం ఆపుకోలేక కారును వేగంగా నడుపుతూ ఉదయం టిఫిన్ చేయడానికి బంజారాహిల్స్ తాజ్ కృష్ణ రోడ్డు నుండి ఖైరతాబాద్ రామేశ్వరం కేఫ్‌కు వెళ్తున్న సమయంలో గేర్ బాక్స్ లోతు ప్రాంతం వద్ద స్ట్రక్ అవడంతో వేగంగా ఉన్న కారు డివైడర్‌ను ఢీ కొట్టి అదుపుతప్పింది. కారులో ఉన్న ఇద్దరిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...TG 09GTR1228 నెంబర్ కలిగిన నీలిరంగు బీఎండబ్ల్యూ కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. అందులో ఇద్దరు సోదరులు కాచిగూడకు చెందిన కనిష్ చూభి, చరణ్, వారి స్నేహితుడు జితేష్లు ప్రయాణిస్తున్నారు. సన్రూఫ్‌ను ఆపి గేర్ బాక్స్ సైడ్ లో కాలు ఇరుక్కోవడంతో కాలును తీసే క్రమంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. మరొకరు చిన్నపాటి గాయాలతో బయటపడ్డట్లు పోలీసులు తెలిపారు. ఎవరికి ఇటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ప్రతి ఒక్కరీ సొంతింటి కల సాకారం కావాలి'

నవతెలంగాణ - బంజారాహిల్స్



సమీపంలో అందమైన ప్రకృతి మధ్య సేద తీరుతూ ఆహ్లాదం పొందటానికి చేవెళ్ల సమీపంలో మరో మణిహారం లాంటి ప్రాజెక్ట్ 150 ఎకరాల్లో వస్తోందని ప్రతి ఒక్కరీ సొంతింటి కల సహకారం చేసుకోవాలని ఆశయం ఉంటుందని ఎంతో అభినందనీయమని సినీ ప్రముఖులు అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హొటల్ ఆవాసలో జరిగిన మైరాన్ హెూమ్స్ టివిసి క్యాంపైన్ను నిర్మాత అశ్వని దత్, సినీ నిర్మాత నటుడు, మురళీ మోహన్, చిత్ర నిర్మాత కె.ఎస్.రామారావులు కలిసి, ఆ సంస్థ సియండి డాక్టర్ యం.యువరాజు సమక్షంలో ఆవిష్కరించి ప్రసంగించారు. హైదరాబాద్ విశ్వనగరంతో పాటు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని వారు పేర్కొన్నారు. నగరంలో ప్రతి మధ్య, సంపన్న తరగతుల వారు సొంత ఇల్లు, ప్లాట్ తీసుకోవాలనే కలను మైరాన్ హెూమ్స్ నెరవేర్చడం అభినందనయమన్నారు. సంస్థ సియండి డాక్టర్ యం. యువరాజు మాట్లాడుతూ... సుదీర్ఘ అనుభవం, విశ్వసనీయత, పారదర్శకతతో 20 ఏళ్లుగా ఈ రంగంలో కొనసాగుతున్న తాము తెలుగు రాష్ట్రాలలో 17కి పైగా వెంచర్లను దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. తెలుగు రాష్ట్రాల తో పాటు విదేశాలలో ఉన్న ఎంతో మంది వినియోగదారులకు తమ వెంచర్లనందించి వారి అభిమానాన్ని చూరగొన్నామన్నారు. ప్రతి ఒక్కరి సొంతిల్లు కలను నిజం చేస్తూ, ఇప్పుడు మరో అడుగు ముందుకు వేస్తూ త్వరలో మరో మూడు ప్రాజెక్ట్ లను మీ ముందుకు తీసుకువస్తున్నామని ఆయన అన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను

రెగ్యులరైజ్ చేయాలని వినతి

నవతెలంగాణ - ఓయూ

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తన నివాసంలో ఆదివారం కాంట్రాక్టు ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో ఏండ్ల తరబడి నాన్ టీచింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా



పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఉద్యోగులు తెలిపారు. వినతి అందజేసిన వారిలో తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ సూర్యచందర్, వైస్ చైర్మెన్ డాక్టర్ ఎడ్ల.అంజయ్య, అధ్యక్షుడు కట్ట వేంకటేష్, కన్వీనర్ డాక్టర్.కె.వీరేశం, వైస్ ప్రెసిడెంట్స్ కట్యూరి.శ్రీకాంత్, రాము, సెక్రెటరీ యం. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



నవతెలంగాణ - బంజారాహిల్స్

తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ ఖైరతాబాద్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మొదటి బోనాన్ని స్థానిక కార్పొరేటర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయ రెడ్డి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గంగ తెపోత్సవ కమిటీ సభ్యులు, గంగపుత్ర సంఘం కార్యవర్గ సభ్యులు, మహిళా మత్స్య సహకార సంఘం సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో 'ఎకనామిక్స్ సక్సెస్ మీట్-2024'



నవతెలంగాణ-ఓయూ

ఇటీవ జేఎల్, గురుకుల డిఎల్ ఉద్యోగాలు సాధించిన అర్థశాస్త్ర విద్యార్థులు MVN ఎకనామిక్స్ సక్సెస్ మీట్ - 2024 ను ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ యం. రాములు అధ్యక్ష వహించగా ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నల్గొండ ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ మీనయ్య ఉచిత శిక్షణ ద్వారా ఉద్యోగాలు సాధించిన 60 మందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి మనిషి వ్యక్తిగత అభివృద్ధి లేకపోవడం కారణం దోపిడీని, దోపిడీ లేని వ్యవస్థ నిర్మాణానికి మీ బోధన ఉపయోగపడాలని కోరారు. ప్రొఫెసర్ చింతకింది కాశీం మాట్లాడుతూ.. సమాజంలో రాజకీయాలు, విద్యాబోధన వ్యాపారం అవుతున్న ఈ కాలంలో మానవీయ విలువలు కలిగిన డాక్టర్ మీనయ్య సార్ లాంటి వాళ్ళు ఎంతో ఆదర్శంగా ఉండడం గర్వకారణం అన్నారు. నడుస్తున్న కాలంలో స్పందించే గుణం కరువైతున్న ఈ తరుణంలో ఇలాంటి మీటింగ్ జరగడం శుభపరిణామం అన్నారు. విశిష్ట వక్తులుగా హాజరైన కామ్రేడ్ నంద్యాల నర్సిరెడ్డి, కామ్రేడ్ జూలకంటి రంగారెడ్డి, డాక్టర్ భాస్కర్ రెడ్డి, ప్రొఫెసర్ ఐ.డైసి, డాక్టర్ ఈ ఉపేందర్, ప్రొఫెసర్ ఇంద్రకాంత్, ప్రొఫెసర్ శివారెడ్డి, గణేష్, కొండల్ మాట్లాడుతూ.. డాక్టర్ మీనయ్య అందించిన సామాజిక బాధ్యతను ఆయన శిష్యులుగా మీరు అందిపుచ్చుకొని మరింత ముందుకు సాగాలని అన్నారు. నేడు ప్రభుత్వ కళాశాలల పరిస్థితి అంపశయ్య పైన ఉందనదని నేడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మీరే వైద్యం అందించి ప్రభుత్వ కళాశాలను బ్రతికించాలని కోరారు. ప్రభుత్వ విద్యాలయాలు ఉన్నప్పుడే పేదలకు విద్యాబుద్ధులు దొరుకుతాయని, మానవతా విలువలు పెరుగుతాయని తెలియజేశారు. విద్యా వ్యాపారీకరణ జరుగుతున్న ఈ సమయంలో ప్రభుత్వ విద్యాలయాల విద్యార్థులను ఉన్నత శిఖరాలకు నిలబెడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీలలో మన విద్యార్థులు పోటీపడి విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ దుబ్బ రంజిత్ తో పాటు నరేందర్, ప్రవళిక, సుల్తానా, రాఘవేంద్ర, కిరణ్, సైదులు, దీపిక, ఎల్ల స్వామి, అరవింద్, అక్కనిపెల్లి శోభన్ బాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కార్పొరేటర్ నరసింహా యాదవ్

నవతెలంగాణ - కంటోన్మెంట్



సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఓల్డ్ బోయినపల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహా యాదవ్ అన్నారు. డివిజన్‌లోని సిండికేట్ బ్యాంక్ కాలనీ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమిటీ హాల్ పనులను త్వరగా పూర్తి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం పలు సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైపాల్ రెడ్డి, కృష్ణయ్య, మాధవరెడ్డి, సత్యమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాతబస్తీలో ఘనంగా గణేశ్ ఉత్సవాలను నిర్వహించేందుకు కృషి

నవతెలంగాణ-ధూల్ పేట్

పాతబస్తీలో ఘనంగా గణేశ్ ఉత్సవాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ ఎం ఉదయ్ కిరణ్ రెడ్డి అన్నారు. బహదూర్ పుర నియోజకవర్గ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా ఆయన నూతనంగా నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవ రెడ్డి, బీజేపీ చాంద్రాయణగుట్ట కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఉత్సవ సమితి గ్రేటర్ కార్యదర్శి కౌడీ మహేందర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పాతబస్తీలో గణేశ్ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవ ర్గంలో అన్ని డివిజన్‌లలో మండపాల, విగ్రహ ప్రతిష్ట, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్ల ను చేస్తామన్నారు. నిమజ్జనం వరకు అన్ని విధాలా ఏర్పాట్లు భక్తి శ్రద్ధలతో భారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు. బాధ్యతలు అప్పగించిన భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి కౌడి మహేందర్‌కి ధన్యవాదాలు తెలిపారు. అధ్యక్షులు రాఘవ రెడ్డి, కార్యదర్శి శశిధర్ రెడ్డి సలహాదారులు కరోడిమల్ తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరధిలోని ఇంద్ర నగర్‌లో బోనాల పండుగకు ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ బాలాజీ నాయక్, హరినాయక్, జీవన్‌రెడ్డి, పరమేష్, శ్రీనివాస్, రమేష్ ఆలయ కమిటీ సభ్యులు నవతెలంగాణ-దుండిగల్

ధీరత్వానికి ప్రతీక పాపన్న గౌడ్



- ఆయన ఆశయాలను కొనసాగిద్దాం
- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్
- ఘనంగా జయంతి వేడుకలు

నవతెలంగాణ - జవహర్ నగర్

తెలంగాణ ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని గౌడ సంఘం అధ్యక్షులు అబ్బగొని రాజ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో పాల్గొని నివాళులర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేదప్రజలను సంఘటితం చేసి, రాజకీయ, సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తిగా సర్వాయి పాపన్న చరిత్ర అసామాన్యమైనదని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటస్ఫూర్తితో ఆయన ఆశయాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగరాణి వెంకటేష్ గౌడ్, లావణ్య సతీష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు రాజు గౌడ్, ప్రసాద్ గౌడ్, సోమయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌడ్, శ్రావణ్ కుమార్ గౌడ్, కృష్ణ గౌడ్, రమేష్ గౌడ్, పృథ్వీరాజ్ గౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్‌లో..



మల్కాజిగిరిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్క లైన్‌లోని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద బత్తిని నరసింహా గౌడ్, చింతల మల్లేశం గౌడ్‌ల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, బీజేపీ నాయకులు మహేష్ ముదిరాజ్ పాల్గొని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు కామల్ల ఐలన్న, రొయ్యల కృష్ణమూర్తి, రమేష్, బక్క నాగరాజ్, వెంకటేష్, రవీందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మహేందర్, సుదర్శన్, విజయ్ గౌడ్, అజయ్, లక్ష్మణ్, శీను,నాగరాజు, శంకర్ గౌడ్, కొండా గౌడ్, వికలాంగుల హక్కుల పోరాట సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎస్ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షులు జే.కే సాయి గౌడ్ ఆధ్వర్యంలో..

సర్దార్ సర్వాయి పాపన్న 374 వ జయంతి సందర్భంగా నేరేడ్ మెట్ గౌడ సంఘం అధ్యక్షులు జే.కే సాయి గౌడ్ ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ చౌరస్తాలోని సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయి గౌడ్ మాట్లాడుతూ జమీందారులను తరిమికొట్టిన ఆజానుబాహుడు అని కొనియాడారు. ఆ మహనీయుడికి నివాళులర్పించడం మన బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో కే శ్రీధర్, జేకే రాజు గౌడ్, జీడి శ్రీధర్, జై రామ్, గణేష్, విజయ్, అభిషేక్, శివ, దశరథ్, శ్రీకాంత్, రాజేష్, ఎల్లేందర్, శ్యామ్, నాగరాజు, కుమార్, నవీన్, కే మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో..



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి సందర్భంగా ఓల్డ్ ఆల్వాల్ చౌరస్తాలోని పాపన్న విగ్రహానికి రాష్ట్ర గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయిరాం గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఏడు నెలలు గోల్కొండ కోటను ఏలిన మహారాజు అని లక్ష్మణ్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గౌడ కులస్తులు, అశోక్ రెడ్డి కృష్ణగౌడ్, యాదగిరి ,నాగేశ్వరరావు, రాజసింహారెడ్డి ,శ్రీశైలం యాదవ్, కేబుల్ శేఖర్ నజీర్ , రాజయ్య, వెంకన్న , నిర్మల లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శామీర్ పేటలో..



పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆదివారం తూంకుంట మున్సిపల్ కేంద్రం లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రెసిడెంట్ టి నరసింహ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ టి ఆర్ రవీందర్ గౌడ్, కె రాజులు గౌడ్, ఆంజనేయులు గౌడ్, కిష్టయ్య గౌడ్, చిన్న అంజయ్య గౌడ్, ప్రభుదాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాప్రాలో..



సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఫస్ట్ ఫేస్ చౌరస్తా ప్రధాన కూడలిలో గల ఆయన విగ్రహానికి కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ..తొలి బహుజన చక్రవర్తిగా 21 కోటలు నిర్మించి, 30 ఏండ్లు పాలించి, ఏడున్నర నెలల పాటు గోల్కొండను ఏలిన పోరాట యోధుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. కార్యక్రమంలో కౌండిన్య గౌడ సంక్షేమ సంఘం నాయకులు వెంకన్న గౌడ్, మల్లేష్ గౌడ్, ఏ.కృష్ణ గౌడ్, టీ.కృష్ణ గౌడ్, మురారి గౌడ్, బాలయ్య గౌడ్, సురేష్ గౌడ్, సాయిలు గౌడ్, ఎట్టయ్య గౌడ్, యు.శీను, అశోక్ గౌడ్, ఏ.అంజయ్య గౌడ్, చెక్కిళ్ళ చంద్ర శేఖర్ గౌడ్, నవీన్ గౌడ్, డి.నరసింహ గౌడ్, హనుమాన్ దాస్ గౌడ్, యాదగిరి గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్ క్రాస్ రోడ్డులో..

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు వద్ద గౌడ హాస్టల్ మెంబెర్ పండాల శిబాకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, చక్రపాణి గౌడ్, బాబు గౌడ్, ఆనంద్ గౌడ్, కిషోర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రఘుపతి గౌడ్, ప్రేమ్ గౌడ్, వెంకటేష్ గౌడ్,రాంచందర్ గౌడ్, దినేష్, అంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'29న గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవం'

- గీతా ఫౌండేషన్ చైర్మెన్ బైలూర్ యోగీష్ ప్రభు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఈ నెల 29న గురువారం రవీంద్రభారతిలో గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మెన్ బైలూర్ యోగీష్ ప్రభు వెల్లడించారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దల్లో జ్ఞానం, పిల్లల్లో చైత న్యం తీసుకురావడమే ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఇందులో భాగంగా విష్ణు సహస్రనామం పారాయణం, భగవద్గీత పారాయణం శ్లోకలపై విద్యార్థులకు పోటీలు, భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ సీబీఐ అధికారి జేడీ.లక్ష్మీనారాయణ, అర్చక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొంటా రని తెలిపారు.ఈ సమావేశంలో గీతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు జి.భరత్ కుమార్ శర్మ, ప్రధాన కార్యదర్శి పి.బడేసాబ్, బనారస్ స్వామీజీ, గంట మనోహర్ రెడ్డి, రామకృష్ణ, చంద్రమౌళి, మనోహర్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

దళితుల్లో కులగణన చేపట్టిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- ఉపకులాలకు అన్యాయం చేస్తే మరోపోరాటానికి సిద్ధం
- ఉపకులాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి
- ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని కానీ ఎస్సీ రిజర్వేషన్లలో ఉపకు లాల వాటా ఎంతో తేల్చి శాస్త్రీయంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, ఉపకులాలకు అన్యాయం చేయాలని చూస్తే మరో పోరాటానికి సిద్ధమని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం అన్నారు. ఆదివారం బీసీ సాధికారత భవన్ లో ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగలు, ఉపకులాల సుదీర్ఘ పోరాటం వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలుచేస్తానని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి తరపున కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీం కోర్టు చెప్పిన విదంగా అన్నీ రంగాలలో దళితుల్లో అన్యాయానికి గురైన కులాల పక్కా సమాచారం తీసుకున్న తరువాతే వర్గీకరణ చేయాలని సూచించిందన్నారు. కాబట్టి దళితుల్లో కులగనన చేపట్టిన తర్వాతే జనాభా దామాషా ప్రకారం శాస్త్రీయంగా ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇందుకోసం వెంటనే రిటైర్డ్ జడ్జ్ తో ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సురేపల్లి సుజాత, నీరగొండ బుచ్చన్న గోసంగి, టీఎన్‌స్వామి మిత అయ్యాల్వర్, చంద్రగిరి సత్యనారాయణ సమగర, రాయిల లక్ష్మి నారాయణ చిందు, ఉపాడే సనాధన్ మాంగ్ గారోడి, పరమేశ్వర్ మాంగ్, డాకూరి లింగయ్య డక్కలి, గడ్డం యాదగిరి, నాగిళ్ళ కిష్టయ్య మాస్టిన్, శ్రీనివాస్ మాదిగదాసు, బొబ్బిలి రమేష్ మాలజంగం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్యాస్ రిఫిలింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- సిలిండర్‌లు, నాబ్ స్వాధీనం..

నవతెలంగాణ-ధూల్ పేట్

అక్రమ గ్యాస్ రిఫిలింగ్ చేస్తున్న వ్యక్తిని షాహినాయథ్ గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుండి 14కిలోల ఒక సిలిండర్, 5కిలోల 4 సిలిండర్ లు, ఒక నాబ్ ను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. జుమ్మేరత్ బజార్ ప్రాంతానికి చెందిన సహిల్ సింగ్ (32) అమెజాన్ డెలివరీకి పనిచేస్తుంటారు. ఇక్కడ గుట్టు చప్పుడు కాకుండా గ్యాస్ రిఫిలింగ్ చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

దుండిగల్‌లో ఘనంగా రాజరాజేశ్వరి పోచమ్మ అమ్మవారి బోనాలు



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీలోని "శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి పోచమ్మ దేవాలయం" బోనాల వేడుకల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజరాజేశ్వరి అమ్మవారి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నా రు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి కొలవడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, కౌన్సిలర్ జక్కుల శ్రీనివాస్, పాక్స్ మాజీ వైస్ చైర్మెన్ నల్తూరి కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు బండారి మహేష్, ఈ.శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ వారి ఆశీస్సులుతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి..



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బోనాల పండుగ సందర్భంగా బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్‌లో కార్పొరేటర్ సుజాత ఆధ్వర్యంలో.. ఇందిరన్న కాలనీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, కో ఆప్షన్ సయ్యద్ సలీం ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల పండుగలో ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అమ్మ వారి దేవాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దయ వల్ల ప్రజలంతా సురక్షి తంగా సుభిక్షంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబశివరెడ్డి, స్థానిక నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, వివిధ కాలనీ వాసులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాస బీరప్ప బోనాల కార్యక్రమం..



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధి బీరప్ప నగర్ లో శ్రావణ మాస బీరప్ప బోనాల సందర్భంగా ఆదివారం బీరప్ప ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆలయానికి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకు పల్లి భరత్ సింహ రెడ్డి విచ్చేసి, స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో చైర్మెన్ నార్లకంటి నాగేష్, ప్రెసిడెంట్ నార్లకంటి చంద్రయ్య, నార్లకంటి పెంటయ్య, నార్లకాంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నార్లకంటి చంద్రశేఖర్, నార్లకంటి కిట్టయ్య, ప్రేమ్ దీప్ గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సదుపాయాన్ని వినియోగించుకోవాలి

- కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



జనహిత సేవ కిమ్స్ ఫౌండేషన్ యూత్ ఫర్ సేవ వారి సహకారంతో, మూసాపేట్ వార్డు కార్యాలయంలో ఏర్పాటుచేసిన, ఉచిత వైద్య స్థానిక కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య సదుపాయాన్ని డివిజన్ ప్రజల, అనుబంధ బస్తీల ప్రజలు వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కంటి చూపు పరీక్షలను, డయాబెటిక్ పరీక్షలు, మరి ఇతర సమస్యలున్న ప్రతి ఒక్కటి ఈ వైద్య శిబిరంలో చూసే విధంగా అదునాతనమైన కిమ్స్ వైద్య బృందాన్ని పిలిచి సేవలందిస్తున్నామన్నారు. వారంలో ఆరు రోజులు కూలి పనులకు, ఇతర ప్రయివేటు ఉద్యోగాలకు వెళ్లే ప్రజలకు చిన్న చిన్న సమస్యలేగా అని ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం మూలంగా, అవి పెద్దగా మారి పూర్తిగా ఆరోగ్య క్షీణత వరకు వస్తున్నాయని.. అందుకే ఏ చిన్న సమస్య ఉన్న వెంటనే సంబంధిత డాక్టర్లని కలవాలని, దానివల్ల వ్యాధిని మొదటి దశలోనే అంతం చేసే అవకాశం ఉంటుందన్నారు, ఇంత గొప్ప వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన బృందానికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. డివిజన్‌లో పలు కాలనీలు, బస్తీలలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా హైదరాబాద్ కోఆర్డినేటర్ అరవింద్, జనహిత ఫౌండేషన్ నర్సింగు, కిమ్స్ వైద్య బృందం, సభ్యులు సతీష్ విశాల్ తారక్ పుండరీ సునీత చరణ్, బీజేపీ నాయకులు మల్లేష్ గౌడ్, యూత్ ఫర్ సేవా సభ్యులు, జనహిత ఫౌండేషన్ పాల్గొన్నారు.

23 నుంచి 25 వరకు జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ షురూ...

నవతెలంగాణ-బంజారాహిల్స్



ముత్యాల నగరం హైదరాబాద్‌లో ఈ సంవత్సరం అత్యంత గ్లామరస్ ఈవెంట్‌లలో ఒకటైన జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 23 నుంచి 25 వరకు బంజారా హిల్స్ హోటల్ తాజ్ కృష్ణలో నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు సోనియా చావ్లా తెలిపారు. ఆదివారం ఇందుకు సంబంధించిన లోగోను ఆవిష్కరించిన ఆమె మాట్లాడుతూ...23న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎగ్జిబిషన్,ఆభరణాల ప్రేమికులు, పెళ్లిల కుటుంబాలు, వధువులు, పరిశ్రమ నిపుణులనూ ఈ వేదిక ఆహ్వానిస్తున్నట్లు ఆమె కూడా ప్రకటించారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు ఉదయం 10 నుండి రాత్రి 8 వరకు కొనసాగుతుందని ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ డిజైనర్లు బ్రాండ్ల నుండి సంప్రదాయ ఆధునిక ఆభరణాల డిజైన్‌లను అన్వేషించడానికి సందర్శకులు అనుభవించవచ్చన్నారు. జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ ఆభరణాల పరిశ్రమలో తాజా ట్రెండ్‌లను కనుగొనటానికి సరైన ప్రదేశం వివాహ కుటుంబాలు ఆభరణాల ఆసక్తికరులు ఇక్కడ ప్రదర్శననూ సద్వినియోగం చేసుకోవాలని తెలుగు రాష్ట్ర ప్రజలకు ఆమె కోరారు.

సీఎం నివాసం వద్ద గురుకుల టీచర్లు వినూత్న నిరసన

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సిఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద గురుకుల అభ్యర్థుల వినూత్న నిరసన చేపట్టారు. రాఖీలతో వచ్చిన మహిళా గురుకుల టీచర్ అభ్యర్థులు రాఖీ పండుగ సందర్భంగా సీఎం రేవంతన్న మా గోడు విను అంటూ ఫ్లెక్సీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మెరిట్ ఆధారంగా నియామకాలు జరపాలని వినతి పత్రాలను ఇచ్చి ఇచ్చి అలసిపోయామని సుమారు మూడు నెలలుగా ఆందోళన చేస్తున్న మా గురుకుల అభ్యర్థులకూ న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. గతంలో వీరు పెద్దమ్మ గుడి వద్ద మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు.

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం బాలానగర్ డివిజన్ అధ్యక్షుడిగా ఎడ్ల నీతిష్ కుమార్



నవతెలంగాణ-బాలానగర్

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఏ.ఐ.ఏ.వై.యస్ రాష్ట్ర కమిటీ సమావేశం నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడకు చెందిన ఎడ్ల నీతిష్ కుమార్‌ను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం బాలానగర్ డివిజన్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంఘం జాతీయ కోఆర్డినేటర్ ఎస్. వరుణ్ కుమార్, నీతీష్ కుమార్ కు అందజేశారు. అనంతరం నీతీష్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కర్కనాగరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ పరిధిలో సంఘాన్ని బలోపేతం చేస్తూ దళితుల సమస్యల పరిష్కారానికై తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కర్క నాగరాజు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్, రాష్ట్ర కోశాధికారి బి.ప్రమోదుకుమార్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు, యస్.వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



బహుజన రాజ్యాధికారానికి పాటుపడిన మహానుభావుడు, తెలంగాణ ప్రాంతంలో నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు సర్వాయి పాపన్న 374వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, వి.శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ నేతలు బిక్షమయ్య గౌడ్, రవి కుమార్, ఎస్.పి.క్రాంతి కుమార్ తదితర నాయకులు.. నవతెలంగాణ-ధూల్ పేట్

డిప్యూటీ సీఎంను కలిసిన గడ్డం రవి కుమార్



తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను గడ్డం రవికుమార్, మ్యూజిక్ డైరెక్టర్ గంటెడి కృష్ణ, హీరో సందీప్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు.
నవతెలంగాణ,ఉప్పల్

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కేశు రాం నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఉమ్మడి రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు చింతల మల్లేష్ గౌడ్, రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు జి.వెంకట నరసయ్య గౌడ్, శామీర్‌పేట మండల కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు దేశం సంతోష్ గౌడ్, తదితరులు ఆ సంఘం నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసిన ఆరోగ్యశ్రీ సిబ్బంది



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఆరోగ్యశ్రీ సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని ఏఎస్‌రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ సిబ్బంది ఈశ్వరి భాయ్, హరి బాబు, సుమన్, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

అమ్ముగూడలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని అమ్ముగూడ, రాణి రుద్రమ దేవి ట్రస్ట్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా ఏఎస్‌రావు నగర్, మహేష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపును లయన్ విజయకుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పేదలకు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. క్యాంపుల ద్వారా నిరుపేదలకు కాంటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నామని తెలిపారు. మహేష్ నగర్ కాలనీ కార్యదర్శి వెంకటహరి, కార్తీక క్యాంపులో సేవలందించారు. కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ డాక్టర్ అనిల్ బృందం కళ్ల పరీక్షలు, దమ్మాయిగూడ పద్మసాయి డెంటల్ క్లీనిక్ డాక్టర్ దినేష్ బృందం దంతాల పరీక్షలు, సౌత్ కమలానగర్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ డాక్టర్ దేవకి జనరల్ పరీక్షలు చేశారు. 136 మంది క్యాంపులో అన్ని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి, కార్యదర్శి చనమోలు వరప్రసాద్, సునీల్ కుమార్, అమ్ముగూడ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి వరం



నవతెలంగాణ-కాప్రా

సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నాచారం డివిజన్‌కు చెందిన అనంతమ్మ అనారోగ్య సమస్యతో బాధపడుతుండడంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని నాచారం కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్ గౌడ్ అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద రూ.2,50,000 ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఆదివారం మందముల పరమేశ్వర్ రెడ్డి బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ అధ్యక్షులు బండారం శ్రీకాంత్ గౌడ్, జఫర్, ప్రవీణ్ చారి, శ్రీమంత్ పాల్గొన్నారు.

బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం బీజేఆర్ కాలనీలో ప్రతి ఆదివారం జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో చేపట్టే జ్ఞానమాల సమర్పణ కార్యక్రమం 116వ వారానికి చేరింది. ఆదివారం జ్ఞానమాల టీం సభ్యులు మహాత్మ జ్యోతిరావు పూలే, బీ.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్ మాట్లాడుతూ.. ప్రశ్నించే తత్వం, పోరాడే తత్వం లేని చోట బానిసత్వం కొనసాగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం సభ్యులు నర్సింహ్మా చారి, నరేందర్ రావు, రవి నాయక్, అనిల్ కుమార్, బాలేష్, మెకానిక్ కొండల్ శేఖర్, నరసింహులు, వెంకటయ్య పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును ఎత్తేయాలి



- దమ్మాయిగూడ ప్రధాన రహదారిపై నిరసన తెలిపిన ప్రజలు

నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ ఆదర్శనగర్‌లోని డంపింగ్ యార్డును తక్షణమే ఎత్తివేయాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రామ్కీ సంస్థపై చర్యలు చేపట్టాలని ఆదివారం 18 కాలనీలకు చెందిన ప్రజలు దమ్మాయిగూడ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. డపింగ్‌యార్డు దుర్వాసనతో శ్వాస కోస, చర్మ ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని వాపోయారు. ఆదర్శనగర్ డంపింగ్ యార్డ్‌లో నిబంధనలను పాతరేసి ఇష్టానుసారంగా లారీల కొద్దీ చెత్తను డంపింగ్ చేస్తున్న రామ్కీ సంస్థపై చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించాలని నినాదాలు చేశారు. దీంతో దారి గుండా వెళ్లే వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుమాధవ్‌ల ఆధ్వర్యంలో పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. ఆందోళన కార్యక్రమంలో ఆదర్శనగర్, శ్రీరామ్ నగర్, సాయిరాం నగర్, జమ్మిగడ్డ వైష్ణవి ఎంక్లేవ్, మారుతి ఎంక్లేవ్, పద్మశాలి టౌన్షిప్, వాసవీ శివ నగర్, న్యూ వాసవీ శివనగర్, సోనియా గాంధీ నగర్, నాగార్జున నగర్, నాగార్జున నగర్ ఫేజ్-1, మీనాక్షి నగర్, ద్వారకాపురి, మధురానగర్, శివ సాయి నగర్, తదితర కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

- ఓటరు జాబితా తయారీలో అధికార యంత్రాంగం నిమగ్నం
- ఎంపీడీఓలు, జీపీ కార్యదర్శులకు శిక్షణ
- గ్రామాల్లో సందడి.. సిద్ధమవుతున్న ఆశావహులు..



శిక్షణకు హాజరైన ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)



శిక్షణ ఇస్తున్న డీపీవో, డీఎల్పీవో (ఫైల్)

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆరు నెలల్లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతో అంతటా సందడి నెలకొంది. రెండు నెలల విరామం తర్వాత మళ్లీ ఎన్నికల సందడి మొదలు కాబోతోంది. పంచాయతీ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా అనివార్య కారణాలతో ప్రభుత్వం వాయిదా వేసింది. తాజాగా గత నెల 26వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. ఓటరు జాబితాను రూపొందించాలనీ, బీసీ కమిషన్ నివేదికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. దీంతో అందరి దృష్టి పంచాయతీ ఎన్నికలపై పడింది. ఇప్పటికే ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసింది. త్వరలో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం కూడా పూర్తి కాబోతోంది. దీంతో స్థానిక సంస్థలంనింటికీ వరుసగా ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల కలెక్టరేట్‌లో మండల అధికారులు, గ్రామ కార్యదర్శులకు పంచాయతీ ఎన్నికలపై శిక్షణా కార్యక్రమం సైతం నిర్వహించారు.

ఆరు నెలలుగా ప్రత్యేక పాలన

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలో 61 గ్రామ పంచాయతీలు, 600 వరకు వార్డు స్థానాలు ఉన్నాయి. పంచాయతీ పాలకవర్గాల పద వీకాలం ఫిబ్రవరి 1తో ముగిసింది. ఆరు నెలలుగా గ్రామపంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. జీపీల్లో నిధులు నిండుకోవడంతో మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కార్మికుల వేతనాల కోసం నిధులు విడుదల చేయడంతో వాటిని సర్దుబాటు చేశారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సమస్యలతో పల్లె జనం సతమతమవుతున్నారు.

కుల గణన తర్వాతనే..

పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం ప్రకటనకు ముందు నుంచే రిజర్వేషన్లపై ద్వితీయ శ్రేణి నాయకుల్లో జోరుగా చర్చలు మొదలయ్యాయి. రిజర్వేషన్లపై బీసీ కమిషన్ నివేదిక గడువులోగానే ఇవ్వాలని సీఎం ఆదేశించడంతో పాటు కులగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడంతో ఏ స్థానం ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తారోనని అందరూ ఎదురు చూస్తున్నారు. బీసీ జనగణన, జనాభా ప్రాతిపదిక తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు ఖరారు చేస్తారని ప్రచారం సాగుతోంది.

సెప్టెంబర్‌లో నోటిఫికేషన్..?

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ సెప్టెంబర్‌లో ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కొన్నింటిని అమలు చేసింది. మరికొన్నింటి అమలుకు చర్యలు చేపట్టింది. ప్రధానమైన రైతు రుణమాఫీ పూర్తయ్యింది. దీంతో స్థానిక ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది.

ఆశావహులు రెడీ

గ్రామాల్లో తాజా మాజీ సర్పంచులతోపాటు గత ఎన్నికల్లో ఓడిపోయిన వారు సర్పంచ్ పదవిని దక్కించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సంపన్నులు సర్పంచ్ కావాలన్న పట్టుదలతో ఉన్నారు. ప్రభుత్వం మారడంతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. తమకు సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలను కోరుతున్నారు.

ఈ గ్రామాల పరిస్థితి ఏంటీ..?

ఔటర్ రింగ్ రోడ్డు వరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో జిల్లాలోని 23 గ్రామాలు జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయి. ఔటర్‌కు దగ్గరగా ఉన్న గ్రామాలను మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేస్తారని ప్రచారం జరుగుతోంది. అంతేగాకుండా యాదాద్రి-భువనగిరి జిల్లాలోని బొమ్మల రామారం, బీబీ నగర్, సిద్దిపేట జిల్లాలోని మనోహరాబాద్ మండలాలను జిల్లాలో వీలీనం చేసి, 100 గ్రామాలతో రూరల్ ప్రాంతాన్ని ఏర్పాటు చేస్తారనే ప్రచారం కూడా సాగుతోంది. ఈ విలీనం జీపీ ఎన్నికలకు ముందే ఉంటుందా..? ఆ తర్వాత ఉంటుందా..? అనే విషయం తెలియాల్సి ఉంది. జిల్లాలో 'స్థానిక' ఎన్నికల పట్ల ప్రభుత్వ నిర్ణయం ఏ విధంగా ఉంటుందో వేచి చూడాలి మరి..!

ప్రతి ఒక్కరూ సంస్కృతిని గౌరవించాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



నవతెలంగాణ-ఉప్పల్

దేశ సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఒక్కరికి ఒకరు రక్షణగా ఉంటూ దేశాన్ని రక్షించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాఖీ పండగను పురస్కరించుకుని ఎస్‌జీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుధాకర్ గాంధే సురక్ష భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలను ఆదివారం ఉప్పల్‌లోని శిల్పారామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగారాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గౌరవ అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, వక్తలుగా వనవాసి కళ్యాణ ఆశ్రమం కమిటీ సభ్యులు, రాష్ట్ర సంఘటన కార్యదర్శి జాతీయ సాహిత్య పరిషత్, ఎం. సూర్యనారాయణ మూర్తి, ప్రముఖ కవి, ఆధ్యాత్మిక, సామాజిక విశ్లేషకులు భాస్కర్ యోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌జీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుధాకర్ గాంధే మాట్లాడుతూ.. మన పండుగలను, మన సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించుకోవడం మన కర్తవ్యంగా భావించాలన్నారు. మహాభారతంలో శ్రీకృష్ణుడు, ద్రౌపది మధ్య బంధం గురించి, ద్రౌపదిని కృష్ణుడు రక్షించాడనేది మనకు చరిత్ర తెలుపుతుందన్నారు. రక్షా బంధన్ రక్తసంబంధీకులకే కాకుండా స్నేహితులు, బంధువులు, పొరుగువారికి కడుతూ మనమంతా ఒక్కటే అనే సందేశాన్ని అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీ ఫౌండేషన్, సురక్ష భారత్ ఫౌండేషన్ నిర్వాహకులు గిరివర్ధన్ రెడ్డి, గడ్డం సాయి కిరణ్, సత్యనారాయణ,వెంకటరెడ్డి, డా. లోకేష్ వేముల, సుధాకర్, సుదర్శన్ రెడ్డి, కటుకూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లిలో విశ్వకర్మ ధ్యాన మందిర భవనం ప్రారంభం



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి గ్రామంలో విశ్వబ్రాహ్మణుల విశ్వకర్మ సంక్షేమ సంఘ భవనం, విశ్వకర్మ ధ్యాన మందిరాన్ని రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు డాక్టర్ వేములవాడ మదన్మోహన్ ఆచార్య, నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డిలు ఆదివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటోజు శంకరాచారి, ప్రధాన కార్యదర్శి గట్టోజు రాము, ఉపాధ్యక్షుడు జి.ఆనంతా చారి, కోశాధికారి నూకలమర్రి రాజేందర్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు హాజరైన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌లో ఆదివారం నిర్వహించిన బోనాల పండుగకు చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచమ్మ, మైసమ్మ, ఉప్పలమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్ రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, వినోద్ సారా,గంప కృష్ణ,గోపాల్ యాదవ్, రాకేష్, శ్యామ్ మార్కెట్ అసోసియేషన్ సభ్యులు, బెల్లం కృష్ణ, దూడల మహేష్, రాములు నాయక్, ఆంజనేయులు గుప్తా, పుట్టా రవీందర్, రవి నాయక్, సూర్య కుమార్, యాదగిరి, రమేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదతరులు పాల్గొన్నారు.

రక్షా బంధన్ అంటే సంరక్షణ బంధం

- ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్



నవతెలంగాణ-ముషీరాబాద్

'రక్షా బంధన్ అంటే సంరక్షణ బంధం' అని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డా హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. మహిళలను గౌరవించి, రక్షించే వారికి శుభాకాంక్షలు తెలిపారు. రక్షా బంధన్ సమాజంలో అత్యంత ప్రసిద్ధ పండుగలలో ఒకటిని తెలిపారు. మనుషులు మధ్య సంబంధాన్ని తెలిపే రోజుగా జరుపుకుంటారన్నారు. ఆంగ్లంలో 'రక్షా బంధన్ అంటే రక్షణ, బాధ్యత లేదా సంరక్షణ బంధం' అని అంటారన్నారు. డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్ ఎస్సీ బాలికల హాస్టల్లో స్వాతంత్ర్యం దినోత్సవ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు లియో హిమకర్, లయన్ డా.హిప్నో పద్మా కమలాకర్, దుస్తులు, పుస్తకాలు, పోషకాహారం, బహుమతులు అందజేసి రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఐక్యత, ప్రేమను తెలిపేదే రాఖీ అన్నారు. ఒకరికొకరు మధ్య ఉండే లోతైన ప్రేమకు రక్షణ ప్రతీకగా ఇది ప్రాముఖ్యతను కలిగి ఉందన్నారు. తోబుట్టువుల మధ్య బంధాన్ని బలోపేతం చేయడమే కాకుండా కుటుంబంలో ఐక్యత, ప్రేమ, గౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. రక్షా బంధన్ హద్దులు దాటి, కుటుంబాలను ఒకచోట చేర్చి, బంధం ప్రాముఖ్యతను పటిష్టం చేస్తుందని చెప్పారు. 1905లో బెంగాల్ విభజన సమయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ బెంగాల్‌లోని హిందువులు, ముస్లింల మధ్య ఐక్యత, ప్రేమ భావాన్ని కలిగించడానికి రాఖీ మహోత్సవ్ - సామూహిక రక్షా బంధన్ పండుగను ప్రారంభించారన్నారు. వర్గాల మధ్య చిచ్చు పెట్టే బ్రిటిష్ వారి ప్రయత్నాలకు ప్రతిగా ఆయన ఈ సంప్రదాయాన్ని ప్రారంభించారని తెలిపారు.

మగపిల్లలు ఎలా ఉంటారు, వారితో ఎలా మెలగాలో చిన్న చిన్న టేక్నిక్స్ ద్వారా హిమకర్ వివరించారు. హాస్టల్లో హెడ్ భానుప్రియ విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూ వెంకటేశ్వర కాలనీ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీ నూతన కమిటీని కాలనీవాసులు సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షులుగా బుద్ధి నరసింగరావు, జనరల్ సెక్రటరీ గోవర్ధన్ గౌడ్, గౌరవ అధ్యక్షులుగా రామకృష్ణ చారిని ఎనుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నరసింగరావు మాట్లాడుతూ కాలనీవాసులు నాపై నమ్మకం ఉంచి మూడో సారి అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞత లు తెలిపారు. కాలనీ సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానన్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వధూవరులను ఆశీర్వదించిన స్కూల్ ఎడ్యుకేషన్ నేతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ సూపరిటెండెంట్ సుగుణా రెడ్డి కుమారుడు శ్రీనివాస్ వివాహం ఆదివారం నాచారం మల్లాపూర్ నోమ కల్యాణ వేదికలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు టాస్ జాయింట్ డైరెక్టర్ సోమిర రెడ్డి, ఆర్జేడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ శాస్త్రి, టీఎస్జీవోస్ జిల్లా సహాధ్యక్షుడు, యూనిట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డితో పాటు వారి కార్యవర్గం హాజరై నూతన వధూవరులు శ్రీనివాస్, శావ్య వర్ధినిలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. సుదర్శన్, జి.రవి కుమార్, విజయలక్ష్మి, శ్రీకాంత్, సరళా రెడ్డి(రిటైర్డ్), రాణి, హేమావతి, లక్ష్మిపతి, అనిల్, శివజ్యోతి రెడ్డి, చైతన్య, విజయకుమార్, సుబ్బరావు, సర్పరాజ్, శంకర్ నూతన వధువరులను ఆశీర్వదించారు.

ఎస్సీఈఆర్టీ గన్‌ఫ్రాండీలో బోనాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్సీఈఆర్టీ గన్‌ఫ్రాండీలోని దుర్గామాత ఆలయ ప్రాంగణంలో బోనాలు పండుగను ఘనంగా జరుపుకున్నారు. రవీందర్, లక్ష్మన్, సాయి, ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన బోనాల జాతరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్, ఆర్జేడీఎస్ఈ హైదరాబాద్ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ శాస్త్రి, టీఎస్జీవోస్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్‌కుమార్, సుదర్శన్, జి.రాజ్‌కుమార్, సుబ్బరావు, తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గెస్ట్ లెక్చరర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థ మాసాబ్ ట్యాంక్ హైదరాబాద్‌లో బీఎడ్, ఎంఎడ్ కోర్సులకు పూర్తిగా తాత్కాలిక పద్ధతిపై బోధించడానికి గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్ మాసాబ్ ట్యాంక్ ప్రిన్సిపల్ ఎ.ఉషారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలాసఫీ లెక్చరర్, సైకాలజీ లెక్చరర్, సోషలాజీ లెక్చరర్, రీసెర్చ్ మెథడాలజీ లెక్చరర్, స్టాటిక్స్‌లో లెక్చరర్, ఇంగ్లీష్ లెక్చరర్, ఐసీటీ/ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో లెక్చరర్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో లెక్చరర్, విజువల్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో పూర్తిగా తాత్కాలిక పద్ధతిపై బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని, అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎంఈడీలో కనీసం 55శాతం మార్కులు సాధించి ఉండాలని, బోధన మాధ్యమం ఆంగ్లం ఉంటుందని తెలిపారు.

అర్హులైన అభ్యర్థు లు తమ విద్యార్హతల జిరాక్స్ కాపీలతో ఈనెల 21 సాయంత్రం 4.30 గంటల వరకు గవర్నమెంట్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ) మాసాబ్ ట్యాంక్‌లో తమ దరఖాస్తులను అందజేయాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్-9963119534పై సంప్రదించాలన్నారు.

నవతెలంగాణ
సోమవారం 19 ఆగస్టు 2024
మానవి
www.navatelangana.com
హైదరాబాద్



రాఖీ, రక్షా బంధన్, రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి అని కూడా పిలుస్తారు. తోబుట్టువులచే రక్షాబంధనాన్ని పొందడం సంప్రదాయంగా వస్తున్నది. భారతీయ కుటుంబ బాంధవ్యాలలోని మాధుర్యానికి ఇది చిహ్నం. అందులోనూ అక్కాచెల్లెళ్ళకు అన్నదమ్ముల అనురాగం జీవితాంతం ఉండవలసిన బంధం అని గుర్తు చేసే పర్వదినం. ఇంటి ఆడపడుచును అప్యాయంగా చూసుకోవాలని దీని భావన. సోదరిచేత కట్టించుకున్న రక్షాబంధనం వారిద్దరి మధ్య ఇమిడి ఉన్న ప్రేమా, అనురాగాలకు ప్రతీక. ఒక రకంగా చెప్పాలంటే కుటుంబ సంబంధాలకు ఈ పండుగను ఓ గుర్తుగా చెప్పకోవచ్చు. అందుకే ఈ రక్షా బంధన్‌కు అంతటి ప్రాధాన్యం.

సోదర ప్రేమకు ప్రతీక రాఖీపౌర్ణమి...

సోదర సోదరీమణుల మధ్య ఆత్మీయతా అనుబంధం పెంచేది ఈ రాఖీ పండుగే. సోదరీమణులు తమ సోదరులను ఇంటికి ఆహ్వానించి, నొసట కుంకుమ దిద్ది, హారతినిచ్చి, వారి కుడి చేతికి రక్ష కడతారు. సోదరులు అక్షింతలు వేసి తమ సోదరిని ఆశీర్వదించి ఆమెకు కానుకలు అందిస్తారు. సోదరి తన సోదరునకు పిండివంటలు పెట్టి తృప్తిగా వడ్డిస్తుంది. అలాగే ఎలాంటి ఆపద వచ్చినా ఒకరికి ఒకరు అండగా వుంటామని, రక్షణగా నిలుస్తామని ప్రతిన పూనే సమైక్య భావ నిలయమే ఈ పండుగ.

ఇల్లంతా సందడిగా...

రాఖీ పండుగని మొదట్లో ఉత్తర భారత దేశంలో ఎక్కువగా జరుపుకునేవారు. కాల క్రమేణా దేశవ్యాప్తంగా జరుపుకోవడం ప్రారంభించారు. సొంత సోదరులు లేకపోయినా బంధువులలో సోదర వరుస అయ్యే వారికి, సోదర భావంతో చూసేవారికి రాఖీ కట్ట వచ్చు. రాఖీ పండుగను ఉత్తర భారత దేశంలో ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఈ పండగకు ధనిక, పేద అనే బేధ భావం లేదు. అందరూ సమానమే. ప్రేమ, ఆప్యాయత ఉంటే చాలు. అక్క చెల్లెల్లు సుఖ సంతోషాలతో ఉండాలని సోదరులు, తమ సోదరుల ప్రేమ ఆప్యాయతలు చిరకాలం ఇలాగే ఉండాలని, వారు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని సోదరీమణులు మనసారా కోరుకుంటారు. సోదరులు ఇచ్చిన కానుకలను ఎంతో సంతోషంగా స్వీకరించి వారి మంచిని కోరుకుంటారు. ఇది సోదరి పట్ల సోదరులకుండే ప్రేమకు చిహ్నం. ప్రతి రోజూ పని ఒత్తిడిలో బిజీగా గడిపే అన్న చెల్లెళ్ళు, అక్క తమ్ముళ్ళు ఈ రోజు ఒక దగ్గరకు చేరుకుంటారు. ఇల్లంతా సందడితో నింపి సంబరంగా రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు.

- పాలపర్తి సంధ్యా రాణి

తమ్ముడితో ఎన్నో జ్ఞాపకాలు



డా.సరళ కుమారి
ప్రముఖ కూచిపూడి నాట్య గురువు



శ్రీనివాసరావు

మా నాన్న కే.శే.రంగారావు. ఆయన కలెక్టర్‌గా చేసి పదవీ విరమణ పొందారు. అమ్మ పద్మావతి. మా స్వగ్రామం విజయవాడ. నాకు ఒక అక్క, ఒక తమ్ముడు ఉన్నారు. తమ్ముడు నాకంటే నాలుగేండ్లు చిన్న. పేరు శ్రీనివాసరావు. నాకు తమ్ముడితో అనుబంధం ఎక్కువ. చిన్నప్పుడు ఇద్దరం కలిసి ఆడుకునే వాళ్ళం, చదువుకునే వాళ్ళం. వాడు చిన్నవాడు కావడం వల్ల నేను వీపు మీద వాడిని ఉప్పెక్కించుకొని తిప్పుతూ ఉండేదాన్ని. ఒకసారి చిన్నప్పుడు వాడిని పలకతో తల మీద కొట్టాను. ఎందుకు కొట్టాను అంటే వాడు గేటు పట్టుకొని ఊగుతున్నాడు. ఎన్నిసార్లు పిలిచినా రాలేదు. దాంతో నా దగ్గర చేతిలో ఉన్న పలకతోటి తల మీద ఒక్కటి కొట్టాను. దాంతో తలపై గాయం అయ్యి హాస్పిటల్‌కి తీసుకెళ్లి కట్టు కట్టించాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పుడు మా అమ్మ నన్ను బాగా కోపడ్డారు. మొదట కోపంతో కొట్టినా తర్వాత చాలా బాధపడ్డాను.

నేను డాన్సర్ కాబట్టి ఎప్పుడూ ఏదో ఒక ప్రోగ్రామ్‌కి వెళుతుండేదాన్ని. నాకు తోడుగా ఎప్పుడూ నాతో పాటు తమ్ముడు వచ్చేవాడు. ఇంట్లో వాళ్ళు ఒంటరిగా ఎక్కడికి పంపేవారు కాదు. నేను దేశ విదేశాల్లో ఎక్కడ నృత్య ప్రదర్శన ఇచ్చినా తమ్ముడు కచ్చితంగా నాతో ఉండేవాడు. నాతో పాటు తను మాస్కో వచ్చి దాదాపు నెల రోజులపాటు అక్కడే ఉన్నాడు. అక్కడ ఉన్నన్ని రోజులు తను నా విషయంలో చాలా చాలా శ్రద్ధ తీసుకున్నాడు. ఒకసారి ప్రోగ్రాం నిమిత్తం ఊటీ వెళ్ళినప్పుడు అక్కడ రామానాయుడు సినిమా షూటింగ్ జరుగుతోంది. అందులో చిరంజీవి హీరో. ఆ షూటింగ్ జరుగుతున్న సమయంలో తమ్ముడు ఫ్లాష్ కెమెరాతో ఒక ఫొటో తీశాడు. ఫ్లాష్ పడటం వల్ల ఆ షూట్ పనికిరాదని చెప్పి, మళ్ళీ రీ షూట్ చేయవలసి వచ్చింది. ఆ సమయంలో నేను మా తమ్ముడిని చాలా కోప్పడ్డాను. 'ఫొటో కావాలంటే వాళ్ళు షూటింగ్‌లో లేనప్పుడు తీసుకోవాలి అంతే కానీ ఇలా చేసి వారిని ఇబ్బంది పెట్ట కూడదు' అన్నాను. ఊటీలో ఉన్నన్ని రోజులు బాగా తిరిగాము. అక్కడ గ్రౌండ్లో గోల్ఫ్ ఆడే వాళ్లం. ఇలాంటి జ్ఞాపకాలు తమ్ముడితో ఎన్నో ఉన్నాయి.

మా తమ్ముడు వంట చాలా బాగా చేస్తాడు. అమ్మ ఎప్పుడూ 'వాడు చేసినట్టు వంటలు మీరు ఎవ్వరూ చేయలేరు' అంటుంటుంది. ముఖ్యంగా నాన్ వెజ్ చాలా బాగా చేస్తాడు. ఎప్పుడు మా ఇంటికి వచ్చినా ఒట్టి చేతులతో రాడు. ఏదో ఒకటి వండి తీసుకొస్తాడు. మా ఇంటికి ఓ పది నిమిషాల దూరంలోనే తను ఉంటాడు. నాకు దగ్గరలో ఉండాలని ఇల్లు కట్టుకున్నాడు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం వచ్చి చూసి వెళ్తుంటాడు. అంత అభిమానం నేనంటే. మా పిల్లలు వచ్చినప్పుడు వాళ్లకి ఇష్టమైనవన్నీ కొని పెట్టడం, వండి పెట్టడం చేస్తుంటాడు. వాళ్ళ కోసం తిను బండారాలు తీసుకొచ్చి ఫ్రిజ్ నిండా నింపేస్తూ ఉంటాడు. నాకూ, తమ్ముడికి ప్రకృతి అంటే చాలా ఇష్టం. అందుకని మేము ఇంట్లో వాళ్లకు తెలియకుండా అప్పుడప్పుడు లాంగ్ డ్రైవ్‌కి వెళ్ళిపోతూ ఉండేవాళ్ళం. వెళ్లి వచ్చిన తర్వాత చెప్పేవాళ్ళం. తమ్ముడు కొన్ని రోజులు వైజాగ్‌లో జాబ్ చేశాడు. ఆ సమయంలో ఆ చుట్టుపక్కల ఉన్న అడవుల్లోకి వెళ్లేవాళ్లం. అక్కడ నాలుగు రాళ్లు పెట్టుకొని వంట చేసుకుని తినటం, అడవిలోకి వెళ్లి తిరిగి రావడం చేసేవాళ్ళం. అమ్మకు తెలిసి బాగా కోప్పడే వారు. 'వాడిది అసలే రాష్ డ్రైవింగ్, ఎందుకు వెళ్లావు' అంటూ ఉండేవారు. ఇలా తమ్ముడితో ఎన్నో ఎన్నో మధుర జ్ఞాపకాలు తనతో. ఇప్పుడు ఇద్దరం పెద్ద వాళ్ళం అయిపోయాము. అయినా మా మధ్య ప్రేమా, అప్యాయత ఏ మాత్రం తగ్గలేదు. ప్రతి ఏడాది కచ్చితంగా రాఖీ కడతాను. అన్ని విషయాల్లో తమ్ముడు నాకు అండగా నిలడతాడు. ఇలాంటి తమ్ముడు దొరకడం నిజంగా నా అదృష్టం. మా అనుబంధం ఎప్పుడు ఇలాగే ఉండాలని ఆకాంక్షిస్తూ...

కచ్చితంగా ఈ టెస్టులు చేయించుకోవాలి...

ఎంత ఆరోగ్యంగా ఉన్నా రెగ్యులర్ హెల్త్ చెకప్ చేయించుకోవడం ముఖ్యం. వీటి కారణంగా ఫ్యూచర్‌లో ఎలాంటి సమస్యలు రాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఉదాహరణకి.. మీకు బీపి ఉందో లేదో తెలుసుకోవడానికి రెగ్యులర్‌గా చెకప్ చేసుకోవాలి. దీని వల్ల షుగర్ లెవల్స్ పెరగడం, కొలెస్ట్రాల్ పెరగడం వంటి సమస్యల్ని మొదట్లోనే గుర్తించొచ్చు. మొదట్లో ఎలాంటి లక్షణాలను కనిపించవు. అయితే, సాధారణ రక్త పరీక్ష ద్వారా దీనిని గుర్తించొచ్చు. ముఖ్యంగా ఆడవారు కొన్ని టెస్టులు చేయించుకోవాలి.



కొలొరెక్టల్ క్యాన్సర్..

40 ఏళ్ళ తర్వాత, కొలొరెక్టల్ క్యాన్సర్‌ని గుర్తించటానికి రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలి. ఇందులో సిగ్మోయిడోస్కోపీ, కోలనోస్కోపీ టెస్టులు ఉంటాయి. మీకు ఇన్‌ఫ్లమేటరీ ప్రేగు వ్యాధి, పాలిప్స్ చరిత్ర వంటి ప్రమాద కారకాలు ఉంటే స్క్రీనింగ్ చేయించుకోవాలి.

బీపి, కొలెస్ట్రాల్ టెస్ట్..

గుండె ఆరోగ్యంగా ఉందో లేదో తెలుసుకోవడానికి బీపి, కొలెస్ట్రాల్ టెస్టులు చేయించుకోవాలి. ఎందుకంటే వయసు పెరిగే కొద్దీ గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఈ వ్యాధి ప్రమాదాన్ని తగ్గించేందుకు కొలెస్ట్రాల్ టెస్టు చేయాలి.

బోన్ డెన్సిటీ టెస్ట్..

దీనినే ఎముక సాంద్రత స్కాన్, DEXA స్కాన్ అని కూడా చెబుతారు. ఇది ఎముకలలోని కాల్షియం, ఇతర ఖనిజాల గురించి తెలుసుకునే ఎక్స్‌రే టెస్ట్. దీని ద్వారా ఎముకల బలం, మందాన్ని తెలుసుకోవడానికి సాయపడుతుంది. వయసు పెరిగే కొద్దీ ఎముకల్లో బలం తగ్గుతుంది. 30 నుంచి 40 ఏళ్ళలోపు ఆడవారు బోన్ డెన్సిటీ టెస్ట్ చేయించుకోవాలి. దీని వల్ల బోలు ఎముకల సమస్య ప్రమాదం తగ్గుతుంది.

డయాబెటీస్ టెస్ట్..

డయాబెటీస్ స్క్రీనింగ్ ముఖ్యం. ఎందుకంటే, అధికబరువు, షుగర్ వచ్చే ప్రమాదం వయసుతో పాటు పెరుగుతుంది. 35 ఏళ్ళ వయసులో డయాబెటీస్ టెస్ట్ చేయించుకోవాలి. ఆ తర్వాత 3 సంవత్సరాలకి చేయించుకోవాలి. మీకు డయాబెటిస్‌కి ఇతర ప్రమాద కారకాలు ఉంటే స్క్రీనింగ్ ముందుగానే చేసుకోవాలి. అధికబరువు ఉంటే, అధిక రక్తపోటు, ప్రీడయాబెటీస్, గుండె జబ్బుల చరిత్ర ఉంటుంది. మీరు ప్రెగ్నెంట్ కావాలనుకుంటే అధికబరువు, హైబీపి, ఇతర ప్రమాద కారకాలు ఉన్నట్లైతే డయాబెటిస్ స్క్రీనింగ్ ముందుగానే చెక్ చేయాలి.

బ్రెస్ట్ క్యాన్సర్ టెస్ట్..

40 సంవత్సరాల వయసు నుండి ఆడవారు బ్రెస్ట్ క్యాన్సర్ టెస్ట్ చేయించుకోవాలి. ప్రతి సంవత్సరం, రెండు సంవత్సరాలకి ఓ సారి మామోగ్రామ్ చేయించుకోవాలి. వారి కుటుంబంలో ఇప్పటికే క్యాన్సర్ ఉంటే వారు ముందునుంచీ జాగ్రత్తగా ఉండాలి. 30 ఏళ్ళు పైబడిన వారు 3, 4 నెలలకోసారి బ్రెస్ట్ సెల్ఫ్ టెస్ట్ చేయించుకోవాలి. స్త్రీ గైనకాలజిస్ట్‌తో బ్రెస్ట్ టెస్ట్ 20 నుంచి 35 సంవత్సరాల మధ్య ప్రతి 3 సంవత్సరాలకి, 35 తర్వాత సంవత్సరానికి ఓ సారి చెక్ చేసుకోవాలి.

చదువంటే సమాజాన్ని సంస్కరించే జ్ఞానం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాపంచిక జ్ఞానం పెంపొందించుకునే దిశగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొద్దస్తమానం చదువు..చదువు..అని పిల్లలను ఇబ్బంది పెట్టకూడదనీ, చదువుతో పాటు ఇతర యాక్టివిటీల్లోనూ పాల్గొనేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రోజూ ఏదో ఒక కొత్త అంశాన్ని నేర్పాలని సూచించారు. అప్పుడే పిల్లలు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారని చెప్పారు. జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లలు చెడిపోవడం ఖాయమని హెచ్చరించారు. ఫెయిల్ అయ్యామని కొందరు పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఓటమిని గెలుపునకు పునాదిగా మలుచుకునేలా పిల్లలను తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. సంస్కృతి అంటే జీవన విధానమనీ, నేడు సమాజంలో ఆ జీవన విధానం ధ్వంసమైపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా అనేక అనర్థాలు జరిగిపోతున్నాయని వాపోయారు. అన్ని రంగాల్లో, అన్ని వర్గాల్లో సంస్కృతి చిన్నాభిన్నమైందని వాపోయారు. సమాజం ఇలా కావడానికి మనమే కారణమని ఎత్తిచూపారు. సృష్టిలో మానవ జన్మ అనేది ఉత్కృష్టమైనదన్నారు. ఆలోచన అనేది మనిషికే ఉందనీ, ఇతర జీవులకు అది లేదని చెప్పారు. స్కూళ్ళు, కాలేజీల్లో డ్రగ్స్, చెడు అలవాట్లకు విద్యార్థులు, యువకులు గురికావడం సమాజానికి శ్రేయస్కరం కాదన్నారు. జీవితానికి సార్థకత ఉండాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. ఏ పనిచేసేటప్పుడైనా మనకుమనం ప్రశ్నించుకోవాలనీ, అప్పుడే మన నిర్ణయాలు సరిగా ఉంటాయని చెబుతూ పలు ఉదహరణలను వివరించారు. రాష్ట్రంలో రకరకాల కళలున్నాయనీ, సినిమాలతో అవి మరుగున పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని ప్రోత్సహిస్తున్న బాలోత్సవం కమిటీని మనస్పూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. కళారూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని నొక్కి చెప్పారు. పిల్లలకు ధైర్యసాహసాలు, వినయవిధేయతలు, కళలు, ఆటపాటలు నేర్పాలని కోరారు. అమెరికా లాంటి దేశాల్లో వారానికి రెండు రోజులు టూర్లకు వెళ్తారనీ, మనదగ్గర అది లేదని చెప్పారు. నెలలో ఒక్కరోజైనా తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని కొత్త ప్రాంతానికి వెళ్లాలనీ, ఆ ప్రాంత విశేషాలను పిల్లలకు చెప్పాలని సూచించారు. టూరిజాన్ని ప్రోత్సహించడం వల్ల ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు. రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ కె.వి.రమణా చారి మాట్లాడుతూ..పిల్లలు నిరంతం ఉత్సాహంగా, ఉత్తేజంగా ఉండేందుకు బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. పిల్లలు చిన్నప్పుడు వేసిన నాటికలు వారి జీవితాన్ని తీర్చిదిద్దడంతో దోహదపడుతాయని చెప్పారు. పిల్లలు భవిష్యత్తులో ఎదిగితేందుకు ఒక ప్రణాళిక ఉండాలనీ, అందులో తల్లిదండ్రుల పాత్ర కీలకమని చెప్పారు. చదువుకుంటే పుస్తకాల్లో ఉండేది మాత్రమే తెలుస్తుందన్నారు. పిల్లలకు ప్రాపంచిక జ్ఞానం కూడా అవసరమనీ, అది భవిష్యత్తులో మెరుగైన జీవనానికి దోహదపడుతుందని చెప్పారు. 32 సంస్థల వాళ్లు ఆనందకరంగా కార్యక్రమం నిర్వహించడం బాగుందన్నారు. రమణిసిద్ధి, పరాశరం, రేణుకాప్రభాకర్, భావనాదీప్తి, రోహిణి.కె, శ్రీనివాస్, రాజేశ్వర్, మిగతా గురువులందరికీ శిరస్సు వహించి నమస్కరించారు. తెలంగాణ బాలోత్సవం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు తన వంతుగా పెన్షన్ నుంచి రూ.25 వేలు ఇస్తున్నట్టు సభా వేదిక నుంచి ప్రకటించారు. బాలోత్సవం ఉపాధ్యక్షులు సుజావతి మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రజాపాటకు నృత్యనీరాజనం, ప్రపంచ డ్యాన్స్ దినోత్సవం, జనగణమన జయకేతనం వంటి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. బాలోత్సవం కార్యక్రమానికి గురువుల సహకారం మరువలేనిదని కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ఎస్వీకే మేనేజింగ్ ట్రస్టు కార్యదర్శి ఎస్.వినయకుమార్, నృత్యగురువు హిందులత, ఉపాధ్యక్షులు మమత, రూపారుక్మిణి, ఎస్వీకే నిర్వాహకులు బుచ్చిరెడ్డి, నృత్యగురువు పరాశరం తదితరులు పాల్గొన్నారు.

మీ డేటా నా దగ్గరుంది

(మొదటిపేజీ తరువాయి)

మెయినాబాద్, మహేశ్వరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో మహిళలపై సామూహిక లైంగిదాడులను ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో సంచార జాతి మహిళపై లైంగిక దాడి, హత్య కేసు ఏమైందని అడిగారు. వీటితో పాటు పలు లైంగికదాడుల ఘటనలను తెలిపారు. వీటన్నింటిపై తాము కూడా మహిళా కమిషన్‌ను కలుస్తామనీ, బీఆర్ఎస్ పాలనలో మహిళలపై ఎన్ని నేరాలు జరిగా యో నివేదిస్తామని చెప్పారు. కావాలని మహిళలను అలా అనలేదంటూ నే ఆ పార్టీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ తిట్టిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ రుణమాఫీని చేయలేకపోయిందనీ, తాము చేస్తే ఎందుకు అంత అక్కసు అని ప్రశ్నించారు.

హత్యాచారం కేసులో కదలిక

(మొదటిపేజీ తరువాయి)

బెంచ్ దీనిపై మంగళవారం విచారణ జరుపుతుంది. కోల్‌కతా ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) దేశవ్యాప్తంగా 24 గంటల బంద్ పాటించింది. ఇదిలావుండగా ఘటన జరిగిన కోల్‌కతా ఆర్జీ కార్ వైద్య కళాశాల ఆస్పత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను సీబీఐ అధికారులు వరుసగా మూడో రోజు ప్రశ్నించారు. ఘోష్ కాల్ రికార్డులు సేకరించేందుకు సీబీఐ ప్రయత్నిస్తోంది. ఆయనను శనివారం సుమారు 13 గంటల పాటు విచారించిన సీబీఐ, ఆదివారం కూడా ప్రశ్నించింది. లైంగికదాడి, హత్యకు గురైన మహిళా వైద్యురాలిపై వదంతులు వ్యాపింపజేసినందుకు, ఆమె గుర్తింపును బయటపెట్టినందుకు కోల్‌కతా పోలీసులు బీజేపీ మాజీ ఎంపీ లాకెట్ ఛటర్జీకి, మరో ఇద్దరు ప్రముఖ వైద్యులకు సమన్లు జారీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన మరో 57 మందికి కూడా సమన్లు జారీ అయ్యాయి. కాగా 42 మంది సీనియర్ వైద్యులను బదిలీ చేస్తూ ఇచ్చిన ఆదేశాలను బెంగాల్ ప్రభుత్వం రద్దు చేసింది. నిరసన తెలుపుతున్న వైద్యుల నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

ఆదివారం కొనసాగిన ఆందోళన

ఆర్జీ కర్ మెడికల్‌లో హత్యాచారానికి గురైన మహిళా వైద్యురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు.వర్షంలోనూ పోస్టర్లు, బ్యానర్లతో ప్రదర్శనలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో వరుసగా పదో రోజైన ఆదివారం కూడా హెల్త్‌కేర్ సేవలు నిలిచిపోయాయి. "మేం ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రభావితం చేయడం కోసం కాదు. రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మేము అర్థం చేసుకోగలము, అయితే డ్యూటీ డాక్టంపైనే హత్యాచారం జరిగితే..మాకు రక్షణ ఎవరని వైద్యులు ప్రశ్నిస్తున్నారు. మా సోదరికి న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగుతుంది. అని వారు తెలిపారు. నిందితులను వీలైనంత త్వరగా శిక్షించాలని, బాధితురాలి పోస్ట్‌మార్టం నివేదికను బహిర్గతం చేయాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.

మూడో రోజూ సీబీఐ విచారణ..

హత్యాచారం కేసులో విచారణకు సంబంధించి వరుసగా మూడో రోజు విచారణ నిమిత్తం తమ ముందు హాజరుకావాల్సిందిగా రాష్ట్ర ఆధీనంలోని ఆర్జీ కర్ మెడికల్ అండ్ కాలేజ్ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను సీబీఐ అధికారులు కోరారు. దాదాపు 13 గంటల పాటు విచారణ జరిపాక.. ఘోష్‌ను ఆదివారం ఉదయం మళ్లీ విచారణకు పిలిపించారు. డాక్టర్ మరణం తర్వాత.. ఘోష్ ఏం చేశారు..? ముందుగా ఎవరిని సంప్రదించారు. తల్లిదండ్రులను దాదాపు మూడు గంటల పాటు ఎందుకు వేచి ఉండేలా చేశారు..ఇలాంటి ప్రశ్నలను సీబీఐ అధికారులు సంధించారు.దీంతో పాటు ఘటనానంతరం ఆస్పత్రిలోని అత్యవసర భవనంలో ని సెమినార్ హాల్‌కు సమీపంలో ఉన్న గదులను పునరుద్ధరించేందుకు ఎవరు ఆదేశించారని మాజీ ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించా రు. "నేరానికి ఏదైనా కుట్ర లేదా ముందస్తు ప్రణాళి క ఉందా? అని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తు న్నామని సీబీఐ అధికారులు పేర్కొన్నారు.

ప్రయివేటు ఐఏఎస్‌లు!

(మొదటిపేజీ తరువాయి)

అతి పెద్ద డ్రైవ్ కావటం గమనార్హం.

నో రిజర్వేషన్

ఈ పథకానికి సంబంధించిన అతి పెద్ద అవరోధం రిక్రూట్ అయ్యే పోస్టులకు రిజర్వేషన్‌ను వర్తింపజేయకూడదనే ప్రభుత్వ నిర్ణయం. ఈ పథకం కింద భర్తీ చేయాల్సిన ప్రతి పోస్ట్ ఒకే పోస్ట్ అయినందున రిజర్వేషన్ వర్తించదు. కాగా, కేంద్రం విడుదల చేసిన ప్రకటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎక్స్ వేదికగా స్పందించారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన బీజేపీ రిజర్వేషన్లపై డబుల్ దాడి చేసిందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తరగతులను రిజర్వేషన్‌లకు దూరంగా ఉంచేందుకు బీజేపీ ఉద్దేశపూర్వకంగానే ఒక ప్రణాళికాబద్ధమైన కుట్రతో ఉద్యోగాలలో ఇటువంటి నియామకాలు చేస్తున్నదని ఆరోపించారు. ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ కూడా ఎక్స్ పోస్ట్‌లో ఈ చర్యను రాజ్యాంగంపై "డర్టీ జోక్" అని అభివర్ణించారు. 2021లో, నేషనల్ కమీషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఎన్‌సీబీసీ) కూడా లేటరల్ ఎంట్రీలలో రిజర్వేషన్లు లేకపోవటం గురించి అంతర్గతంగా ప్రశ్నలను లేవనెత్తింది.

బ్యాక్‌డోర్ నియామకాలు : ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్

బ్యాక్‌డోర్ ద్వారా తన సైద్ధాంతిక మిత్రులను ఉన్నత పదవులకు నియమించేందుకు బీజేపీ చేసే కుట్ర. బీజేపీ తన పార్టీ సిద్ధాంతాలకు సంబంధించిన అధికారులను ప్రభుత్వంలో నియమించడంతో ఏకపక్ష దోరణిని పూర్తి చేయాలని కోరుకుంటోంది. ఈ చర్యను కచ్చితంగా ఉపసంహరించుకోవాలి. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ అంశంపై అక్టోబర్ 2 నుంచి ఆందోళనలు చేపడతాం. ఈ పద్ధతితో యువత ఉన్నత పదవులకు చేరుకోవడానికి మార్గం మూసుకుపోతుంది. సామాన్య ప్రజలు కేవలం క్లర్కులు, ప్యూన్లకే పరిమితమవుతారు. వాస్తవానికి ఇది వెనుబడిన, దళిత, మైనారిటీ వర్గాల రిజర్వేషన్, వారి హక్కులను లాక్కోవడంలో భాగమైన ట్రిక్.

కీలకస్థానాల్లో ఆర్ఎస్సెస్ శక్తులను నింపే యత్నం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్ఎస్ఎస్ సిబ్బందిని నియమించే స్పష్టమైన ప్రయత్నం ఇది. అదే యూపీఎస్సీ సాధారణ ఎంపిక ద్వారా చేస్తే, 45 మందిలో కనీసం 23 మంది సమర్థులైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు ఉంటారు. మనుస్మృతి సామాజిక ఆదేశాన్ని అమలు చేయాటానికే మోడీ ఇటువంటి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఇప్పటికే ఉన్న ఉద్యోగుల అవకాశాలను సైతం దెబ్బతీస్తుంది.

యువత హక్కులను దోచుకోవడమే

(మొదటిపేజీ తరువాయి)

స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు. బ్యూరోక్రసీతో సహా దేశంలోని అన్ని అత్యున్నత పదవుల్లో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం ఉండటం లేదు. దాన్ని మెరుగుపరచకపోగా, లేటరల్ ఎంట్రీ పేరుతో ఉన్నత పదవులకు ఆయా వర్గాలను దూరం చేస్తున్నారు. ఇది యూపీఎస్సీ కోసం సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువత హక్కులను దోచుకోవడం. నిరుపేదలకు రిజర్వేషన్‌తో కూడిన సామాజిక న్యాయ భావనపై దాడి. నిర్ణయాత్మక ప్రభుత్వ పదవుల్లో కూర్చోవడం ద్వారా కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఏమి చేస్తారనే దానికి సెబీ ఒక స్పష్టమైన ఉదాహరణ. ప్రయివేట్ రంగానికి చెందిన వ్యక్తి మాధబి బుచ్‌ని సెబి చైర్‌పర్సన్‌గా నియమిస్తే ఏం జరుగుతుందో చూస్తూనే ఉన్నాం. పరిపాలనా నిర్మాణం, సామాజిక న్యాయం రెండింటినీ దెబ్బతీసే ఈ "దేశ వ్యతిరేక చర్య"ని ఇండియా ఫోరం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.

రైతు రుణమాఫీ 40 శాతమే

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించారు. తీరా మూడు విడతల రుణమాఫీ తతంగాన్ని రూ.17,933 కోట్లతో మమ అనిపించారు" అని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ గ్రామంలో చూసినా సగానికి పైగా అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ చెబుతున్నట్టు రూ. రెండు లక్షల రుణమాఫీ పూర్తయితే, లబ్దిదారుల సంఖ్యతోపాటు చెల్లింపు మొత్తం ఎందుకు రెట్టింపు కాలేదని ప్రశ్నించారు. అర్హులైన రైతులందరికీ వెంటనే రుణ మాఫీ చేయాలని కోరారు.

పర్యాటక కేంద్రాలుగా సర్వాయి పాపన్న కోటలు

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకొంటామని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి బూర వెంకటేశం మాట్లాడుతూ.. బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన పాపన్న.. శివాజీకి సమకాలికుడు అని అన్నారు. శివాజీ చరిత్ర ప్రసిద్ధి పొందిన విధంగా పాపన్న చరిత్ర ప్రాచుర్యంలోకి తేవాలని కోరారు. బీసీ జాతీయ నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పాపన్న జన్మించిన జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రేమ సాగర్ రావు, డాక్టర్ వకులాభరణం కృష్ణ మోహన్ రావు, పాపన్న ఉత్సవ కమిటీ చైర్మెన్ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రశ్నలకు బదులేది?

(మొదటిపేజీ తరువాయి)

వాటాలు కలిగినవి. ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ (ఇప్పుడు సమ్మాన్ క్యాపిటల్), ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్, ఏఎస్‌కే ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్, కేర్ హాస్పిటల్స్, ఎంఫసిస్ సహా పలు ప్రధాన కంపెనీలలో బ్లాక్‌స్టోన్ భాగస్వామి. బ్లాక్‌స్టోన్‌కు వాటాలు ఉన్న అన్ని కంపెనీల వ్యవహారాలలో మాధబి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నారా, ఆ జాబితాలో ఎన్ని బ్లాక్‌స్టోన్ కంపెనీలకు స్థానం లభించింది అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఇప్పటి వరకూ సెబీ కానీ, మాధబి కానీ ఆ జాబితాను బహిర్గతం చేయలేదు. బ్లాక్‌స్టోన్ అజమాయిషీలో ఉన్న ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐపీఓకు ఫిబ్రవరిలో సెబీ అనుమతి ఇచ్చింది. ఆ సమయంలో మాధబి సెబీ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. 2019 ఏప్రిల్-అక్టోబర్ మధ్యకాలంలో బ్లాక్‌స్టోన్ తన అనుబంధ సంస్థ అయిన ఎప్సిలాన్ బిడ్కో ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా ఎస్సెల్ ప్రోపాక్ లిమిటెడ్ (ఇప్పుడు ఈపీఎల్ లిమిటెడ్)లో 75 శాతం వాటాలు కొనుగోలు చేసింది. వీటిలో 51 శాతం వాటాలు అశోక్ గోయల్ ట్రస్ట్‌కు చెందినవే. ఈ ట్రస్టుకు చెందిన నాయకత్వ సలహా బోర్డులో అతుల్ గోయల్ సభ్యుడు. ఈపీఎల్‌లో ట్రస్టుకు ప్రస్తుతం 7.6 శాతం వాటాలు ఉన్నాయి. అయితే ఇప్పుడది పబ్లిక్ వాటాదారుగా పరిగణించబడుతోంది. 2019 జూలైలో మాధబి భర్త ధావల్ బచ్ సీనియర్ సలహాదారుగా బ్లాక్‌స్టోన్‌లో చేరారు. అతుల్ గోయల్, ఆయన కంపెనీ ఈ-సిటీ హై-టెక్ ప్రాజెక్ట్స్‌కు వ్యతిరేకంగా దాఖలైన ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసును 2021 ఆగస్ట్ 27న సెబీ హోల్‌టైమ్ సభ్యురాలిగా మాధబి పరిష్కరించారు. ఈ వ్యవహారాలన్నింటినీ పరిశీలిస్తే తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నానంటూ మాధబి బచ్ చేసిన వాదన ప్రశ్నార్థమవుతోందని 'ది మార్నింగ్ కాంటెస్ట్' పోర్టల్ తెలిపింది.

బీఆర్ఎస్ ఔట్‌డేటెడ్ పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్ పేరెత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఉందన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేల అవసరం కాంగ్రెస్‌కే ఉందని చెప్పారు. అవినీతి కూపంలో కూరుకుపోయిన బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం బీజేపీకి లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో రుణమాఫీ కాక రైతులు కాంగ్రెస్ దిష్టిబొమ్మలు తగలబెడుతుంటే కాంగ్రెస్ సర్కారుకు పట్టదా? అని ప్రశ్నించారు. రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను పక్కదోవ పట్టించేందుకే బీఆర్ఎస్ విలీన డ్రామాలను సీఎం రేవంత్‌రెడ్డి తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామా ఆడుతున్నాయన్నారు. 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 22 లక్షల మందికే మాఫీ చేస్తారా? మిగతావారి సంగతేంటి? అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో రూ.40 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారనీ, బడ్జెట్లో రూ.26 వేలు కేటాయించి చివరకు రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని విమర్శించారు.

యంగ్‌మెన్స్ ఇంప్రూవ్ మెంట్ సొసైటీ సేవలు చిరస్మరణీయం : బండి

పేదలకు విద్య, వైద్యంతో పాటు జాతీయవాదం, వ్యక్తిత్వ వికాసంపై యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు యంగ్ మెన్స్ ఇంప్రూవ్ మెంట్ సొసైటీ చేస్తున్న సేవలు చిరస్మరణీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని కోఠిలో యంగ్ మెన్స్ ఇంప్రూవ్ మెంట్ సొసైటీ భవన ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మత, వర్గాలు, సంఘాల పేరిట చీల్చే కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు శ్యామ్‌జీ, రామకృష్ణ పరమహంస మిషన్ నుంచి స్థితికంఠానంద స్వామీజీ, పద్మాకర్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



జానీ మాస్టర్‌కు ఘన సన్మానం

ఇటీవల ప్రకటించిన 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో 'తిరుచిత్రాంబలం' సినిమాలోని 'మేఘం కరుగత..' పాటకు జాతీయ ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా జానీ మాస్టర్‌కి అవార్డు లభించింది.

ఈ నేపథ్యంలో ఆదివారం ఆయనకు చిత్ర పరిశ్రమ ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్‌లో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో డ్యాన్సర్స్ అసోసియేషన్ నాయకులు, తెలుగు ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్ కుమార్ వల్లభనేని, ఫిలింఛాంబర్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్, నిర్మాతలు ప్రసన్నకుమార్, దామోదర ప్రసాద్, శేఖర్ మాస్టర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ వేడుకలో జానీ మాస్టర్ మాట్లాడుతూ – 'ప్రభుదేవా చేసిన 'వెన్నెలవే వెన్నెలవే' పాట నాకు చాలా ఇష్టం. ఆ పాటకు నేషనల్ అవార్డ్ వచ్చింది. ఇలాంటి పాట ఒకటి నేనూ చేయాలనే కలగనేవాడిని. ఆ అవకాశం ధనుష్ 'తిరుచిత్రాంబలం'తో నాకు దక్కింది. అక్కడ ఎంతోమంది కొరియోగ్రాఫర్స్ ఉన్నా ఈ పాటకు కొరియోగ్రాఫ్ చేసేందుకు నన్నే పిలిపించారు ధనుష్. ఆయనకు, 'తిరుచిత్రాంబలం' మేకర్స్‌కు థ్యాంక్స్ చెబుతున్నా. మేము ఇలాంటి విజయాలు సాధిస్తున్నాం అంటే అందుకు ముక్కురాజు మాస్టర్, డ్యాన్సర్స్ అసోసియేషన్ నాయకులు చేసిన కృషే కారణం. ఈ పెద్దలు వేసిన బాటలో మేమంతా నడుస్తూ ముందుకెళ్తున్నాం. మన మాస్టర్స్ ఎన్నో ట్రెండీ స్టెప్స్ క్రియేట్ చేస్తున్నారు. తెలుగు డ్యాన్స్ మాస్టర్స్‌కు బాగా అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించింది పవన్ కల్యాణ్. నాకు నేషనల్ అవార్డ్ రాగానే ఆయన అభినందిస్తూ, మెసేజ్ పంపారు. అది ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. నేను ఏది సాధించినా ఆ క్రెడిట్ నన్ను ప్రోత్సహించిన మా అమ్మా నాన్నలకే చెందుతుంది. నాపై మీరు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు' అని అన్నారు.

అల్లు అర్జున్ మా అన్నయ్య అని చెప్పే రోల్ చేశా..

రావు రమేష్ కథానాయకుడిగా రూపొందిన 'మారుతి నగర్ సుబ్రమణ్యం'లో ఆయన కుమారుడిగా అంకిత్ కొయ్య నటించారు. దర్శకుడు సుకుమార్ భార్య తబిత సమర్పణలో విడుదల అవుతున్న ఈ చిత్రాన్ని పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. ఈనెల 23న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అంకిత్ కొయ్య మీడియాతో పలు విశేషాలను పంచుకున్నారు.



- మాది విశాఖ. గీతం యూనివర్సిటీలో బీటెక్ చేశా. కాలేజీలో కల్చరల్ యాక్టివిటీస్‌లో పార్టిసిపేట్ చేశాను. అక్కడి నుంచి మెల్లగా యాడ్స్, సినిమాల్లోకి వచ్చాను. కాలేజీలో ఉండగా అల్లు అర్జున్‌తో ఓఎల్ఎక్స్ యాడ్‌లో నటించే అవకాశం వచ్చింది. ఆడిషన్ చూసి అల్లుఅర్జున్ స్వయంగా నన్ను ఎంపిక చేశారు.
- 'మజిలీ', 'జోహార్', 'అశ్వత్థామ', 'తిమ్మరుసు', 'శ్యామ్ సింగ రాయ్', 'సత్యభామ', రీసెంట్‌గా 'ఆయ్'తో పాటు ఇంకొన్ని సినిమాల్లో నటించాను. అలాగే రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లో కూడా వర్క్ చేశా. ఈ సినిమాలోని కొడుకు పాత్రకు ఇంద్రజ నన్ను సజెస్ట్ చేశారు. ఓ సినిమాలో మేం తల్లీకొడుకులుగా చేశాం. ఆ మూవీ ఇంకా విడుదల కాలేదు.
- దర్శకుడు సుకుమార్‌ని కలిసే అవకాశం ఇంకా రాలేదు. అయితే మా సినిమా చూశాక ఆయన అందరి గురించి బాగా చెప్పారని దర్శకుడు లక్ష్మణ్ చెప్పారు. సుకుమార్, తబిత దంపతుల దృష్టికి వెళ్లేలా లక్ష్మణ్ సినిమా పబ్లిసిటీ చేశారు. నిహారికతో మా దర్శకుడు లక్ష్మణ్ 'హ్యాపీ వెడ్డింగ్' సినిమా చేశారు. ఆమె ఈ సినిమాని వదులుకోకు అని చెప్పారు. నిహారిక 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్'కు వచ్చే కథలు ఫిల్టర్ చేసి ఆవిడ దగ్గరకు నేను పంపిస్తా. 'ఆయ్' విజయం ఈ సినిమాతోనూ కంటిన్యూ అవుతుందని ఆశిస్తున్నా.

చిన్నప్పుడు ఇంట్లో ఏడిపిస్తారు కదా... 'నువ్వు మాకు పుట్టలేదు. ఎక్కడి నుంచో తీసుకు వచ్చాం' అని! నా క్యారెక్టర్ ఏమిటంటే... 'నేను ఈ ఇంట్లో పుట్టలేదు, అల్లు అరవింద్ కొడుకును. అల్లు అర్జున్ మా అన్నయ్య' అనుకునే టైపు. ఇటీవల అల్లు అరవింద్‌ని కలిశా. ఆయన ఈ సినిమా ట్రైలర్ చూశారు. అందులో నేను అరవింద్ కొడుకును అని చెబుతా కదా! 'ఏవయ్యా... నా కొడుకు అని చెప్పుకొని తిరుగుతున్నావ్ అంట. తెలిసింది' అని సరదాగా అన్నారు. అల్లు ఫ్యామిలీకి, నాకు ఏదో కనెక్షన్ ఉందేమో! అల్లు అర్జున్‌తో 'ఓఎల్ఎక్స్' యాడ్ చేశా. అల్లు అరవింద్ బ్యానర్‌లో 'ఆయ్' చేశా. ఈ సినిమాలో అల్లు ఫ్యామిలీ మెంబర్ అని చెప్పే రోల్ చేశా.

\- హీరో అంకిత్ కొయ్య

నవచిత్రం

ఆయ్ టీమ్‌కి ఎన్టీఆర్ అభినందనలు



ఎన్టీఆర్, నార్నే నితిన్, బన్నీవాస్

"మ్యాడ్" ఫేమ్ నార్నే నితిన్, నయన్ సారిక హీరో, హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'ఆయ్'. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఈ సినిమా రిలీజైంది. తొలి ఆట నుంచే సినిమా పాజిటివ్ బజ్‌తో ఇటు ప్రేక్షకులను, అటు విమర్శకులను మెప్పించి సూపర్ హిట్ టాక్‌తో మంచి వసూళ్లను సాధిస్తోంది.

ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న 'ఆయ్' టీమ్‌కు మరో అద్భుతమైన ప్రశంస దక్కింది. ఎన్టీఆర్ చిత్ర యూనిట్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి, టీమ్‌ని అభినందించారు. మూడు పెద్ద సినిమాలతో బాక్సాఫీస్ దగ్గర గట్టి పోటీ ఉన్నప్పటికీ 'ఆయ్' చిత్రం బ్లాక్ బస్టర్ కావటంపై ఎన్టీఆర్ చిత్ర యూనిట్‌ను ప్రశంసించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మాతలుగా అంజి కె.మణిపుత్ర దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది.

మెకానిక్ రాకీ డబ్బింగ్ ప్రారంభం

హీరో విశ్వక్ సేన్ నటిస్తున్న కొత్త సినిమా 'మెకానిక్ రాకీ'. ఈ మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌కి రవితేజ ముళ్లపూడి రచన, దర్శకత్వం వహించారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గేర్, ఫస్ట్ సింగల్‌కి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఆదివారం ఈ సినిమా డబ్బింగ్ స్టార్ట్ అయ్యింది. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 31న దీపావళికి విడుదల కానుంది. నరేష్, వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘు రామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మనోజ్ కటసాని, ప్రొడక్షన్ డిజైనర్: క్రాంతి ప్రియం, ఎడిటర్: అన్వర్ అలీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యం రాజేష్, విద్యాసాగర్ జె.



విశ్వక్‌సేన్



మెగాస్టార్‌కి ఆహ్వానం

నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సెప్టెంబర్ 1న హైదరాబాద్ హైటెక్స్ నోవోటెల్ హోటల్లో తెలుగు సినీ పరిశ్రమ ఆధ్వర్యంలో గ్రాండ్‌గా సెలబ్రేషన్స్‌ని ప్లాన్ చేశారు. ఈ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు చిరంజీవిని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఫెడరేషన్ నుంచి భరత్ భూషణ్, దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్, రాజా రవీంద్ర, జెమినీ కిరణ్, కె.ఎల్.నారాయణ, మాదాల రవి, అనుపమ్ రెడ్డి, సి కళ్యాణ్, డైరెక్టర్ వీర శంకర్, నిర్మాత అశోక్ కుమార్, అనిల్ వల్లభనేని తదితరులు కలిసి ఆహ్వానించారు.

ఈ ఆహ్వానానికి చిరంజీవి సానుకూలంగా స్పందించడంతోపాటు, ఈ నాలుగు సంస్థల పెద్దలతో చేస్తున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు.



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జయశంకర్

మంగ్లీ పాడిన చిన్నారి కిట్టయ్యా.. రిలీజ్

ఆర్ వీ రెడ్డి సమర్పణలో ఆర్వీ సినిమాస్ పతాకంపై శ్రీనివాస్ రామిరెడ్డి, డాక్టర్ తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. 'పేపర్ బాయ్' దర్శకుడు జయశంకర్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు.

భారతీయ జనతా పార్టీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం 'అరి' సినిమా నుంచి 'చిన్నారి కిట్టయ్య..' లిరికల్ సాంగ్ మంగ్లీ వెర్షన్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమా గురించి వింటున్నాను. ఈ మూవీ డైరెక్టర్ జయశంకర్ గతంలో 'పేపర్ బాయ్' అనే మంచి మూవీ రూపొందించారు. ఈ సినిమా కూడా ఆయనకు సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా. ఈ సినిమాలో 'చిన్నారి కిట్టయ్య' పాట మంగ్లీ వెర్షన్‌ని రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది' అని చెప్పారు. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది.

సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్

కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న సినిమా 'జ్యువెల్ థీఫ్'. శ్రీ విష్ణు గ్లోబల్ మీడియా బ్యానర్‌పై, పీఎస్ నారాయణ దర్శకత్వంలో, ప్రొడ్యూసర్ మల్లెల ప్రభాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రేమ, అజయ్, 30 ఇయర్స్ పృథ్వీ, శివారెడ్డి, శ్రావణి, శ్వేతరెడ్డి తదితరులు నటించారు.

తాజాగా ఈ చిత్ర టీజర్‌ను 30 ఇయర్స్ పృథ్వీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'హీరోగా కృష్ణసాయి ఈ సినిమాలో యాక్షన్ పార్టులు బాగా చేసాడు. ఆయన యాక్టింగ్ ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. ఈ మూవీలో నా రోల్ కూడా బాగుంది. సినిమా సూపర్ హిట్ అవుతుందన్న నమ్మకం ఉంది' అని అన్నారు.

'ఇదొక ఓ సస్పెన్స్ థ్రిల్లర్. ఈ తరం ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది' అని హీరో కృష్ణ సాయి చెప్పారు. ప్రొడ్యూసర్ మల్లెల ప్రభాకర్ మాట్లాడుతూ, 'కృష్ణ సాయికి తగ్గ కథ ఇది. అందరి సహకారంతో సినిమా చాలా బాగా వచ్చింది. అందరిని ఆకట్టుకునే సినిమా ఇది. త్వరలోనే సినిమాను థియేటర్లలో విడుదల చేయబోతున్నాం' అని తెలిపారు.



మీనాక్షి జైస్వాల్, కృష్ణసాయి

మోడీ హిందీ మోజు

మెజారిటీ తగ్గినా వెనక్కి తగ్గని కేంద్ర సర్కారు

- ఇప్పటికే కొత్త క్రిమినల్ చట్టాల పేర్లతో కేంద్రం తీరు బహిర్గతం
- పలు పథకాలు, కార్యక్రమాలకూ హిందీలోనే నామకరణం
- జీ–20, ఇతర సదస్సుల్లోనూ 'భారత్' పేరు హైలెట్
- ఎన్డీఏ ప్రభుత్వ తీరుపై మేధావులు, భాషా నిపుణులు, విశ్లేషకుల ఆందోళన



(ఫైల్)

న్యూఢిల్లీ : కేంద్రంలో మెజారిటీ తగ్గి మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కారు.. హిందీ విషయంలో మాత్రం తన వైఖరిని మార్చుకున్నట్టు కనిపించటం లేదు. పైగా ఈ విషయంలో ఇంకా జోరుగానే ముందుకు వెళుతున్నదని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. గతనెలలో అమలులోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలలో హిందీ పేర్లు ప్రతిబింబిస్తుండటం మోడీ సర్కారు తీరుకు నిదర్శనమని వారు అంటున్నారు. వాస్తవానికి మోడీ సర్కారు పాత చట్టాల్లో చేసింది కొన్ని సవరణలేననీ, మిగతావి అంతా అలాగే ఉన్నాయని కొందరు న్యాయవాద నిపుణులు చెప్తున్నారు. అయితే, ఆ మూడు క్రిమినల్ చట్టాల పేర్లు మార్చటమే మోడీ సర్కారు లక్ష్యమనీ, అందుకే వాటిని పేర్లు మార్చి గత నెలలో అమలులోకి తీసుకొచ్చిందని వారు అంటున్నారు.

ఇది కేవలం మూడు కొత్త క్రిమినల్ చట్టాలకే పరిమితం కాలేదు.. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో అనేక కేంద్ర ప్రభుత్వ పథకాలకు హిందీ పేర్లు వచ్చి చేరాయని కొందరు విశ్లేషకులు, పరిశీలకులు చెప్తున్నారు. పాఠశాలలను స్థాపించడానికి కేంద్ర ప్రాయోజిత పథకాన్ని పీఎం–శ్రీ అని పిలుస్తారు. అలాగే, ప్రజారోగ్య కేంద్రాలను ఆరోగ్య మందిర్, గృహనిర్మాణ పథకం పీఎం–ఆవాస్, రైతులకు ఆదాయ మద్దతునిచ్చే పీఎం–కిసాన్ ఇనిషియేటివ్, ఉచిత ఆహార ధాన్యాన్నందించే పీఎం–గరీబ్ కళ్యాణ్ యోజన అనేవి హిందీ పేర్లను కలిగి ఉన్న కొన్ని కీలకమైన పథకాలు, కార్యక్రమాలు అని వారు చెప్తున్నారు. వాస్తవానికి, ఈ జాబితా చాలా పెద్దది. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో ఇంగ్లీష్ పేర్లతో ఉన్న కొన్ని పథకాలు, కార్యక్రమాల పేర్లను మార్చి ప్రస్తుత మోడీ సర్కారు హిందీలో రీ–బ్రాండ్ చేసిందని విశ్లేషకులు చెప్తున్నారు.

బీజేపీ సర్కారు తీరును తప్పుబడుతున్న మేధావులు

భారత్‌లోని ఇతర మాతృభాషలు ఉన్న భారతీయులపై హిందీని రుద్దేందుకు బీజేపీ సర్కారు అనుసరిస్తున్న వైఖరిని పలువురు మేధావులు, నిపుణులు చాలా తప్పుబడుతున్నారు. చట్టాలు, పథకాల పేరు మార్చటాన్ని 'వివేకవంతమైన పద్ధతి'గా ఒక న్యాయ నిపుణుడు అభివర్ణించారు. "చట్టాలకు హిందీలో పేరు పెట్టడం అంటే ఒక న్యాయవాది కోర్టులో చట్టాన్ని ప్రస్తావించిన ప్రతిసారీ భాషను ఉపయోగించవలసి ఉంటుంది. ఇప్పుడు హిందీ మాట్లాడని వారు తప్పనిసరిగా భాషను నేర్చుకోవాల్సిన సమస్య ఏర్పడింది" అని సదరు నిపుణుడు చెప్పారు.

'క్రమక్రమంగా హిందీని రుద్దే యత్నం'

ప్రభుత్వ పథకాలు, చట్టాలు, ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు హిందీలో పేరు పెట్టటంతో 'హిందీ మాట్లాడే వారికి' స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండానే భాషను తప్పనిసరి చేయడం సాధ్యమైందని తమిళనాడుకు చెందిన రచయిత, భాషా హక్కుల కార్యకర్త ఆజీ సెంథిల్నాథన్ వివరించారు. "వారు ఒక ఉత్తర్వును పాస్ చేస్తే లేదా హిందీ వాడకాన్ని తప్పనిసరి చేస్తూ చట్టం చేస్తే, అది వెంటనే ఎదురుదెబ్బ తగులుతుంది. ప్రజలపై హిందీని క్రమంగా విధించటానికి ఇది ఒక మార్గం. ఒక చట్టం లేదా ప్రభుత్వ పథకానికి హిందీలో పేరు పెట్టినట్టయితే.. ఆ పేరునే పలకాలి. ఉపయోగించాలి" అని ఆయన వివరించారు.

హిందీ పేర్లతో రాజకీయాలు

భావోద్వేగ అంశాలతో రాజకీయం చేయటం బీజేపీకి ఆది నుంచీ అలవాటేనని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ఇప్పటి వరకు మతం, సంస్కృతి, జాతీయ భావం అనే అంశాలతో ప్రజలలో సెంటిమెంట్‌ను రగిల్చి రాజకీయంగా లబ్ది పొందిన మోడీ సర్కారు.. హిందీ భాషను ప్రజలపై బలవంతంగా రుద్దే ప్రయత్నం చేసి రాజకీయంగా లబ్ది పొందే యత్నం చేస్తున్నదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. సాధారణంగా, దేశవ్యాప్తంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి ఈ హిందీ భాష అమలుపై తీవ్ర వ్యతిరేకత వస్తుంది. ముఖ్యంగా, తమిళనాడు ఈ విషయంలో ముందుంటుంది. అయితే, ఈ ఏడాది దక్షిణాది రాష్ట్రాల ఎన్నికలేవీ లేకపోవటం, హిందీ మాట్లాడగలిగే రాష్ట్రాలలో ఎన్నికలు రానుండటంతో మోడీ సర్కారు హిందీ భాషపై మరింత దూకుడుతో ముందుకెళ్తున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ, దీనిపై స్థానికంగా ఉండే పార్టీల నుంచి వ్యతిరేకత వచ్చినా.. దానిని కూడా రాజకీయంగా వాడుకోవచ్చునే ఆలోచనలో కాషాయపార్టీ ఉన్నదని వారు చెప్తున్నారు.

అంతర్జాతీయ సమ్మిట్‌లలోనూ 'భారత్'

గతేడాది భారత్‌లో జరిగిన జీ–20 సమ్మిట్‌లో 'భారత్' అనే పేరును మోడీ ప్రభుత్వం హైలెట్ చేసిందనీ, దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చేసిందని కొందరు విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అయితే 'ఇండియా' బ్లాక్ పేరుతో అప్పటికే కూటమిని ఏర్పాటు చేసుకున్న పార్టీలకు దేశం పేరు ఎన్నికల్లో లబ్దిని చేకూర్చే అవకాశమున్నదన్న ఆలోచనతోనే మోడీ సర్కారు 'భారత్'ను తెర పైకి తెచ్చిందని వారు విశ్లేషిస్తున్నారు. మరొక అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశం గురించి అధికారిక నోట్‌లో కూడా మోడీని "భారత్ ప్రధాన మంత్రి" అని అభివర్ణించారు. ఇక అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ భారతదేశ సెంట్రల్ బ్యాంక్‌ను "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ భారత్" అని పిలవాలని డిమాండ్ చేశారు.

అయితే, మోడీ ప్రభుత్వం మూడో దఫా కూడా ఇదే ట్రెండ్ కొనసాగిస్తున్నది. ఈ నెల ప్రారంభంలో, పౌర విమానయాన మంత్రి బ్రిటిష్ కాలం నాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం, 1934 స్థానంలో బిల్లును ప్రవేశపెట్టారు. దీనిని భారతీయ వాయుయాన్ విధేయక్, 2024 అని పిలుస్తారు. దీనిని వ్యతిరేకించిన ఎంపీలలో ఒకరైన కేరళకు చెందిన రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీకి చెందిన ఎన్‌కె ప్రేమచందన్.. దాని పేరు ఉచ్చరించటం కష్టమన్నారు. అందుకే దానిని వ్యతిరేకించినట్టు చెప్పారు. బిల్లుకు హిందీలో పేరు పెట్టటం రాజ్యాంగంలోని ఆర్టికల్ 348, 120కి విరుద్ధమని ప్రేమచందన్ వాదించారు. పార్లమెంటులో మాతృభాషలో మాట్లాడే కొంతమంది ఎంపీల ప్రసంగాలను ప్రభుత్వం నిర్వహించే సంసద్ టీవీలో ప్రసారం చేస్తున్నప్పుడు హిందీలోకి డబ్ చేయటం ఆర్టికల్ 120 ఉల్లంఘన కిందకు వస్తుందని ఆయన ఆరోపించారు. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరికా ఘోష్‌ల ఆంగ్ల ప్రసంగాలు కూడా హిందీలోకి డబ్ అయ్యాయని సోషల్ మీడియా నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తమిళ రచయిత సెంథిల్నాథన్ మాట్లాడుతూ.. "హిందీని ప్రయోగించి.. హిందీ మాట్లాడే ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలని కేంద్రం భావిస్తున్నది. హిందీ మాట్లాడేవారు తమ భాషకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం చూసి గర్వపడుతున్నారు" అని అన్నారు.

అయితే, భారత్ అంటేనే భిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు, భాషలు, ఆచారాలకు కేంద్రమనీ, అలాంటి దేశంలో హిందీ అనే ఒకే భాషను కోట్లాది మంది ప్రజలపై రుద్దటం ఏ మాత్రమూ సరికాదని నిపుణులు, మేధావులు అంటున్నారు. అయితే, చట్టం రూపంలో దీనిని అమలు చేయకపోయినప్పటికీ.. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాంతాల పేర్లను మార్చటం ద్వారా హిందీ భాషను ప్రజలపై బలవంతంగా రుద్దాలని చూస్తున్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆటలు

అది మానని గాయం!

పారిస్ ఒలింపిక్స్‌పై వినేశ్ ఫోగట్



నవతెలంగాణ-చండీగఢ్

పారిస్ ఒలింపిక్స్ నుంచి స్వదేశం చేరుకున్న వినేశ్ ఫోగట్ అభిమానుల అపూర్వ ఆదరణ, ప్రేమాభిమానులను చూరగొన్నది. మహిళల 50 కేజీల ఫ్రీ స్టయిల్ విభాగంలో ఫైనల్‌కు చేరుకున్న వినేశ్ ఫోగట్ కనీసం రజత పతకం ఖాయం చేసుకున్నది. కానీ పసిడి పోరుకు ఉదయం బరువు ఓ 100 గ్రాములు అధికంగా ఉన్నది. దీంతో ఒలింపిక్స్ నిర్వహణ కమిటీ, యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్‌లు వినేశ్ ఫోగట్‌పై అనర్హత వేటు వేయటంతో పాటు ఆమె నుంచి సిల్వర్ మెడల్‌ను సైతం లాగేసుకున్నారు. ఈ నిర్ణయాన్ని కాస్ (కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్)లో వినేశ్ ఫోగట్ సవాల్ చేసింది. వినేశ్ ఫోగట్ తరఫున ఫ్రెంచ్ న్యాయవాదులు వాదనలు వినిపించగా.. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సైతం వినేశ్ ఫోగట్‌కు మెడల్ ఇవ్వాలని వాదించింది. తీర్పును మూడుసార్లు వాయిదా వేసిన కాస్ న్యాయమూర్తి.. ఆఖరుకు వినేశ్ ఫోగట్ అప్పీల్‌ను తిరస్కరించారు. సంయుక్త రజత పతకం ఇవ్వటం కుదరదని తేల్చిచెప్పారు. కాస్ తీర్పు కోసం పారిస్‌లోనే ఉండిపోయిన వినేశ్ ఫోగట్ కాస్త ఆలస్యంగా శనివారం స్వదేశం చేరుకున్న సంగతి తెలిసిందే. ఉదయం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న వినేశ్ ఫోగట్.. అర్ధరాత్రి అనంతరం స్వగ్రామం చేరుకుంది. స్వగ్రామానికి వినేశ్ ఫోగట్ ప్రయాణం ర్యాలీగా సాగగా.. దారిపొడవునా అభిమానులు, ప్రజల ప్రేమాభిమానులతో వినేశ్ తీవ్ర భావోద్వేగానికి గురైంది. స్వగ్రామంలో ప్రజలు బంగారు పతకం బహూకరించిన అనంతరం వినేశ్ ఫోగట్ భావోద్వేగంగా మాట్లాడింది.

'ఇంతటి అభిమానం, ప్రేమకు నేను అర్హురాలు అవునో కాదో నాకు తెలియదు. ఇటువంటి ప్రాంతంలో పుట్టినినందుకు ఎంతో అదృష్టవంతురాలిగా భావిస్తున్నాను. ఈ గ్రామంలో నా సహచర సోదరీమణులకు మల్లయుద్ధం శిక్షణ ఇస్తాను. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు పతకాలు సాధించగల రెజ్లర్లను సిద్ధం చేస్తాను. మీ అందరి ప్రేమ, అభిమానానికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. పారిస్ ఒలింపిక్స్ పతకం దక్కకపోవటం లోతైన గాయం చేసింది. ఆ వేదన నుంచి కోలుకునేందుకు సమయం పడుతుంది. కానీ నా దేశ ప్రజలు, నా గ్రామ ప్రజల ప్రేమతో ఆ గాయం త్వరగా నయం అవుతుందని అనుకుంటున్నాను' అని వినేశ్ ఫోగట్ అన్నారు.

వినేశ్‌కు స్వర్ణం



భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్‌కు అపూర్వ గౌరవం లభించింది. పారిస్ ఒలింపిక్స్‌లో సంయుక్త సిల్వర్ మెడల్ విజేతగా నిలిచే అవకాశం కోల్పోయిన వినేశ్ ఫోగట్‌ను స్వగ్రామ ప్రజలు హృదయానికి హత్తుకున్నారు. మహిళల 50 కేజీల ఫ్రీ స్టయిల్ విభాగం ఫైనల్‌కు చేరుకునే క్రమంలో ముగ్గురు రెజ్లర్లను మట్టికరిపించిన వినేశ్ ఫోగట్‌కు బంగారు పతకం బహూకరించారు. శనివారం అర్ధరాత్రి అనంతరం స్వగ్రామం బాలాలీ చేరుకున్న వినేశ్ ఫోగట్‌కు ఘన స్వాగతం లభించింది. గ్రామంలోని మహిళలు, యువత, గ్రామ పెద్దలు వినేశ్ ఫోగట్‌ను పూల దండలతో ఆహ్వానించారు. బరువు తగ్గే క్రమంలో అనారోగ్యానికి గురైన వినేశ్ ఫోగట్ పూర్తి ఆరోగ్యం సాధించాలని ఆమెకు దారి పొడవునా ప్రజలు పాలు అందించారు. గతంలో బాలాలీ గ్రామ ప్రజలు ప్రకటించి నట్టుగా.. వినేశ్ ఫోగట్‌కు బంగారు పతకం ప్రదానం చేశారు. వినేశ్ ఫోగట్‌కు పతక ప్రదాన కార్యక్రమం శనివారం అర్ధరాత్రి 2 గంటలకు ముగిసింది. అప్పటి వరకు బాలాలీ గ్రామ ప్రజలతో పాటు అభిమానులు, సమీప గ్రామాల నుంచి ప్రజలు వినేశ్ ఫోగట్ ర్యాలీలో పాల్గొన్నారు.

యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు అభినందనీయం

వ్యాయామవిద్య ఉపాధ్యాయం సంఘం నేతల హర్షం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేయనుండటం పట్ల వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (పెటా టీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి. రాఘవ రెడ్డి, పొన్నగాని కృష్ణమూర్తి గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. '200 ఎకరాల సువిశాల ప్రాంగణంలో 12 స్పోర్ట్స్ అకాడమీలు, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్లు నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటం అభినందనీయం. రాష్ట్ర బడ్జెట్‌లోనూ క్రీడలకు రూ.325 కోట్లు కేటాయించి పెద్ద పీట వేశారు. దక్షిణ కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ సాంకేతిక సహకారంతో ఏర్పాటు కాబోతున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో రాష్ట్ర క్రీడాకారులకు ప్రపంచ స్థాయి సదుపాయాలు లభించనున్నాయని' అని ఓ ప్రకటనలో తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.